
# తీయని చుట్టరికం

## (వింధియా కధలు)




అనువాదం: కే.వి.శేషారావు/ఏండి సుందరేశన్

**TEEYANI CHUTTARIKAM (Vindhiya Kathalu)**
(Anthology of Vindhiya's Tamil Short Stories)
తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

సంపుటం - 4

**First Edition, 2019**
© KNS Family/Surviving Members

***Front Cover Design:***
Sonia Garcia

The front cover illustration is from the ***Kalaimagal*** issue dated January 3, 1955. Used with permission.

The translator acknowledges with thanks the permission to use the illustrations from the various magazines that originally published these short stories.

***Photo Credits:***

***Back Cover:***
Thota Photo Studio, Berhampur, Orissa, India

**Printed at:**

The Copy World
1375 University Avenue
Berkeley, CA 94702
Telephone: 1-800-690-2679 (Toll Free)

# తీయని చుట్టరికం

## (విండియా కధలు)

## మూలం: తమిళం

## అనువాదం:

## కే.వి.శేషారావు/ఏండి సుందరేశన్

## Published By

**Kurinji Publications**
**El Cerrito, CA 94530, USA**
**10944 San Pablo Avenue # 610**
**Email: rangan.sundaresan@gmail.com**

# ఇందులో


ముందు మాట

1. తీయని చుట్టరికం
2. ఇవేం అలనాటి కధలా?
3. ముకుళిత హస్తాలు
4. పూల దండ
5. కారుణ్యం తొణికే నయనాలు
6. నా డైరీలో కొన్ని గురుతులు
7. కొంగ్రొత్త మాసం
8. మంచి ఉపాయం
9. క్రైస్తు జన్మదినం
10. కళంకం

# తీయని చుట్టరికం

## (వింధియా కథలు)

### మూలం: తమిళం

### అనువాదం:

### కే.వి.శేషారావు/ఏండి సుందరేశన్

## Published By

**Kurinji Publications**
**El Cerrito, CA 94530, USA**
**10944 San Pablo Avenue # 610**
**Email: rangan.sundaresan@gmail.com**

# ఇందులో

ముందు మాట

1. తీయని చుట్టరికం
2. ఇవేం అలనాటి కథలా?
3. ముకుళిత హస్తాలు
4. పూల దండ
5. కారుణ్యం తొణికే నయనాలు
6. నా డైరీలో కొన్ని గురుతులు
7. కళంకం
8. మంచి ఉపాయం
9. క్రైస్తు జన్మదినం
10. కొంగ్రొత్త మాసం

# ముందు మాట

ఈ సంపుటం - ***తీయని చుట్టరికం (వింధియా కథలు)*** - పూర్తి అవడంతో నలభై కథలు తమిళంలోనుంచి తెలుగులో అనువదింపబడి e-books గా వెలుబడ్డాయి. వీటిని మీరు http://kinige.com/ksearch.php?searchfor=sundaresan లో చదవగలరు.

ఈ సమయంలో నాకు వింధియా సాహిత్య ఉద్యమం, రచనావిశేషం, నాకు మా అక్కయ్య సాహిత్యంలోని అభిరుచి - వీటిగురించి కొన్ని కబుర్లు చెప్పాలని ఉంది.

వింధియాకి సంతానం లేదు. ఆవిడ రచనలన్నిటినీ సేకరించి, ఒక స్మారక చిహ్నంగా **వింధియా - సమగ్ర సాహిత్యం** - అనే గ్రంథం ప్రచురించాలని మేం - Prof. K.N. సుందరేశన్ కుటుంబ సభ్యులు - నిశ్చయించాం.[1]

ఈ ప్రచురిత గ్రంథం మూలంగా మా బావగారు Prof. V. సుబ్రహ్మణ్యంగారి కోరికకూడా నెరవేరుతుందనే తృప్తి నాకు కలుగుతోంది. వింధియాకి సిద్ధించిన సాహిత్య కీర్తికి ఆమె భర్తకూడా దోహదం చేసారు. 1997 లో అక్కయ్య సెల్వి విశ్వనాధన్ కటకంలో అతన్ని కలుసుకున్నప్పుడు బావగారు రాబోయే తరాలకి వింధియా రచనలు అందినట్టు మేమేమైనా చెయ్యాలని తన అభిలాష తెలియజేసారు. దానితోబాటు వింధియా రాసిన ఒకే ఒక నవలని సెల్వికి ఇచ్చి దాన్ని ప్రచురించమన్నారు. ***సుదందిరప్పోర్*** అనే పేరుతో ఆ నవల 2012 లో వెలుబడింది; 2015 లో Kurinji Website లో దాన్ని చేర్చడమైంది. ఆ తరువాత ***రాజేశ్వరి*** అనే పేరుతో దాని ఇంగ్లీషు (2014), తెలుగు (2018) అనువాదాలు వచ్చాయి.

ఇక రచయతల మాటకొస్తే వాళ్ళ జీవితం మనకి సాధారణంగా కనిపించవచ్చు. కాని సామాన్యప్రజల సాంసార ఘటననలని ఆరసించి తన కల్పనాశక్తి, నవీకరణ

---

[1] ఇటీవల వింధియా రచనలు - తమిళంలో ఆవిడ రాసినవి - పోగుచేసి **Vindhiya - Her Complete Works in Tamil అనే గ్రంథం (రెండు సంపుటాలు) Library of Congress, Washington, DC కి అందించడమైంది.**

మూలంగా రచయతలు కథలని సృష్టించడం మనం చూస్తాం. అక్కయ్య ఇందియా 'వింధియా' అనే పేరుతో రాసిన కథలు కూడా అలాగే రూపొందాయి. మాది తమిళ కుటుంబం, కాని ఆవిడ చదువంతా తెలుగు మాధ్యంలోనే జరిగింది. ఇంటిలో మా నాన్నగారి ప్రేరేపణతో తమిళ బాషలో రాయడం, చదవడం నేర్చుకున్నారు. అదే తన రచనలకి అవలీలగా ప్రయోగించారు. తన పదహారో వయసులో పెళ్ళైన తరువాత ఆవిడ ముందు దక్షిణ దేశంలోనూ, ఆ తరువాత కటకంలోనూ స్థిరపడ్డారు. ఆవిడ కథల్లోని పాత్రలందరూ సామాన్య ప్రజలే; ఇతివృత్తాలకి ఆధారం సామాన్య, సాంసారిక ఘటనలు. పెద్ద సంఘర్షణలు, పోరాటాలని కనిపించకపోయినా ఈ కథల్లో పాత్రలలో మానసిక లోచూపు, వారి చిత్రీకరణ, మనం చూస్తాం.

ఇక్కడ ఒక విషయం చెప్పి తీరాలి. వింధియా కథలు తమిళ జనరంజక పత్రికలలో వచ్చినప్పుడు - అంటే 1947-60 సంవత్సరాలలో అన్నమాట! - వాటిని ఆసక్తితో చదివినట్టు నాకసలు గుర్తులేదు! ***కల్కి***, ***కలైమగళ్*** పత్రికలలో ఆవిడ బహుమతులందుకున్న కథలు చదివాను గాని వాటిగురించి అక్కయ్యకి ఎప్పుడైనా నా అభిమానం, మెచ్చుకోలు తెలియజేసినట్టు జ్ఞాపకం లేదు. ఆవిడ రాసిన మరే కథలూ చదవనేలేదనుకుంటాను. ఒకసారి మా అమ్మతో “అసలు మన ఇందియా కథల్లో ఏం జరుగుతుందో నాకు అర్థం కావటంలేదు!” అని అన్నట్టు గుర్తుంది. “నీకివన్నీ ఇప్పుడు నచ్చకపోవచ్చు! వయస్సు వస్తే నీ మనసు తప్పక మారుతుంది!” అని ఆవిడ అన్నారు. అమ్మ అభిప్రాయం ఎంత నిజమని నాకిప్పుడు తెలిసింది.

ఇవన్నీ సుమారు డెబ్బై సంవత్సరాలకి ముందు వింధియా రాసిన కథలు. నేను వాటిని చదివి, అలవరచుకొని, తెలుగులో అనువదించిన తరువాత వాటిగురించి ఇతర కుటుంబ సభ్యుల చర్చల్లో పాల్గొనడం నాకు దొరికిన ఒక తరుణం, భాగ్యం అనే భావన కలుగుతోంది. ఒక్కొక్క కథ వెనుకా ఒక ఇతివృత్తం, ప్రమేయం ఉందని ఊహించి మామధ్య జరిగే సంప్రదింపులద్వారా అక్కయ్య ఇందియా మాకు మళ్ళీ కొత్తగా

పరిచయంమవడం జరుగుతోంది. ఇది మాకు దొరికిన దీవెన అని మేం ఆహ్లాదపడుతున్నాం.

ఎప్పటిలాగే ఈ సంపుటంకి సలహాలతో, సూచనలతో తోడ్పడిన అక్కయ్య సెల్వి విశ్వనాథన్ కి నా కృతజ్ఞతలు, ఇందులోవున్న మూడు కథలు అనువదించిన మిత్రులు కే.వి. శేషారావుగారికి మళ్ళీ నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

నవంబరు, 2019 ఏండీ సుందరేశన్

# అనువాదకుల పరిచయం

**కే.వి.శషారావు:**

జననం 1931, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేష్ లో. చదువు, (B.A), ఏ. వి.ఎన్, విశాఖపట్టంలో. 1956 నుంచి 1989 వరకూ Indian Railways లో ఉద్యోగం. యాభై సంవత్సరాలకు పైగా తెలుగు సాహిత్యంకి, ఔత్సాహిక నాటక రంగానికి కృషి చేసారు. బరంపురంలో ఆంధ్ర సంస్కృత సమితి, విజయనగరంలో కవిరాజ స్మారక ఆంధ్ర సమితి స్థాపించి నిర్వహించారు. లలిత కళా ప్రదర్శనలు ఏర్పాటు చెయ్యడంతోబాటు కన్యాసుల్కం వంటి ప్రసిద్ధమైన నాటకాల్లోకూడా నటించారు. రాజాజీ ఆంగ్లంలో రచించిన శ్రీ రామాయణం, మహాభారతం, ఉపనిషత్తులు, సంక్షిప్త భగవద్గీత, మహాత్మా గాంధీ ఆత్మకధ, తెలుగులో అనువాదం చేసారు.

ఇప్పుడు విజయనగరంలో స్థిరపడ్డారు. వీరి తండ్రిగారు కేశవమఠం లేటు తాండవ కృష్ణయ్యగారి స్మృతి చిహ్నంగా విజయనగరం 'ప్రేమ' సమాజం ముఖద్వారం నిర్మింపజేసారు.

**ఏండి సుందరేశన్:**

జననం 1939 బరంపురం, ఒడిషాలోని గంజాం జిల్లాలో. ఇంజనీయరుగా తమిళనాడులో 14 సంవత్సరాలు ఉద్యోగం చేసి, ఆ తరువాత అమెరికాలో M.B.A. చదవడానికి వచ్చి, 1977లో అమెరికాలోనే స్థిరపడిపోయారు. ఉద్యోగ విరమణ తరువాత, ఇరవైఐదు సంవత్సరాలుగా తమిళ కధలు, నవలలు ఆంగ్ల, తెలుగులో బాషల్లోకి అనువాదం చేస్తున్నారు. 2013 లో ఇతను అనువదించిన నీల పద్మనాభన్ తమిళ నవలని Autumn Reveries అనే పేరుతో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. దానికి 2016 లో **నల్లి చెన్నై దిశై ఎట్టుమ్** సంస్థ బిరుదు లభించింది.

********



# తీయని చుట్టరికం

శారద తొందరతొందరగా కొప్పులో సూదులు దూర్చుకుంటూ భర్త దగ్గరకి వచ్చింది. "చూడండి నాకేశాలంకారం, సరిగ్గా ఉందా?" అని తలవొంచి అతన్ని అడిగింది. "ఈ రెండు చీరలలో ఏది మీకు నచ్చిందని చెప్పండి; బయట మహా ఎండగా ఉంది," అని అంటూ పక్కనే మంచంలో దోమతెరకి సమీపంలోవున్న రెండు చీరలు భర్తకి చూపించింది.

ఒకటి వసంతఋతువుని రాకని చూపే చిగురాకులాగ - మామిడి వర్ణంలో; ఇంకొకటి భూమాదేవిని పూర్తిగా అలవరించుకొనే నీలాకాశం రంగులో . . .

"నీకేది నచ్చిందో అదే కట్టుకో . . . ఏం, నీలరంగు నీకు ఇష్టంలేదా?" అని అడిగాడు గణపతి.

"ఎందుకు మళ్ళీ నిన్న కట్టుకున్న అదే చీర? ఏం, ఈ మామిడి రంగు బాగా లేదా? . . . సరే, ఈ రెండూ వద్దు . . . మరొక చీర తీస్తాను . . . " అని శారద మూలనున్న బీరువా పక్క తిరిగింది.

"మరి ఆ చీరని కట్టుకొనేది ఎప్పుడు?"

శారద దిగ్గున తిరిగిచూసింది.

"దానికి ఎప్పుడు వేళ వస్తుందో ఆ రోజు వాడుతాను!" అని అంటూ చెయిలోని చీరని భుజంమీద వేసుకుంది; దడాలున బీరువాని మూసి పక్కనేవున్న గదిలో మాయమైంది. కొంచెం సమయం తరువాత దుస్తులు మార్చుకొని బయటికి వచ్చింది. చిన్నచిన్న చతురస్రలు చీరని అలముకొనివున్నాయి. చీరని, చీరమడిమని సరిదిద్దుకుంటూనే "ఈ పట్టుచీర ఎంత బాగుంది! ఇలాంటి చీరలుగాని కొనివుంటే ఎంత బాగున్ను! దానికి బదులు నలభై రూపాయలు వ్యర్థం చెయ్యడమైంది!" అని భర్త చెవులకి వినిపించినట్టు మాటాడుతూ హాలులో ఇలా అలా నడిచింది.

"అది మనం కావాలని కొన్నామా? అలాంటి ఒక నిర్బంధం ఏర్పడింది; నీకు నచ్చకపోతే ఇరుగుపొరుగుల్లో దాన్ని ఎవరైనా తీసుకుంటారు. వాళ్ళని అడగ్గూడదా?"

"అవును, నాకు మరేం పనిలేదు!" అని శారద విసుగ్గుంది.

"అదే నేననేది. వాళ్ళని అడిగిచూడు!"

"చాల్లేండి మీ వాదం! ఒక కార్డు రాసి అతన్ని అడగమంటే మీకు చేతకాదు! నేను ఆ చీర అమ్మాలంటున్నారు. ఎవరిని అడగడం? పోనీలెండి, నలభైరూపాయలు దానం చెసినట్టే లెక్క . . . "

"రాసినా లాభం లేదని చెప్పానుగా? అతనుగాని జవాబు రాసే మనిషైతే జీతం రాగానే మనకి డబ్బు పంపించివుంటారే! డబ్బు పంపించినా 'చీర తిరిగి పంపవద్దు!' అనే రాసివుంటారు. మనం బలవంతంగా చీర పంపుతాం అనే ఊహతో డబ్బు పంపించక, ఏ ఉత్తరమూ రాయకుండా ఉన్నారు అతను! నూరు రూపాయల చీరకి మనం నలభై రూపాయలిచ్చాం, అది మనకి మంచిదైంది. నువ్వూ ఆ చీర వాడవచ్చు; ఇందులో తప్పేముంది?"

"అవును, ఏ తప్పూ లేదు! మీకు జ్ఞాపకం ఉందా? ముందొకసారి మీ మామయ్య కూతురు కట్టుకున్న కధరు సిల్కు నాకు నచ్చిందని దాన్ని అడిగి కట్టుకున్నాను. అప్పుడు మీరేమన్నారో గుర్తుందా? 'నీకేం మరేం చీరలే లేవా? నీకెందుకు దాని చీర?' అని మీరు అడగలేదూ? కాని ఇప్పుడు ఇలా మాటాడుతున్నారు! ఈ చీరంటే ఇప్పుడు గొప్ప అన్నమాట, అవునా?"

శారద తనమీద ఇలా పైబడుతుందని గణపతి ఎదురుచూడలేదు.

"నీకూ తెలుసుగా? ఆ సమయంలో మనకి వేరే దారి కనిపించలేదు!" అని మాత్రం అన్నాడు.

శారద మరేం అనక ఊరుకుంది. "సరే, నాకు టైమైంది. నేను వెళ్ళాలి . . . " అని బయలుదేరడానికి సిద్ధమైంది. ఇంతలో పనిమనిషి ఒక రిక్షాని పిలుచుకొని వచ్చింది. వయలిన్ పెట్టెని తీసుకొని, దాన్ని సవరించుకొని, శారద రిక్షాలో ఎక్కి కూర్చుంది.

మనుషులూ, వాహనాలూ, వేరే వేరే మార్గాల్లో ప్రయాణం చెయ్యాలని నిబంధనలున్నాయి; కాని అటువంటి పరిస్థితిలోనూ దుర్ఘటనలు జరగడం సహజమేకదా? మానవస్మరణ కూడా అలాగే; మనం ఎన్నివిధాలుగా ఆలోచించినా తికమకలు తప్పనిసరిగా అనుభవించితీరాలి!

'ఆ సమయంలో మనకి వేరే దారి కనిపించలేదు' అని గణపతి అన్నాడు. ఇప్పుడు తన స్నేహితురాలిని కలుసుకొనే ప్రయాణంలో శారద ఆ మాటలు గుర్తుచేసుకుంది. 'అవును, నిజం, మరేం దారి కనిపించలేదు!' అని తనలో సణుక్కుంది.

** ** **

శారద, గణపతి దంపతులు దసరా సెలవులలో కలకత్తా వెళ్ళారుగా, అప్పుడే ఆ ఘటన జరిగింది. తిరిగివచ్చినప్పుడు ఒక పెద్దాయన వాళ్ళకి పరిచయమయ్యారు. అతను రైలు ప్రయాణంలో చాలా చనువు, సాన్నిహిత్యంతో మెలిగారు. అతను చూపిన యోగ్యతాపత్రికలు, వ్యక్తిగత జీవితంలో అతని సాధనలు విని దంపతులు విస్తుపోయారు. అతని ఆచారవ్యవహారాల్లో ఎటువంటి కపటమూ లేదు. జీవితంలో సుఖము, దుఃఖము రెండూ అనుభవించిన వ్యక్తి అతను అని తెలిసింది. అతనికి వేరే ఊరులో బదిలీ అవడంవలన ప్రయాణం చేస్తున్నారని తెలిసింది. 'ఈ మార్గంలో మళ్ళీ వస్తే మా ఇంటికి రండి,' అని గణపతి అన్నాడు; శారదకూడా ఆహ్వానించింది. సరేనని చెప్పి అతను సెలవు తీసుకున్నారు.

అకస్మాత్తుగా, రెండువారాలతరువాత, ఆ పెద్దాయన వాళ్ళ ఇంటిముందు దర్శనమిచ్చారు. అతను వచ్చిన కారణం మెల్లమెల్లగా బయలుపడింది. అతని ఆర్థిక సహాయం కావాలని, అదెలా తటస్థించిందని వివరించారు; అది నిజమని దంపతులు వెంటనే గ్రహించారు. రైలుప్రయాణంలో అతను చెప్పినదానికి, ఇప్పుడు అతను ఎదుర్కొనే ప్రశ్నకి పొత్తు ఉన్నట్టు తెలిసింది; అతని ధోరణి ఏమిటో బాగా అర్థమైంది.

గణపతి దగ్గర డబ్బు లేదు. దసరా సెలవులలో ఎన్ని ఖర్చులు! శారదకి చెప్పాడు.

"బాగుంది, అతను మనల్ని అడుగుతున్నారా?" అని అంటూ శారద నవ్వింది. 'మనదగ్గర డబ్బుంటే నేనొక శాంతినికేతన్ చీర కొనివుంటానే!' అని మనసులో అనుకుంది.

వచ్చిన ఆయన తన పెట్టెనుంచి ఒక చీర బయటకి తీసారు. "ఇది తీసుకొని నాకు యాభై రూపాయలు ఇవ్వండి" అని అడిగారు.

"అసలు నా దగ్గర డబ్బు ఉంటే మీకు తప్పకుండా ఇచ్చివుంటాను; ఈ చీర తీసుకొనే మీకివ్వాలా?" అని అడిగాడు గణపతి.

"నా మాట వినండి. నాకిప్పుడు డబ్బు అత్యవసరంగా కావాలి. ఈ విధంగా మీరు ఋణం ఇస్తే నా మనసుకి తృప్తిగా ఉంటుంది," అన్నారు అతను.

ఆ చీరని గణపతి భార్యకి చూపి అతని కోరికని తెలియజేసాడు.

గంధపు వర్ణంలో చీర కళ్ళకి ఇంపుగా కనిపించినా "ఇప్పుడుమాత్రం మనదగ్గర డబ్బెక్కడ వస్తుంది?" అని శారద భర్తతో వాదించింది.

"ఇంటి అద్దెకని తీసిపెట్టాను. అదే ఇవ్వదలచుకున్నాను; మరేం దారి లేదు."

"అంటే ఈ చీర మనమే ఉంచుకోవాలా? ఇది చాలా ఖరీదైన చీరలాగ కనిపిస్తోందే?"

"యాభై రూపాయలు నాకు చేతకాదు; నలభై రూపాయలే ఇవ్వగలను."

"మనకి చీర అత్యవసరం కాదు. అతను ఊరికి వెళ్ళినతరువాత డబ్బు పంపితే చాలు. మనకి అతనిమీద నమ్మకం ఉందా అని అతను ఆలోచిస్తున్నారు కాబోలు, అదీ మంచిదే."

గణపతి చీరతో అతన్ని కలుసుకున్నాడు. "ఈ చీర మీరు తీసుకోండి. ఊరుకి వెళ్ళినతరువాత  డబ్బు పంపండి" అన్నాడు.

"ఎందుకూ, అది మీదగ్గరే ఉండనీ!" అని అంటూ అతన పెట్టె మూసేసి వెళ్ళిపోయారు.

ఆ తరువాత అనుమానంతో శారద ఆ చీరని విప్పి చూసింది; అప్పుడే అదేం కొత్త చీర కాదని తెలుసుకుంది. ఇంతకుముందు ఎవరో కట్టుకున్న చీర అనే సూచనలు రూఢంగా కనిపించాయి: అక్కడక్కా మడతలమధ్య అడుగుజాడలతో కనిపించే కాలిబాటలాగ కొన్ని గుర్తులు చోటుచేసుకున్నాయి.

"నేనదే అనుకున్నాను. ఆ చీర అతని భార్యది కాబోలు! ఆవిడ పోయి పది సంవత్సరాలయినట్టు అతను చెప్పారుగా?" అని తనలో చెప్పుకుంటూ శారద ఆ చీరని మడతబెట్టింది. ఆ రోజు ఆ పెద్దాయన దాన్ని కాగితంలో మడిచి యిచ్చినట్టు అలాగే ఆ చీరని బీరువాలో మళ్ళీ భద్రపరచి, ఆ తరువాత దాన్ని ఆమె ముట్టుకోలేదు; ఆ చీరంటేనే ఏవగింపు వచ్చేసింది.

ఏం, ఎందుకు? అల్ప ఆయుషులో గతించిన ఒక స్త్రీ వాడిన చీర అని భయమా లేక తనెరుగని ఒక ఇల్లాలు కట్టుకున్న చీర అని ద్వేషమా? 'అతను డబ్బు

పంపించగానే ఈ చీర అతనికి పంపించేయాలి!' అనే ఆలోచన వలన 'అది నాకు సొంతం కాదు!' అనే భావన శారద మనసులో నిలిచిపోయిందా? అంతేకాదు. 'ఆ చీరని తాకట్టుపెట్టి ఋణం ఇచ్చినందుకు మనం సిగ్గుపడాలి!' అని శారద మనసు బాధపడుతోందా? ఎది ఏమైనా, ఆఖరికి ఆ గంధపు వర్ణం చీర ఇతర చీరలతో పొత్తులేకుండా బీరువాలో ఒక మూల దిక్కులేని పొట్లంలో అలాగే ఉంది.

** ** **

"ఉత్తరం రాసినా ఏ లాభం లేదు; కళ్ళు మూసుకొని ఆ చీర కట్టుకో!" అన్నాడు గణపతి.

"ముందు దాన్ని చెయిలో ముట్టుకుంటేనే నాకు రోతగా ఉంది!"

"నేను పొట్లంనుంచి చీరని తీసి నీకు ఇస్తానులే! కాని చీరకట్టు నేర్పించడం నాకు చేతకాదు!"

ఇలాగే నవ్వులాట, హాస్యంతోబాటు, ఏవేవో మాటలు చెప్పుకుంటూ - పెళ్ళి సంబరాల్లో వధూవరులు పన్నీరు, గంధాలు ఒకరిమీదనొకరు జల్లుకున్నట్టు - గణపతి, శారద రోజులు గడిపారు; కాని ఇవాళే ఆ ఆట ఒక తీవ్రమైన జగడంలాగ మారింది.

'వద్దు, ఆ చీర నాకు వద్దేవద్దు! . . . అలాగైతే, మరి ఆ చీర గతి? దానిగురించి ఎందుకు ఆరాటం? కాని తగలపెట్టిన డబ్బు? . . . ' అని శారద వాపోయింది.

కపటం, మోసం ఎరుగని శారదకి ఆ చీర ఒక పెద్ద ప్రశ్నగా కనిపించింది. స్వచ్ఛమైన పట్టు, బంగారు జరీ మిశ్రమంతో అది చూసినవారిని ఆకర్షిస్తుంది. 'ఎప్పుడు, ఎక్కడ కొన్నావ్?' అని స్నేహితులెవరైనా అడిగితే ఏం సమాధానం చెప్పడం? 'మావారు నాకు బహుమతిగా కొన్నారు, దాని వెల నాకు తెలీదు!' అని చెప్పి తప్పించుకోవచ్చు. అవును, అలాగే చెప్పాలి! కాని ఆ చీర కట్టుకున్నప్పుడెల్లా తన మనసు ఇబ్బంది పడుతూనేవుంటుంది; అలాంటప్పుడు ఆ చీర తనెందుకు వాడాలి?'

** ** **

రిక్షా తన గమ్యం చేరుకుంది. స్నేహితురాలు తులసి ఉత్సాహంతో శారదకి స్వాగతం చెప్పింది. అక్కడున్న ఇతర స్త్రీలు శారదని వయలిన్ తో చూడగానే ఆమె రాబోయే

నాట్యబృందంలోని వయలిన్ ఆర్టిస్ట్ అని ఊహించారు. రాబోయే ప్రజాతంత్ర ఉత్సవంలో, గవర్నరున్న రాజభవనంలో ఆ కార్యక్రమం జరగబోతుంది. ఆ కచేరీకి అభ్యాసం తులసి ఇంటిలో జరుగుతోంది. తులసికి శారద అంటే సానుభూతి ఉంది. శారదకి వయలిన్ లో మంచి సమర్థత ఉందని ఆమెని పొగడేది.

ఇప్పుడే తనొక కొత్తచీరతో రాజభవనం వెళ్ళాలని శారద ఆలోచించింది. అప్పుడామె మనసులో కనిపించినది ఆ చందనరంగు పట్టుచీర. భర్త 'దాన్ని కట్టుకో!' అని పురిగొల్పిన మాటలు గుర్తుచేసుకుంది. అతను అన్నట్టు, నలభై రూపాయలు వ్యర్థం చెయ్యకుండా ఆ చీర వాడాలని అనుకుంటూ ఇంటికి తిరిగివచ్చింది.

ఆ చీరని రెండోసారి చెయిలో తీసుకుంది.

"దీన్ని నేనే కట్టుకోవాలా?" అని భర్తని అడిగింది.

"ఎందుకు ఉత్తికే నన్ను అడుగుతావ్?" అని గణపతి గొణికాడు.

"రాజభవనం ప్రోగ్రాంకి ఈ చీరతో వెళ్ళదలచుకున్నాను."

"ఓ, అదా నీ ప్లాను?"

"ఇవాళే, ఒక సారి దాన్ని కట్టుకొని ఎలావుందో చూస్తాను."

"ఈ చీరకి నీ దగ్గర matching blouse ఉందా?"

"ఉంది. వదిన నాకది బహుమతిగా పంపించింది."

శారద వేరేగదికి వెళ్ళి ఆ చీరని గబగబమని విప్పింది; దాన్ని కట్టుకొని ఒక జడ్డి నవ్వు నవ్వుతూ భర్తముందు నిలబడింది.

"బాగుంది!" అని గణపతి పొగడాడు.

శారద అద్దంముందు ఒకసారి నిలబడి తన్ను చూసుకుంది. కాని ఆ క్షణమే తన దేహంమీద పూసుకున్న గంధం వట్టిపోయి, చర్మాన్ని లాగ్గుతున్నట్టు ఒక స్మరణ ఆమెకి కలిగింది. గణపతి పక్కనేవున్నాడని లెక్కచెయ్యక, 'నాకెలాగో ఉంది!' అని మూలుగుతూ తన వక్షస్థలంని కప్పుకున్న చీర పై భాగంని పీకి, నేలమీద విసిరింది. నేలనున్న పాత చీరని తన లంగామీద చుట్టుకొని అక్కడనుంచి నిష్క్రమించింది.

"ఎందుకు, ఏమైంది?" అని గణపతి ఆమెని అడగలేదు.

“మనోవ్యధతో నేను రాజభవనం వెళ్తే నా పాటా, మొహం అధ్వాన్నంగానే కనిపిస్తాయి; ఈ చీరకి ఇది తగిన సమయం కాదు!” అని శారద అన్న మాటలు గణపతి చెవులకి స్పష్టంగా వినిపించాయి.

ఎంత త్వరగా ఆ చీరని శారద వదలించుకుందో అంత త్వరగా ఆమె దాన్ని మడతబెట్టి బీరువాలో భద్రంగా ఉంచడం గణపతి గమనించాడు; ‘సరేలే, ఇంకెప్పుడైనా అది ఈ చీర వాడుతుంది!’ అనే ఆలోచనతో ముట్టించిన అగరుబత్తిలాగ ప్రశాంతంగా ఏమీ అనక ఊరుకున్నాడు.

ఆ చీరని శారద ఒకే ఒక సారి కట్టుకొని బీరువాలో దాచేసింది; తాలిబొట్టు కట్టిన భర్త భార్యతో కాపురం చేస్తూ ఆమెను నిర్లక్ష్యం చేస్తున్నట్టుంది ఆమె వాలకం. అదొక అందమైన చీర అనే ఉద్దేశం శారద మనసులో మారనేలేదు, అది అలాగేవుంది. భార్యకి గుణవతి అనే పేరు ప్రధానం. చీరకి ప్రధానం అందం, అవునా?

ఆ చీర తన సొంతమని శారద తెలియజేసేసింది. మరెందుకు దాన్ని తను తొందరతొందరగా ఊడదీయాలి? ఆ చీర అంటే ఎందుకు తనకింత ఏవగింపు? అది ఇంకొక స్త్రీ వాడిన చీర అనే కారణమా? ‘ఏం, ఇది నా అమ్మ వాడిన చీర!’ అని తను ఊహించుకుంటే?

ఆ ఆలోచన రాగానే శారద ఉలిక్కిపడింది: వాళ్ళ అమ్మ సుమంగళిగా ఇంకా బతికి ఉన్నారు; గతించిన ఈ చీర యజమానితో తన తల్లిని సరిపోల్చడమా?

‘దేవుడా, అలాంటి ఆలోచన రాకూడదు! అమ్మకి ఎటువంటి ఇబ్బందీ రాకూడదు!’

సరే, ఆ చీర తన అక్కయ్య ఇచ్చిందని కల్పించుకుంటే? కాని తనకి అక్కయ్య అని ఎవరూ లేరే? ఉంది, తన పిన్నికూతురు ఉంది. ఇప్పుడు గర్భవతిగా గ్రామంలో ఉంది. దేవుడా, దానికీ ఎటువంటి ఆపద రాకూడదు!

అసలు ఆ చీర తనకెలాగ వచ్చింది? శారద ఆలోచించింది.

‘తల్లీ, అన్నయ్యా, వదినా - వీళ్ళెవరూ నాకిది ఇవ్వలేదు! ఎవరో ఒక అన్య స్త్రీ - ఒక స్నేహితురాలు - ఇచ్చిందని కల్పించుకుంటాను.’

పొట్లం కళ్ళకి తెలియనట్టుగా ఒక చోట దాచి శారద బీరువా తలుపు మూసింది. అప్పుడే ఆమె కట్టుకున్న చీర మొన బీరువా ద్వారబంధంలో చిక్కుకుంది. దాన్ని

వదలించాలని శారద మళ్ళీ తలుపు తెరచి మూసింది. అలా మూసినప్పుడే ఆమె మనసులో ఒక మొహం తొంగిచూసింది. ఎవరది? రైలు ప్రయాణంలో ఆ పెద్దాయన చూపిన ఫోటో ఆల్బంలో చిరునవ్వుతో కనిపించిన అతని భార్య! ఈ చీరకి మొట్టమొదటి యజమాని! ఆవిడ ఎంత వాత్సల్యంతో ఈ చీర వాడివుంటారు, కట్టుకొనివుంటారు!' అని శారద ఒక క్షణం ఆలోచించింది. పాపం, దురదృష్టవంతురాలు! అల్పాయుషులో పోయింది. అందుకే ఆ చీరకి ఆ శాపం అంటుకుంది!

ఇలాంటి భావన రాగానే శారద మనసులో వింతగా ఒక మార్పు దుముకులాడింది. 'నా స్నేహితురాలు!' అని తనలో చెప్పుకుంది. ఫోటోలో ఆ చందనవర్ణ చీరతో కనిపించిన స్త్రీని చూసి ఆమెకు సానుభూతి కలిగింది.

కాని గణపతి మనసులో?

ప్రజాతంత్ర దినం వచ్చింది. రాజభవనం వెళ్ళడానికి శారద సింగారించుకుంది; కొప్పు సర్దుకుంది; పువ్వులు అలంకరించుకుంది. పసిడివెన్నెల రంగులో రవిక తొడుక్కుంది. ఆఖరికి ఆ చందనవర్ణ చీరని చెయిలో తీసుకుంది; ఇప్పుడు ఆమె మనసులో రవంతైనా ద్వేషం లేదు.

"ఇదా నీ నిర్ణయం? నిజంగానా?" అని గణపతి విస్తుపోయాడు.

"అవును!" అని చిరునవ్వుతో శారద జవాబు చెప్పింది. "ఇవాళ నా వయలిన్ వాయింపు రాణించకపోతే ఈ చీరని ఆక్షేపించకూడదు!"

"ఏం, ఎందుకు? అవాళ గట్టిగా 'నాకు ఈ చీర వద్దేవద్దు!' అని అన్నావుగా?"

"కాని ఇవాళ అది వాడాలని నాకు ఆశగా ఉంది!"

గణపతి ఏదో చెప్పాలనుకొని వెనకాడాడు, కొంచెం ఆగి మాటాడాడు: "నీకు ఆ చీరంటే ఎందుకు ఏవగింపు అని నేనూ ఆలోచించాను. నువ్వు అప్పుడప్పుడు సరదాగా చెప్పే మాటలు నేను గుర్తుచేసుకున్నాను. నువ్విప్పుడు నిజంగానే భయపడుతున్నావని తెలిసింది, అందులోనూ న్యాయముంది. నువ్వెందుకు ఈ చీర వాడాలి?"

శారద ఆశ్చర్యంతో భర్తని చూసింది. 'నేను పోతే మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారు!' అని చెప్పి అతన్ని ఉడికించిన రోజులు ఆమె జ్ఞప్తికి వచ్చాయి.

ఆ చీరవలన తన భార్యకి హాని కలుగుతుందని గణపతి ఆలోచిస్తున్నాడా? అందుకే అతను భయపడుతున్నాడా?

శారద నవ్వుతూ చెప్పింది: "నాకటువంటి భయం లేదు. 'ఇంకొకరు వాడిన చీర ఎందుకు వాడాలి?' అని మీకు ఆ రోజు పట్టరాని కోపం వచ్చింది. కాని ఆ తరువాత మీ మనసెలా మారిందని నాకు అనిపించింది. ఆ చీరని మనమీద అంటగట్టినందుకు మనం ఆ పెద్దాయనని నిందించకూడదు. ఆ చీరని నాకొక స్నేహితురాలు ఇచ్చిందని నేను అనుకుంటాను."

ఆమె మాటలు పూర్తిగా గ్రహించకపోయినా గణపతికి లేత కొబ్బరికాయ నీళ్ళు తాగినట్టనిపించింది.

"సరేలే, నీ మనసుకెలావుందో అలాగే చెయ్!" అని చెప్పి గణపతి ఊరుకున్నాడు.

"మీరు నాకోసం భయపడ్డారని తెలిసి నాకు చాలా సంతోషంగా ఉండదా?" అని అంటూ శారద నవ్వింది.

ఆ సాయంకాలం ప్రోగ్రాంలో శారద ఎవరితోనో "ఈ చీర నా ఫ్రెండు అస్సామునుంచి నాకు స్పెషల్ గా పంపించింది!" అని అన్న మాటలు విని గణపతికి 'అబ్బా, దీనికి ఎంత సాహసం!' అని దిగ్భ్రమ కలిగింది. ఐనా అతను భార్య అభిలాషని చులకన చెయ్యలేదు. తీయని చుట్టరికాన్ని బొట్టబొట్టుగా వెలయించే ఆ చీర గాఢప్రేమకి నిదర్శనమైంది. శారద మనసులో ఆ స్త్రీ ఒక ఘనమైన స్థానం ఆక్రమించుకుందికదా?

********

**(మూలం ప్రచురణ: కలైమగళ్, జనవరి 3,1955)**

# ఇవేం అలనాటి కధలా?

రాధై తనకి అన్నయ్య అనే బంధువు కావాలని తపించిపోయింది; ఆమె పసిహృదయంలో తనకీ ఒక అన్నయ్య ద్వారా ప్రేమ, ఆదరణ దొరకాలని తాపత్రయపడింది.

దానికి కారణం ఇటీవల వరుస వరుసగా ఆమెకి కలిగిన రెండు అనుభవాలు.

ఆమె స్నేహితురాలు సులోచనా తన ఇద్దరి అన్నయ్యలు కొని పంపించిన బహుమతులని చూపించినప్పుడు రాధైకి మనసులో ఎలాగో అనిపించింది. ఆ క్షణమే ఆ 'అన్నయ్యల' మీద ఒక విధమైన మర్యాదా, సులోచనా అదృష్టం గురించి ఆశ్చర్యమూ ఆమె మనసులో చోటు చేసుకున్నాయి.

దసరా సెలవులలో వచ్చిన రాధై అన్నయ్య ఒక పెట్టెనిండా బొమ్మలు కొనితెచ్చినప్పుడు రాధై మనసులోని ఆ గాఢమైన కోరిక ఇంకా దృఢంగా నిలిచిపోయింది. ఆ బొమ్మలగురించి రాధై చెప్పిన వర్ణణలను విని తల్లి విశాలం ఏవో నాలుగు బొమ్మలు కొని, మామూలుగా మూడు మెట్లకి బదులు నాలుగుమెట్ల బొమ్మలకొలువు ఏర్పాటు చేసి, కూతురు తృప్తి పడుతుందని ఆశించింది. కాని రాధై మనసుని ఆ కొత్త మెట్టు ఉల్లాసపరచలేదు; ఆమె కాంక్ష ఒక అన్నయ్యకోసం; మరెలా అదనపు మెట్టువలన ఆమెకి తృప్తి కలుగుతుంది?

విజయదశమి రోజున రాధై తమ్ముడికి అక్షరాభ్యాసం చేసారు. ఈ వేడుక ఒరిస్సాలోనే జరగడంవలన, రాధై తల్లికి తమిళదేశంనుంచి కానుకలు వచ్చాయి.

"చూడండి, మా అన్నయ్య నాకు ఈ చీర కొని పంపించాడు! ఈ పంచె, పట్టు వస్త్రాలన్నీ వాడే పంపాడు!" అని విశాలం గొప్పగా, గర్వంగా అందరికీ చెప్పడం వినగానే రాధై మనసులోని లోపం పదిలమైపోయింది; అప్పుడే 'అమ్మకీ ఒక అన్నయ్య ఉన్నారన్నమాట!' అనే నిజం గ్రహించి రాధై ఆశ్చర్య పడింది. ఆ ముందురోజు చంద్రు మామయ్య ఆ కానుకలు పంపించారని విశాలం కూతురుకి చెప్పుకుంది. ఇంతకుముందు రాధైకి తల్లిమీద కలగని 'అసూయ' కలిగింది; ఆ రోజే చంద్రు మామ తన తల్లికి అన్నయ్య అని అమ్మాయి రాధై తెలుసుకుంది.

‘అమ్మకీ అన్నయ్య ఉన్నారు; మనకే ఎవరూలేరు!’ అని ఆమె పసిహృదయం అంగలార్చుకుంది. నోరు విప్పి తన కాంక్షని తెలియజేయాలంటే మొహమాటం; కాని ఆఖరికి, ఒకరోజు, అడిగేసింది:

“అమ్మా, నాకెందుకు అన్నయ్యలెవరూ లేరు?”

“నీకుముందు మరెవరూ పుట్టలేదే? అందుకే నీకు అక్కయ్యా, అన్నయ్యా లేరు! ఐతేనేం, నువ్వు వెళ్ళి ఆడుకో!” అని తల్లి చెప్పింది. రాధై తమ ఇంటి సీమంత పుత్రి అని గుర్తుచేసుకొని విశాలం గర్వపడిందా, లేక ఆవిడకి కూతురడిగిన ప్రశ్న చోద్యంగా కనిపించిందా? మరేం అనక విశాలం నవ్వేసింది; రాధై వెళ్ళిపోయింది.

కాని రాధై మనసులోని ఆరాటం పోలేదు; ఆమె అడిగిన ప్రశ్నకి తల్లి మాటలు సరైన సమాధానం ఇవ్వలేదు. యౌవనంలో అంతా విచిత్రం, అన్నీ తెలుసుకోవాలనే ఆరాటం; అలాంటప్పుడు తల్లి జవాబుని అంత సులభంగా రాధై ఆమోదించడం ఎలా సాధ్యం? తల్లి మాటలు విన్నతరువాత ఆ తలంపులు మరీ తీవ్రంగా పెరిగాయి. ఒక ఆలోచన మరో నాలుగు ఆలోచనలకి దారితీసింది; వ్యాకులత ఎక్కువైంది.

తన మనసులోని బాధని అప్పుడప్పుడు వెల్లడి చేయాలని రాధై పూనుకుంది. అవును, చొక్కాయిలో ఒక చిన్న చిల్లిని నిర్లక్ష్యం చేస్తే ఆదొక పెద్ద చింపుగా మారడం మనం రోజు చూస్తున్న అనుభవమే కదా?

“అమ్మా, సులోచనాకి వాళ్ళ అన్నయ్య ఒక మంచి సిల్కు పరికిణీ కొని పంపించాడు; చూడడానికి ఎంత బాగుందో తెలుసా?” అని రాధై ఒక రోజు తల్లికి చెప్పింది.

విశాలం భర్తతో ఏమని చెప్పిందో - ఆ మరుదినమే - రాధైకి అలాంటి పరికిణీ దొరికింది. అది చూసి ఆమె మొహం వికసించినా, లోలోపల ఎటువంటి సంతోషమూ లేదు. నాన్నగారికి డబ్బుంది; పిల్లలకి కానుకలు ఇవ్వాలని అతనికి మంచి మనసుంది; కాని . . . ‘ఈ ఇంటిలో’ నాకని ఒక అన్నయ్య లేడే! ఇదేం గొప్ప?’ అని రాధై వాపోయింది.

రెండు రోజుల తరువాత రాధై బయటికి వెళ్ళాలని సిద్ధమౌతుంటే "ఆ కొత్త గౌను తొడుక్కోవే!" అని విశాలం సలహా ఇచ్చింది.

"అది నాకు వద్దు!" అని జవాబు వచ్చింది.

"ఏం, ఎందుకు?"

"అదేం గొప్ప? 'అన్నయ్య రామూ కొని ఇచ్చిన గౌను' అని సులోచనా తన గౌనుకి పేరు పెట్టింది. నా గౌను ఉత్తి గౌనే కదా?" అని రాధై సణుగ్గుంది.

'అవును, రాధైకన్నీ నాన్నగారే కొని ఇస్తున్నారు. అందులో ఏం గొప్ప?' విశాలం తనలో నవ్వుకుంది; కాని ఏం చెయ్యాలో ఆలోచించింది.

"నువ్వూ వాడిని రామూ అన్నయ్య అని పిలు. వాడూ నీకు అన్నయ్య అని అనుకో" అని అమ్మాయికి చెప్పింది.

ఊహూం, రాధైకి ఆ సలహా నచ్చలేదు: అది మోసం!

విశాలం తన భర్తతో దీనిగురించి వివరంగా మాటాడివుండాలి; లేకపోతే అతనెందుకు అంత తీవ్రంగా ఆ ప్రశ్న గురించి ఆలోచిస్తారు?

పిల్లల మనసులో కొరత చోటుచేసుకుందంటే - అది ఎంత అల్పమైనా - దాన్ని తోసిపారేయకూడదు. అవును! 'ఉప్పుమీద పన్ను' అంటే అదేం గొప్పగా అనిపించదు; బాగా ఆరసించి చూస్తేనే దాని విపరీతం బోధపడుతుంది. మన దేశం నేత మహాత్మా గాంధిగారు అంత పెద్ద ఉద్యమమంలో దిగినప్పుడు, రాధై తండ్రి తన కూతురుగురించి కొంచెం ఆలోచించారంటే అందులో ఆశ్చర్యమేముంది?

"రాధే, నా మాట విను. నువ్వు మా సీమంత పుత్రివని మాకు ఎంత గర్వంగా ఉందో తెలుసా? బాలూకి, లల్లీకి[1] ఆ బిరుదు లేదు! నువ్వు పుట్టాలనే మేం తీవ్రంగా ఆశించాం; నువ్వు అమ్మ కడుపులో ఉన్నప్పుడు అన్ని పూజలూ చేసాం. నీవలనే అమ్మకి పట్టు చీర, గాజులు అన్నీ దొరికాయి! నీకే అమ్మమ్మ గొలుసు, గాజులు, ఉయ్యేల, బహుమతిగా ఇచ్చింది! నీవలనే మన ఇంటికి కళ, శోభ అని మేం చెప్పుకుంటున్నాం. నీకు తెలుసా, నీ బాల్యంలో అమ్మ ఎన్ని విధాలుగా నిన్ను

---

[1] బాలూ, లల్లీ - ఇవి పిల్లల్ని గారాబంగా పిలిచే పేరులు

సింగారించేదని? అవన్నీ ఇప్పుడు లల్లుకి చెయ్యలేం,  అమ్మకీ తీరిక లేదు . . . ” అని సభేశన్ అమ్మాయిని గౌరవించే ధోరణిలో రాధైతో మాటాడారు.

విశాలమూ అతనితో కలుసుకుంది:

“రాధై, నువ్వు భాగ్యవంతురాలివి! నీకు సరస్వతీ కటాక్షం ఉంది; చదువూ, సంగీతం అంటే ఆసక్తి ఉంది. ఇక్కడ, ఈ ఒరిస్సా దేశంలో, అపూర్వంగా మనకి తగినట్టుగా ఒక మంచి పాట మేష్టారు దొరికారుకదా అని, ఇరవైయ్యో, ఇరవైఐదో సునాయాసంగా అతనికి ఇవ్వాలని మాకు అనిపించింది. మన లల్లుకి పాట నేర్పించాలంటే అందుకు డబ్బు కావాలి, దానికి ఇష్టముండాలి . . . సంసారం పెరుగుతూంటే ఇక ఆలోచనలన్నీ డబ్బుగురించే! అవునా, మీరేమంటారు?” అని భర్తతోనూ, రాధైతోనూ తన ఉద్దేశం తెలియజేసింది.

రాధై ఏమీ అనలేదు; కళ్ళతో తల్లిదండ్రులని చూసి ఊరుకుంది.

లోహపు గిన్నెకి సీసంతో మెరుగుచేస్తే అది ఎన్నిరోజులకి? అలాగే రాధై మనసులో  తల్లిదండ్రుల మాటలు నిలకడగా స్థిరపడలేదు.

ఒకరోజు రాధై సులోచనాతో చెప్పుకుంది: “నీకు తెలుసా,  ‘నాకు అన్నయ్యో, అక్కయ్యో లేకపోవడం మంచిదే!’ అని మా అమ్మా, నాన్నా అంటున్నారు . . . నాకు వాళ్ళ మాటలు నచ్చలేదు . . . మీ తమ్ముడు రమణి పోయినప్పుడు మా అమ్మ నాకు చెప్పింది, ‘రమణి మళ్ళీ వాళ్ళ అమ్మ కడుపులో పుడతాడు, సులోచనాకి తమ్ముడుగా వస్తాడు, అప్పుడు నువ్వు వాడితో ఆటలాడవచ్చు!’ అని. అంటే . . . నేనిప్పుడు పోతే మళ్ళీ మా అమ్మ కడుపులో పుడతాను, బాలూ నాకు అన్నయ్య అవుతాడు, లల్లీ నాకు అక్కయ్య ఐపోతుంది . . . అవునా?”

ఈ సంభాషణ విని రాధై ఉలిక్కిపడింది. అమ్మాయి మనసులోని ఊహలు విన్న ఆ క్షణమే ఆ తల్లిని విపరీతమైన భయం పట్టుకుంది.

“రాధే! రాధే! ఇలా రా!” అని అరిచింది.

“నేను రాను . . . పో!”

ఎర్రబడిన మొహం; మాటల్లో విరక్తి; తహతహలాడుతున్నకళ్ళు - ఇవన్నీ కొట్టవచ్చినట్టు ఆ తల్లి మనసుని తాకాయి; కాని గుండెదడతోబాటు సానుభూతికూడా కలిగింది; ఒక ఉపాయమూ తోచింది.

"ఇదిగో విను, రాధే! నీకు మనింట్లో అన్నయ్య లేడని చెప్పాను, కాని అసలు అన్నయ్యే లేడని అన్నానా? మన ఊరులో నీకు గోపు అనే అన్నయ్య ఉన్నాడు, నీకంటే ఆరు సంవత్సరాలు పెద్దవాడు . . . అంటే, నీకు వాడు పెద్దన్నయ్య అన్నమాట! మద్రాసులో పిన్ని ఇంట్లో జానకి, మీనాక్షీ ఉన్నారే, వాళ్ళు నీకు చెల్లెళ్ళు కదూ? అలాగే గోపు నీకు అన్నయ్య అవుతాడు!" అని విశాలంచెప్పింది.

"అబద్ధం! అబద్ధం! నాకు గోపు అనే అన్నయ్య ఎవరూ లేరు! అసలు నాకు అన్నయ్యే లేడని నువ్వు అవాళ అనలేదూ?"

రాధై కోపంతోనే మాటాడింది కాని ఆమె కళ్ళలో ప్రకాశం కనిపించింది.

"ఈ గోపు ఈరోడ్ లో ఉన్నడమ్మా! జానకి, మీనాక్షికి వాడు పెద్ద నాన్నగారి కొడుకు; వాళ్ళకి అన్నయ్య అవుతాడు, నీకూ అన్నయ్యే! తెలిసిందా? కావాలంటే నాన్నగారిని అడుగు . . . " అని తల్లి ఓదార్చింది.

తల్లి మాటలు నాన్నగారు ఖాయపరిచారు. తోటల్లుడి తమ్ముడు కొడుకు తన కూతురుకి అన్నయ్య అవుతాడా? మొట్టమొదట అది వినగానే అతనికి నవ్వాలని పించింది! కాని జనులందరూ సహోదరత్వం పాటించాలనే ఘోషణ వింటున్న ఈ రోజుల్లో విశాలం సూచించిన ఈ కలిసిలేని బంధుత్వం తప్పు అనవచ్చా? విశాలమూ నంగనాచితనంగా ఏవో మాటలు అనలేదే! అతని మనసు ఇలాగ సమర్థించుకుంది: అతని తమ్ముడికి మగ పిల్లలు లేరు. ఇద్దరూ అమ్మాయిలే; మరి రాధై ఆకాంక్ష తీర్చడం ఎలాగ?

జానకి, మీనాక్షి విశాలం చెల్లెలి కూతుర్లు. ఆ చెల్లెలి ఒరగత్తి అబ్బాయి గోపు. వాడు జానకి, మీనాక్షికి అన్నయ్యే. రక్తసంబంధం లేని ఈ కుటుంబంకి వాడు అన్యుడని వాదించవచ్చు. కాని మనసూ మనసూ ఏకమౌతే ఆ బంధం ఎంత దృఢంగా మారుతుందో ఎవరికి తెలుసు?

విశాలం పన్నిన ఉపాయంతో రాధై మనసులో ఆ గోపు 'అన్నయ్య' అనే ఘనమైన పీఠంలో స్థిరంగా నిలబడిపోయాడు. కూతురు కాంక్షని తీర్చాలని ఆ తల్లి మఱుగుగా కల్పించిన బంధుత్వం, ఒక సజీవ మట్టిబొమ్మలాగ పరిణమించి రాధై మనసుని ఆహ్లాదపరిచింది.

ఆమె మనసులో కల్పన అనే మొక్క లేచింది; దానితోబాటు ప్రేమానురాగాలు కొమ్మలు, కొమ్మలుగా ఉద్భవించాయి. ఆ 'అన్నయ్య' ప్రతిమ చుట్టూ ఒక పందిరి అల్లుకున్న తరువాత తన ఆశ యీడేరిందని రాధైకి తృప్తి కలిగింది.

ఐనా, బంధుత్వం అన్నది మనసులోనే మిగిలిపోతే ఎలాగ? తనే కల్పనలో సృష్టించి, మానసికంగా చూసి ఆనందించిన 'అన్నయ్య'ని నిజంగా చూసితీరాలని, అతనితో మాటాడాలని రాధై ఆశించింది; 'నాకూ అన్నయ్య ఉన్నాడు!' అని ఊహాలోకంలో ఘనంగా తేలి, బాగా అలసిపోయిన తరువాత అతన్ని చూడాలని తఱతఱలాడింది.

కూతురు అభిలాష తెలిసిన తరువాత సభేశన్ తమిళ దేశంకి వెళ్ళాలని నిశ్చయించారు. తమిళ దేశంకి ప్రయాణం చెయ్యడం ఆతనికేం కొత్తకాదు. రెండుమూడు సంవత్సరాలకి ఒకసారి ఆరువందలమైళ్ళ దూరంలో ఉన్న బంధువులను కలుసుకోవడం అతనికి మామూలే; కాని ఈ సారి అతని పథకంలో ఒక చిన్న మార్పు . . .

దక్షణప్రాంతంకి చాలా దూరంలో కాపురమున్న అతనంటే బంధువులకి చాలా ప్రేమ, మర్యాద. రెండుమూడు సంవత్సరాలకి ఒకసారి తమిళదేశంకి వచ్చినా ఆ యాత్రలో సబేశన్ అందరు బంధువులనీ తప్పకుండా కలుసుకుంటారు. కాని ఇంతవరకూ అతను తన తోటల్లుడు తమ్ముడున్న ఈరోడ్ మాత్రం వెళ్ళలేదు; వాళ్ళని ఈరోడ్ లో వాళ్ళ ఇంట్లో కలుసుకోవడం, రెండురోజులు అక్కడ బస చెయ్యడం జరగనేలేదు. అయినప్పటికీ వాళ్ళని చూడకుండా రావడమనేది ఎప్పుడూ జరగలేదు. ఆ రోజుల్లో రాధై ఐదేళ్ళ బాలిక; అప్పుడు ఆమెకి ఈ 'అన్నయ్య వ్యామోహం' లేదు. అసలు ఈ కుటుంబంలో ఎవరికీ గోపు అంటే ప్రత్యేకంగా ఎటువంటి ఆలోచనా లేదు.

కాని ఇప్పుడో? ఎక్కడోవున్న గోపు అన్నయ్యని చూడాలని రాధైకి ఆతురతగా ఉంది! ఈ సారి ఈరోడ్ లో నాలుగు రోజులు బస చెయ్యాలని సబేశన్ నిశ్చయించారు. అతని యాత్రాపథకంలో ముఖ్యంగా మద్రాసు, కరూర్, తిరుచ్చి ఉంటాయి; వాటితో ఇప్పుడు ఈరోడ్ చేర్చడమైంది.

కాని తిరుచ్చి చేరుకున్నతరువాత వాళ్ళ ఈరోడ్ ప్రయాణం ఆగింది. ఆ సమయంలో గోపు తన మామయ్య - తల్లి సహోదరుడు - ఉంటున్న బొంబాయిలో ఉంటున్నాడని వార్త అందింది. ఈరోడ్ లో గోపు లేడు, మరేం ఆడవాళ్ళూ లేరు. గోపు తండ్రి మాత్రం ఒంటరిగా ఉన్నప్పుడు సటేశన్ అక్కడికి ఎలా వెళ్ళగలరు? ఆఖరికి పదేళ్ళ రాధైకి నిరాశే మిగిలింది.

ఊరికి తిరిగివచ్చినతరువాత ఆ 'అన్నయ్య వ్యామోహం' ఆమెను ఇంకా తీవ్రంగా పట్టుకుంది. నిత్యమూ అన్నయ్యగురించే సంభాషణ, ఆలోచనలు,కల్పనలు, అన్నీ.

రెండు సంవత్సరాలు గడిచాయి. రాధై మనసులో ఎంత ఆశా, ఆతురతా ఉన్నా ఆటలు, చదువు, స్నేహితులు, పాట శిక్షణ, అనే మలుపులలో కలుసుకొని ఆమె దినచర్యలు సాగాయి; అందువలన ఆ రెండు సంవత్సరాలు ఆమెకి భారంగా కనిపించలేదు.

మళ్ళీ తమిళదేశంకి సటేశన్ బయలుదేరారు. ఈ సారి ముందుగానే అతను గోపు తల్లిదండ్రులకి తన రాక గురించి రాసేసారు. ఇంతకుముందే కొన్ని ఉత్తరాల్లో అతను రాధైకి గోపుపై ఉన్న అభిమానం గురించి చెప్పివున్నారు. అందువలన ఈ ఉత్తరంలో రాదైకి ఉన్న ఆతురత గురించి తెలియజేసారు. 'అతన్ని చూడడానికి నేను ఇంత తొందరపడుతున్నానని గోపు అన్నయ్యకి అర్ధమౌతుంది; అది విని అతను నన్ను ఎన్నివిధాలుగా పొగడుతున్నారో?' అని ఏవేవో కల్పనలు చేసుకుంటూ రాధై రోజులు గడిపింది.

కాని, అసలు ఏం జరిగింది? ఆమె ఆశకి నీరులో మన్ను కలిసినట్టయింది. సటేశన్ భార్యా, పిల్లలతో ఈరోడ్ కి బయలుదేరే సమయం, తిరుచ్చిలో మళ్ళీ రాధైకి నిరాశ కాచుకొనివుంది!

ఎవడో స్నేహితుడు ఒత్తిడి చేసాడని గోపు తిరునెల్వేలికి వెళ్ళాడని, అతను ప్రస్తుతం ఈరోడ్ లో లేడని వార్త సటేశన్ కి అందింది. ఐనా, ఆ కారణం వలన అతను తన ఈరోడ్ ప్రయాణం ఆపవద్దని గోపు తండ్రి వేడుకున్నారు.

ఉత్తరం చదివి సభేశన్ కి విభ్రాంతి కలిగింది:

అతని ఉత్తరం చదివిన తరువాతే గోపు తిరునెల్వేలికి - మజాగా రోజులు గడపాలని - వెళ్ళాడని గ్రహించి అతను బాధపడ్డారు.

'అవును, పద్దెనిమిదేళ్ళ యువకుడుకదా? అసలు మర్యాద అంటే ఏమీ తెలుసా! హూం, ఇంటర్ పాసయ్యాడట!' అని అతను విసుగ్గున్నారు; తరువాత గర్జించారు కూడా.

కళ్ళ నీళ్లు పెట్టుకున్న అమ్మాయికి అతను చెప్పారు. "ఇదిగో, చూడు, రాధే! నువ్వు మాత్రం వాడికి చెల్లెలు కాదు! వాడికి ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. అసలు జానకి, మీనాక్షిగురించే వాడు ఆలోచిస్తున్నాడో లేదో? నువ్వూ అలాగేకదా? నువ్వంటే కొంచమైనా . . . సరే, పోనీలే . . . వాడికిగాని నీ గురించి చింతవుంటే నా ఉత్తరం చూసినతరువాత ఇలాగ వెళ్తాడా, చెప్పు! నువ్వెందుకు వాడికోసం 'అన్నయ్య', 'అన్నయ్య' అని నిత్యమూ తపస్సు చెయ్యాలి?" అని జరిగినదేదో వివరంగా చెప్పి ఓదార్చారు.

రాధై కన్నీరు కార్చుతునే ఉంది. 'అవును, అన్నయ్యకి నేనంటే ఉపేక్ష!' అనే భావన ఆమె సహించలేకపోయింది. కాని తనకి 'ప్రియమైన' అన్నయ్యమీద నాన్నగారు పైబడడం చూసి కోపమూ కలిగింది. ఆమె మనసులో 'అన్నయ్య' మీద ఉన్న అభిమానం ఒక పెద్ద చెట్టులాగ పెరిగిపోయినప్పుడు ఈ అల్ప సందేహం ఏ మూల? 'నాన్నగారు ఉత్తికే అన్నయ్యని నిందించుతున్నారు!' అనికూడా రాధైకి అనిపించింది. కాని, ఆమెకి కలిగిన నిరాశ నిజమేకదా? ఆమె పరిస్థితి వింతగానూ, బాధాకరంగానూ కనిపించింది; పరికిణీ మొనలో మొహం దోపుకొని రాధై ఏడ్చింది.

ఊరుకి తిరిగివచ్చినతరువాత ఆమె ధోరణి మారింది; అన్నయ్యగురించి బాహటంగా మాటాడడం తగ్గించుకుంది. ఒకరోజు తల్లిని అడిగింది.

"అమ్మా, చూసావా, ఈ రోజుల్లో పత్రికలలో 'బాలలకోసం' అనే ఒక కొత్త శీర్షిక కనిపిస్తోంది! అందులో బాలలు మెంబర్లు. వాళ్ళు ఒకరినొకరు చూసుకోకపోయినా ఉత్తరాలు రాసుకుంటూ మెలుగుతారట! నేనూ గోపు అన్నయ్యతో అలా పరిచయం చేసుకుంటే?"

కూతురు ఆలోచన విశాలం భర్తకి చెప్పింది.

"వద్దమ్మా, రాధే! అసలు వాడికి నీకు జవాబు రాయడానికి ఏం శ్రద్ధ ఉంటుంది చెప్పు? నాకేం నమ్మకం లేదు. ఐనా గోపుని మనం తప్పకుండా ఎప్పుడో కలుసుకుంటాం; ఆ పరిచయం ఐన తర్వాత నువ్వు వాడికి ఉత్తరాలు రాయవచ్చు!" అని అతను అనేసారు.

ఆ అన్నయ్య వలన తన కూతురుకి నిరాశ; తనంటే వాడికి ఉదాసీనత; తన ఉత్తరం చూసినతరువాత గోపు స్నేహితుడుని చూడడానికి వెళ్ళాడు: ఆ తిరస్కారం సబేశన్ మరిచిపోలేదు.

ఆ సమయంలో "నీ అమ్మ చెప్పిందని నీకూ 'అన్నయ్య', 'అన్నయ్య' అని బాగా పిచ్చి పట్టుకుంది; ఆ కుటుంబంకీ మనకీ ఏ పొత్తూ లేదు! వాడు నీకు అన్నయ్య కాదు!" అని కూడా గట్టిగా కూతురుకి చెప్పెయ్యాలని అతనికి తోచింది; కాని సబేశన్ మరేం అనక ఊరుకున్నారు. అలా అనడానికి అతని మొహంలో సూచనలు కనిపించగానే రాధై భయపడి అతని నోరు మూసేసింది.

అతనికీ వివేకం ఉంది. సహోదరత్వం అంత సులభంగా తెంచుకోడం ఎలా సాధ్యం? తన కూతురు గోపుని స్వంత అన్నయ్య అని కొనియాడుతూ ఆనందిస్తుంటే ఆ మెచ్చుకోలు అతనెలా నిర్లక్ష్యం చెయ్యగలరు? అతనెందుకు తొందరపడి ఏమైనా చెప్పి రాధై మనసు నొప్పించాలి?

ఆమె భావనలు అతను తిరస్కరించలేదు. కాని ఆ అనుభూతి వలన రాధై ఉత్తరాలు రాయడం అతను ఆమోదించలేదు; మరి తండ్రి అనే హోదాలో అదికూడా అతను చెయ్యరా?

అపజయం నేర్పించే పాఠంకి పేరు పరిపక్వం; మొట్టమొదట అన్నయ్య గురించి నాన్నగారితో మాటాడానికి రాధై జంకింది. ఆ తర్వాత తల్లి ప్రేరేపణ, నాన్నగారు "వద్దు!" అని కొట్టి పారేయగానే ఆమె మనసు దృఢమైంది; ఆత్మ విశ్వాసం పెరిగింది. అందుకు మూల కారణం పరిపక్వం చెందిన ఆమె మనసు.

అంతేకాదు. రాధై ఇంకా బాలికగానే ఉందా? లేదే? యువతిగా ఇప్పుడు ఆమె చీరకట్టుతో కనిపిస్తోంది. వయస్సుకి తగినట్టుగా సిగ్గు, అణకువ ఆమె నడకలో చోటుచేసుకున్నాయి. ప్రకృతి ధర్మం అనుసరించి సమాజంలో, జీవితంలో ఇప్పుడు ఆమెని ఆకర్షించినవి నవ్యత, కుతూహలం, ఆనందం; ఇక అన్నయ్య

గురించి ఎటువంటి విచారమూ, తాపమూ లేదు. మధురమైన ఆమె ఊహాలోకంలో అప్పుడప్పుడు అన్నయ్య కలలో వస్తున్న స్వరూపంలా కనిపించాడు. అన్నయ్య జ్ఞాపకం ఒక విధమైన సహనశక్తిని ఆమె హృదయంలో ప్రతిష్ట చేసింది. దాన్ని ఎలా వర్ణించడం? తన కళ్ళకి కనిపించకపోయినా ఎక్కడో తన భర్త క్షేమంగా ఉన్నాడనే భావనతో తన జీవితంలో ప్రశాంతి అనుభవించే ఒక స్త్రీలాగ, రాధై రోజులు గడిపింది. వివేకంతో మెలగింది; పదే పదే అన్నయ్యగురించి వెయ్యిసార్లు వాగడం ఆపుకుంది; అంతరాత్మలో అన్నయ్యని మౌనంగా కొనియాడే రాధై అందరికీ కనిపించింది.

సబేశన్, విశాలం కూడా రాధై అన్నయ్యని మరిచిపోయిందేమో అని అనుకున్నారు. ఇక బాలూకి, లల్లీకి ఆ అన్నయ్య అభిమానం గురించి ఏమీ తెలియదు; వాళ్ళు చిన్న పిల్లలు కదా?

ఇలాగే మూడు సంవత్సరాలు గడిచిపోయాయి.

సబేశన్ కి తమిళదేశంనుంచి ఒక వివాహ ఆహ్వాన పత్రిక వచ్చింది.

అతని మేనల్లుడు ఒకడు పెళ్లి వద్దంటూ ముప్పైరెండేళ్ళవరకూ బ్రహ్మచారిగా కాలం గడిపేసాడు. కాని ఇప్పుడు తల్లిదండ్రుల, బంధువుల ఒత్తిడికి లొంగిపోయి సరేనన్నాడు. సబేశన్ తోటల్లుడి బంధువులలో ఒక అమ్మాయిని అతనికిచ్చి పెళ్ళి చెయ్యాలని చాలా రోజులుగా ప్రస్తావించడం సబేశన్ కి తెలుసు. ఆ పెళ్ళి ఇప్పుడు నిశ్చయమైంది, ఆహ్వానపత్రిక వచ్చేసింది.

తన బావకి పెళ్ళని రాధైకి ఎటువంటి ఉత్సాహమూ లేదు. కాని ఆ పెళ్ళిగురించి తన తల్లిదండ్రుల ప్రయాణపధకం విని ఆమె ఒక గెంతి గెంతింది.

“పెళ్ళి కోయంబత్తూర్లో! కొయంబత్తూర్కి ఈరోడ్ ద్వారా ప్రయాణం చెయ్యాలి!”

ఈ ఆలోచనే ఆమె మనసులో గిరగిరమని తిరిగింది; ప్రయాణం గురించి ఆలొచిస్తున్న తల్లిదండ్రులు రాధై మొహంలోని కాంతిని చూడలేదు.

“అమ్మా, మనం ఊరోడ్ ద్వారా వెళ్ళాలా? ఈరోడ్ లో దిగుతామా?” అని తల్లి భుజం తాకుతూ రాధై అడిగింది.

“అదేమిటే, నన్నిలా జోరుగా గుంజుతున్నావ్?” అని ఆశ్చర్యంతో విశాలం తిరిగింది; కూతురు మొహం చూడగానే తెలుసుకుంది.

“ఓహో, అన్నయ్యని చూడాలని గెంతులేస్తున్నావా? చూసారా? ఎది ఏమైనా మన అమ్మాయికి ఆ గోపు అన్నయ్య అంటే ఆశా, మర్యాదా ఎక్కువే! వాడి అమ్మా, నాన్నా ఈ పెళ్ళికి తప్పకుండా వస్తారుకదూ? ఈ పెళ్ళి సంబంధం నా చెల్లెలి వియ్యంకులవారితోనేకదా?” అని విశాలం అడిగింది.

“పెళ్ళికి ఈరోడ్ కుటుంబం రావడం గురించి మనకేం తెలియదు! వాళ్ళమధ్య ఏదో పేచీ అని విన్నాను. బంధువులమధ్య తగాదాలు సహజమేకదా?” అన్నారు సభేశన్.

“మనం వాళ్ళకి చాలా దూరంలో ఉంటున్నాం. అప్పటికినీ ఒక అల్ప విషయంలో మీకు నా బంధువులంటే ద్వేషం వచ్చేసిందన్నమాట! గోపు లేకున్నా మనం ఈరోడ్ రావాలని అతను అన్నారు, మనం వెళ్ళామా? మీకింకా గోపుమీదా, అతని నాన్నగారిమీదా కోపం పోలేదు!” అని అంది విశాలం.

“ఓహో! నాకు కోపం అనే రహస్యం నీకు తెలిసిపోయిందన్నమాట! వాళ్ళు ఈ పెళ్ళికి వస్తారో లేదో కాని ఈసారి మనం తప్పకుండా ఈరోడ్ వెళ్ళి, ఓ నాలుగురోజులు అక్కడ బస చేసి మన రాధైకి ఆ గోపు అన్నయ్యని పరిచయం చెయ్యాలని నా ఉద్దేశం!” అని అంటూ నవ్వుతూ సభేశన్ కూతుర్ని చూసారు.

ఆమె కళ్ళలో కనిపించే సంతోషం అతను గమనించారు. “రాధే, నీకూ అన్నయ్యని వదిలేసి మన ఊరుకి రావాలనిపిస్తుందో లేదో? అందుకే నీకూ మన తమిళదేశంలో పెళ్ళిచేసి, కాపురం పెట్టాలి. అప్పుడు నువ్వు అన్నయ్యని తరచుగా చూస్తూవుండవచ్చు!” అని అతను పరిహాసం చేసారు.

తన పెళ్ళిగురించి అతను మాటాడగానే రాధై సిగ్గుతో ఒక పరుగు తీసింది!

“సరేలెండి, మీరేమో మన అమ్మాయికి మంచి వరుడు కావాలని తొందరపడుతున్నారన్నమాట! మంచిదే! తమిళదేశంలో మన బంధువులు అమ్మాయిలని పక్కన పెట్టుకొని ఏంచెయ్యాలో తెలియక తికమకలాడుతున్నారు, ఇక మన సంగతిగురించి ఎవరికి తెలుసు? ఇన్నిరోజులవరకూ మీరు రాధై పెళ్ళిగురించి ఆలోచించనే లేదు!” అని విశాలం మొరబెట్టుకుంది.

“నీకెందుకు బెంగ? రాధైకి తప్పకుండా మంచి వరుడు దొరుకుతాడు.”

"అసలు మీ మేనల్లుడులాగ మొండి అబ్బాయిలున్నప్పుడు - ముప్పైరెండేళ్ళప్పుడు పెళ్ళి చేసుకుంటే - అమ్మాయిలకి పెళ్ళి ఎలా త్వరగా అవుతుంది? రాధై పెళ్ళికి ఇరవైఐదు నిండాలేమో, ఎవరికి తెలుసు?"

"ఏం, నా మేనల్లుడు గణేశన్ ఉన్నాడుగా?"

"అవును . . . మీ మేనల్లుడిని మీరే మెచ్చుకోవాలి!" అని విశాలం తన చుబుకంని భుజంమీద సొగసుగా తాకింది.

"పాపం, నా చెల్లెలుకూడా మన రాధైలాగే బాధ పడుతుందేమో? 'గోపు అన్నయ్యకి నేనంటే ఏవగింపు!' అని రాధై అంటోంది. నా చెల్లెలి మనసులోనూ నా గురించి అదే ఆలోచన కాబోలు! ఐనా, నేనేం చెయ్యగలను? నా దృష్టి అంతా నా సంసారం మీదనే! అలాగే గోపుకి రాధైమీద అపేక్ష ఎలా కలుగుతుంది? రాధే, ఇలా రా . . . నువ్వు మన తమిళదేశంలో ఉన్నప్పుడు గోపి ఉద్యోగమంటూ ఉత్తరదేశంకి పారిపోతాడోమో? రా, నీకిప్పుడు పెళ్ళి వద్దు, ఏమంటావ్?" అన్ని అతను కూతుర్ని అడిగారు; భార్య ఇక ఏమైనా అంటుందేమో అనే శంకతోనే అతను రాధైవంక తిరిగారు. ఎటువంటి వ్యధ, బాధ లేకుండా విశాలం ఉత్తరదేశంలో హాయిగా కాపురం చేస్తోందని అతని చెల్లెలికి అసూయ ఉంది; ఆవిడ కడుపుమంటవల్ల విశాలం కొన్ని ఎత్తిపొడిచిన మాటలు వినడమైంది. ఎప్పుడైనా ఆ పాతజ్ఞాపకాలు వస్తే విశాలం అగ్నిపర్వతంలా మారుతుంది! ఆ 'ఎప్పుడైనా' తరుణం ఇప్పుడు రాకూడదని సబేశన్ భయపడుతున్నారు!

రాధై అతన్ని రక్షించడానికి పూనుకోలేదు; దానికి అగత్యం రాలేదు.

"అవును, అందరు చెల్లెళ్ళూ అన్నయ్యలని నిందించడం సహజమే! మరి నేనూ ఒక చెల్లెల్ని!" అని చెప్పి విశాలం ఊరుకుంది. 'అరే, ఇదేదో వింతగా ఉందే!' అనే ఆలోచనతో భార్యని చూస్తూ సబేశన్ అలాగే నిలబడిపోయారు.

ఎప్పటిలాగే మొట్టమొదట మద్రాసు వాళ్ళకి స్వాగతం చెప్పింది. మద్రాసులో తోటల్లుడి ఇంట్లో రెండురోజులు బసచేసి సబేశన్ తిరుచ్చి వెళ్ళారు. అంత త్వరగా ఆ కుటుంబంలోని ఎడబాటు ఎవరికీ నచ్చలేదు; తోటల్లుడూ ఆక్షేపించారు. కాని కోయంబత్తూర్ పెళ్ళిలో మళ్ళీ అందరూ కలుసుకుంటారనే కారణం వలన ఆ ప్రయాణం సాగింది; తిరుగు ప్రయాణం మద్రాసులోనేకదా ఆరంభమౌతుంది?

తిరుచ్చినుండి చెల్లెలు సీత కుటుంబంతో సటేశన్ తన తల్లిదండ్రులూ, తమ్ముడూ ఉన్న కరూర్ చేరుకున్నారు. పెళ్ళికొడుకు తల్లి - అతని అక్కయ్య - తన కుటుంబంతో మాయవరంనుంచి అక్కడికి వచ్చిచేరింది. ఎక్కడచూసినా పెళ్ళి సందడి, గడబిడ! పెళ్ళికొడుకు పక్షం కాబట్టి ఆ కుటుంబంలో ఎవరికీ, ఎటువంటి బాధ్యతలూ, ఇబ్బందులూ లేవు. అందరూ పిచ్చాపాటీలోనూ, ఉబుసులాడుకుంటూనూ, మజాగా రోజులు గడిపారు.

** ** **

రాధై ఆనందభరితమైన భావనలలో మునిగితేలింది. అందరు బంధువులూ ఒకచోట కలిసివున్నారు; ఆ కోలాహలంలో రాధైకి ఆ ఇల్లు ఒక 'చిన్న ప్రపంచం' లాగ కనిపించింది, అందులో తనకి హోదా ఉందని గుర్తుచేసుకొని తృప్తిపడింది.

రాధై ఉత్తరదేశంనుంచి వచ్చిన కారణంవలన అందరినీ ఆకర్షించింది. చిన్న అమ్మాయిలూ, అబ్బాయలూ, ఏం పెద్దలు కూడా ఆమె దుస్తులూ, గాజులూ, కర్ణికలూ చూసి మురిసిపోయారు. ఇక రోజువారీ అలవాటులు, చేష్టల్లో తనకీ, ఇతర అమ్మాయిలకీ ఎటువంటి భేదమున్నట్టు రాధైకి అనిపించలేదు. కాని తన అత్తయ్యా, పెద్దనాన్నగారు భేదం ఉన్నట్టు ప్రస్తావించినప్పుడు రాధై కొంచెం గర్వపడిందికూడా. కొన్నిసార్లు రాధై సహజంగా, సాధుగా ఏమైనా అంటే "అవును మరి, ఉత్తరదేశంలో పెరిగిన పిల్లకదా? దానికి వంచన, మోసం అంటే ఏమీ తెలియదు!" అని కొందరు పొగడారు; ఆ మెచ్చుకోలు రాధై అణకువతో స్వీకరించింది.

ఒకరోజు రాధై అత్తకూతురు రాధై పెట్టెలోవున్నవి చూసి "ఇవేం ఏం గొప్ప? నా స్నేహితురాలు పట్టు మద్రాసులోనుంచి వచ్చిందే, అది తెచ్చినవన్నీ ఎంత చోద్యంగా ఉన్నాయో తెలుసా?" అని ఎత్తిపొడవడంతో రాధైకి **చిన్నబుచ్చుకున్నట్టైంది.** కాని తమ్ముడు బాలు అక్కయ్యని వెనకేసుకొని మాటాడాడు: "మీ పట్టు సంగతి అలాగ ఉండనీ; ఇక్కడ ఎవరైనా మా రాధైకి సాటి ఉన్నారా, చెప్పండి!అదే నా పాయింటు!" అని వాడు గర్జన చేసాడు.

"ఒరేయ్, బాలూ, ఊరుకో! నాదగ్గర ఉన్నవేమో నాకేం గొప్పగా కనిపించలేదు! ఐనా అందరూ - నా గాజులు, దుస్తులూ చూసి నన్ను పొగడుతున్నారు!

నానమ్మకికూడా చాలా సంతోషం!" అని రాధై నిమ్మళంగా తమ్ముడ్ని మందలించింది; దానితో 'సాధు', 'మంచి స్వభావం' అని అందరూ ఆమెగురించి చెప్పుకున్నారు.

ఈ ప్రశంసలకి అడ్డుగా ఒక ఘటన జొరపడింది.

సబేశన్ ప్రయాణంలో అతని అక్కయ్య కొన్ని మార్పులు సూచించారు.

పెళ్ళికి ఈరోడుద్వారా వెళ్ళాలని నాలుగురోజులముందే తనుమాత్రం తన కుటుంబంతో ప్రయాణం చేసి, ఈరోడులో కొన్నిరోజులు ఆగి, ముహూర్తంకి ముందురోజు కోయంబత్తూర్ చేరుకోవాలని సభేశన్ ఆలోచించారు. కాని అతని అక్కయ్య - వయసులో అతనికంటే పెద్ద, అనుభవసాలి - అతనితో ఏకీభవించలేదు.

"అందరూ కలిసి హాయిగా పెళ్ళికి వెళ్ళడం వదులుకొని ఇదేం గొప్ప ప్లానురా? నీ తోటల్లుడు తమ్ముడింట్లో కొన్నిరోజులు బసచెయ్యాలవి నీకు ఆతురతగా ఉందా? అలాగే కానీ! కావాలంటే పెళ్ళి సంబరాలైన తరువాత తిరుగుప్రయాణంలో నువ్వు అతనింట్లో దిగు!" అని ఆవిడ వక్కాణించారు. అదే మంచి ఆలోచన అని సభేశన్ ఒప్పుకున్నారు.

అతను రాధైని పిలిచారు: "అమ్మాయీ, విను. మనం తిరుగు ప్రయాణంలో ఈరోడులో దిగుదాం. నీ దురదృష్టం, పెళ్ళికి ఈరోడునుంచి ఎవరూ రారనిపిస్తోంది. అలాగైతే అక్కడే నీ ఆశ నెరవేరురుతుంది. ఐతేసేం, ఈ ఆలస్యం నాలుగురోజులకే! ఈ పెళ్ళి సందడిలో నాలుగురోజులు నాలుగు నిమిషాలుగా ఎగిరిపోతాయ్!" అని ఆమెను ఊరడించారు.

రాధై సరే అని ఊరుకుంది. మరేం చెయ్యగలదు? అత్త చెప్పిన సలహ్ నాన్నగారు ఆమోదించారు; తన మాట ఎవరు వింటారు?

'సరే, పోనీ, ఆలస్యం నాలుగు రోజులేకదా? పెళ్ళికి వెళ్ళే దారిలో ఈరోడులో దిగాలంటే రెండురోజులే సాధ్యమేమో? పెళ్ళి గొడవా, సందడీ అంతా కొంచెం ఎక్కువగానే ఉంటాయి. 'అన్నయ్య'తో పరిచయమవుతున్న సమయంలో మళ్ళీ మనం ప్రయాణం సాగాలంటే? ఆ తర్వాత 'అన్నయ్య'తో తీరికగా మెలగడం ఎలాగ? తిరుగుప్రయాణంలో రెండురోజులు కాదు, నాలుగు రోజులు - ఏం, పదిరోజులుకూడా

- ఈరోడులో గడపవచ్చు! 'అన్నయ్య' నొక్కిచెప్తే, నేనూ పట్టుబడితే నాన్నగారు తప్పకుండా వింటారు!' ఇలాంటి ఆలోచనలు కల్పించుకుంటూ రాధై, తన మాట సాగదని తెలుసుకొని, మనసుని ఓదార్చుకుంది.

కోయంబత్తూర్ పెళ్ళికి అందరూ ప్రయాణమయ్యారు; ఈరోడులో రైలు మారే సమయం వచ్చినప్పుడు రాధై మనసంతా 'అన్నయ్య' మీదే ఉంది.

'అన్నయ్య ఉంటున్న ఊరు దాటి వెళ్తున్నాం; అతన్ని చూడకుండా వెళ్తున్నాం!' అని ఆమె మనసు నొచ్చుకుంది.

పెళ్ళిబృందం కోయంబత్తూర్ వెళ్లే కంపార్టుమెంటుని చేరుకుంది. సబేశన్, అతని బావమరది 'ఏ కంపార్టుమెంటులో ఎక్కుదాం?' అని ఆలోచిస్తూ రైలుబండిని పూర్తిగా వెతుకుతూ ముందుకు నడిచారు. సబేశన్ అన్నయ్య వయసు చెల్లిన తన తండ్రి చెయి పట్టుకొని నిలబడ్డారు; తక్కిన స్త్రీలూ, పిల్లలూ తమకుతామే తోచినట్టు వాళ్ల వెనక నడుస్తున్నారు.

ఓరవాకిలిగా కనిపించిన ఒక కంపార్టుమెంటు చూసి రాధై "ఇదెలావుందో చూద్దామా?" అని అంటూ తలవొంచి చూసింది; కాని వెంటనే ఏదో జ్యోతినిచూసి కళ్ళు మిణకరించినట్టు తలని వెనక లాగ్గుంది.

గాబరాతో రాధై "అయ్యయ్యో!" అని అరిచింది. మరుక్షణమే ఆ కంపార్టుమెంటునుంచి ఎవరో మెల్లగా నవ్వడమూ, "ఏమే, ఎందుకీ గోల?" అని తల్లి తన్ను చీవాట్లు పెట్టే మాటలూ ఆమె చెవిలో వినిపించాయి.

పెళ్ళికని ప్రయాణం చేస్తున్న గుంపులో తను పలికిన అపచార వార్తని తల్లి ఆక్షేపించినట్టు రాధైకి అనిపించింది. "అది కాదమ్మా, అందులో ఒక కాబూలీవాళ్ల కుటుంబం ఉంది; వాళ్ళనిచూసి భయపడిపోయాను!" అని చెప్పి త్వరగా ముందుకు నడిచింది. తల్లిగాని, మరెవరు పిల్లలుగాని, ఆ కంపార్టుమంటులో తొంగిచూసి తను చెప్పినది అబద్ధం అని తెలుసుకుంటే తనకి ఎంత అవమానం!

అసలు అక్కడ ఉన్నదెవరు? కాబూలీ కుటుంబం కాదు!

రాధై అక్కడ చూసినప్పుడు ఒక మూల తిన్నగా బెంచిలో కనిపించినవారు నలుగురు యువకులు. రాధై తలుపు తెరిచి చూడగానే వారందరూ గభీమని ఆమెను ఒకేసారి చూసారు. ఆ గుంపులో ఒక యువకుడు - చూడడానికి

నొగసుగా ఉన్నాడు - రాధైని ఒక నిమిషం రెప్పవార్చకుండా చూసాడు; తళతళమని వికసించే ఆ కళ్ళుచూసి రాధై కలవరపడింది.

హటాత్తుగా ఏర్పడిన ఈ ఘటన వలన అమాయకురాలు రాధైలో ఎంత త్వరగా మార్పు చోటుచేసుకుంది! దుడుకైన ప్రేమ అంటే అదే! ఐనా ఒక నిమిషంలో సర్దుకొని, తన కలవరంకి మరేదో కారణం చెప్పుకొని రాధై ఎలాగో తప్పించుకుంది!

రైలుబండి వేగంలో ఈ ఘటన తరువాత రాధై మనసులో 'అన్నయ్య' జ్ఞాపకం పూర్తిగా పోయింది. ఇక సాగిన ప్రయాణంలో 'ఆ కొత్త యువకుడు' ఆమె మనసుని ఆక్రమించేసాడు. 'ఇదొక మంచి అనుభవం; పెళ్ళిబృందంలో నాకు కొత్తగా చాలామంది పరిచయమైయ్యారు. ఇంకా కొన్నిరోజుల్లో 'అన్నయ్య'ని తప్పకుండా కలుసుకుంటాను!' అనే నమ్మకమూ, ఇంపైన భావనలూ పదిహేనేళ్ళ రాధై మనసుని ఆకట్టుకున్నతరువాత ఆమె మొహమంతా కాంతితో ప్రకాశించిందంటే అందులో ఆశ్చర్యమేముంది?

మన పురాణాల్లో మయసభ అని ఒకటుందని అనేవారు; అదొక భవనం; అక్కడ ఎది చూసినా చోద్యంగా కనిపిస్తుందట; చూసినవారి కళ్ళకే దానివలన ఒక విచిత్రమైన శక్తి కలుగుతుందని అందరూ అనేవారు.

'ఆ మయ సభ ఎవరికీ కనిపించదు; దాన్ని చూసే అనుభవం ఎవరికీ జరగదు!' అని మనకనిపిస్తుంది.

కాని . . . ఏం, ఎందుకు జరగదు? అందుకు మయ సభ అని ఒకటి తప్పకుండా కావాలా ఏమిటి? తను పెళ్ళిలో చూడబోయే కోలాహలం, సొంపు అలాంటి అనుభవమని  రాధై నమ్మింది: అవును, ఆ మయసభకున్న శక్తి తను పాల్గొన్న పెళ్ళి వేడుకల్లోనూ తప్పక ఉంటుంది!

ఇంతకుముందు రాధైకి ఇటువంటి వేడుకలతో పరిచయం లేదు; పెళ్లంటే ఏమిటో రెండుమూడు సార్లు  చూసివుంది. కాని అప్పుడు ఆమె ఒక బాలిక. అసలు ఆ వేడుకల్లో ఆమె తల్లిదండ్రులుకూడా ప్రత్యేకంగా ఎటువంటి బాధ్యత వహించలేదు. కాని ఇప్పుడు జరుగబోయేది వాళ్ళ ఇంటి పెళ్ళి; రాధై ఒక యువతికూడా. అన్నీ గ్రహించే వయస్సు ఆమెకుంది; లోకజ్ఞానం కావాలని ఆతురతకూడా  ఉంది.

పెళ్ళికొడుకికి రాజమర్యాదలతో స్వాగతం చెప్పే వేడుకలో ఏదీ గుఱితప్పకూడదని రాధై కళ్ళు నాలుగు దిశలా ఆ గుడినీ, ఆ జన సమూహాన్నీ చూస్తూనే ఉన్నాయి.

'ఓ, అదెవరు?'

'అవును! అతనే! తను రైలుబండిలో చూసిన ఆ యువకుడు!'

ఈరోడు స్టేషన్ లో తనకి దర్శనమిచ్చిన అదే యువకుడు, ఇప్పుడు అదే స్నేహితులతో కోవిల ముందు మళ్ళీ కనిపించాడు! రాధై ఉలిక్కిపడింది. ఒక క్షణం దేవుణ్ని దర్శించిన తాపసిలాగ పరవశపడింది. కాని వెంటనే సర్దుకుంది. ఆ యువకుడూ తన్ను చూస్తున్నట్టు తెలియగానే, సిగ్గుతో తలవంచుకుంది.

పెళ్ళికొడుకూ, అతని పరివారమూ వెళ్ళే మార్గంలో రాధై కాళ్ళూ నడిచాయి. కాని ఆమె మనసంతా తను వింటున్న నాదస్వరగీతం, దాని ప్రధానంశలతో పోటీ పడుతున్నట్టనిపించింది. ఇక కన్నులగురించి చెప్పాలా? కొంచెం సమయంలో నాదస్వరవాద్యం ఆగింది; పెళ్ళి జరిగే స్థలం వచ్చినతరువాతకూడా రాధై కళ్ళలో భ్రమణం అలాగే ఉంది; కాని ఆ యువకుడి మొహం కనిపించలేదు.

ఆ మరుదినం, ముహూర్త సమయంలో, ముందూ వెనుకా, కొన్ని గంటలవరకూ రాధై కళ్ళకి అటువంటి చిక్కులేవీ లేవు. ఆ పొడుగాటి పెళ్ళి పందిలిలో, ఒక మూల, అదే స్నేహితులమధ్య ఆ యువకుడు మళ్ళీ కనిపించడంతో రాధై అతన్నే చూస్తూవుంది!

ఆ యువకుడూ నిమ్మళంగా అలాగే ఉన్నాడు! అప్పుడప్పుడు తనున్న స్థలం మారినా, తన బృందంతోగాని, ఇతరులతోగాని ఎక్కువగా కలుపుకొనే అలవాటు అతనికి లేదని తెలిసింది.

అతనిలో కనిపించే స్వేఛ్ఛ, వ్యక్తిత్వం తనకి అనుకూలంగా ఉందని రాధై సంతోషించింది; కాని కొంచెం బాధపడిందికూడా.

'అతను ఎవరు? మన బంధువుడా, లేక పెళ్ళికూతురు కుటుంబంకి చెందినవాడా? ఈ పెళ్ళి సందడిలో అతనేదీ పట్టించుకున్నట్టు కనిపించదే! ఆ ముగ్గురు స్నేహితులూ నిత్యమూ అతనితో కలిసివున్నారు; అప్పుడప్పుడు ఎవరైనా వచ్చి అతనితో మాటాడుతున్నారు. అతనూ నవ్వుతూ ఏదో

అంటున్నారు, కాని ఈ పెళ్ళి సంబరాల్లో ఎందుకతనికి ఈ ఉదాశీనతా, ఎడబాటూ?' ఈ ప్రశ్నే రాధై హృదయాన్ని తారుమారు చేసింది. 'ఆ యువకుడు ఈ పెళ్ళిని చూసి అనుభవించే ధోరణి వింతగా ఉందే?' అని ఆశ్చర్యపడింది. 'ఐతనేం, అతను తన్ను చూసిన ధోరణిలో ఎటువంటి లోపమూ లేదు!' అని సంతోషించింది; మనసులో మెచ్చుకుంది.

ఆ సాయంకాలం విందుకి తరువాత  జరిగిన పాట కచేరీలో గాయకుడు వధూవరులని రెచ్చగొట్టినట్టు కొన్ని యుగళ గీతాలు పాడినప్పుడు రాధై ఆ యువకునిమీద మళ్ళీ తన చూపు విసిరింది. అతనూ ఆమెను తిరిగిచూసాడని ఆహ్లాదపడింది. కాని ఆ తరువాత ఆ యువకుడు పెళ్ళి సందడిలో మరెప్పుడూ కనిపించక మాయమైపోయాడు!

పెళ్ళి వేడుకలన్నీ ఒకరోజుకే అని ఏర్పాటు చేసినా, పెద్దల కోరికని అనుసరించి ఔపాసన, హోమం వంటి ముఖ్య ఆచారాలన్నీ నాలుగు రోజులు శాస్త్రోక్తంగా జరిగాయి. త్వరలో బంధువుల్లో చాలామంది తమతమ ఊర్లకి నిష్క్రమించారు; కొందరు - సబేశన్ కుటుంబ సభ్యులు - నిలిచిపోయారు; సబేశన్ కి కోయంబత్తూర్లో బాల్య స్నేహితులుండడం వలన అది సాధ్యమైంది.

క్రమంగా పెళ్ళి సందడి తగ్గిపోయింది. తన మనస్సుని దోచుకున్న యువకుడూ గభీమని మాయమైపోయాడు - రాధైకి ఇప్పుడు ఎక్కడ చూసినా శూన్యమే కనిపించింది. ఈ పరిస్థితిలో తను విన్న ఒక సంభాషణ  - సబేశన్ తన మిత్రునితో మాటాడుతున్నారు - రాధైని వేధించింది. ఆ మిత్రుడు మరెవరో కాదు, పెళ్ళికూతురు తండ్రి! తన అబ్బాయికి రాధైని చేసుకోవాలని అతని అభిలాష! దానిగురించి ఇద్దరు తండ్రులూ ప్రస్తావించుకుంటున్నారు, అంతే; ఏదీ నిశ్చయమవలేదు,  కాని రాధై అదరిపడింది. ఎందుకంటే, ఆ అబ్బాయిని ఆమె చూసి ఉంది. నల్లగా, లావుగా, కనిపించాడు. చూసేవారెవరూ  మరిచిపోలేని ఆకారం! రామ రామ . . .

తను వరించిన ఆ అందగాడు మాయమైపోయాడు. ఇక ఈ 'మన్మధుడు' తరచుగా తన కళ్ళముందు ఇలా అలా కనిపించడం వలన రాధైకి గట్టిగా నవ్వాలనిపిస్తోంది! అంతేకాదు! ఇప్పుడితని కల్పనలో  రాధై ఒక వధువన్నమాట!

నాన్నగారిమీద రాధైకి పట్టరాని కోపం వచ్చింది. 'అతని మనసు ఇంత త్వరలో మారిపోయిందే? నాకు ఎప్పుడు 'అన్నయ్య'ని చూపిస్తారో తెలియదు! అత్త మాట వినగానే అతను తన ప్రోగ్రాం మార్చుకున్నారు. బాగుంది! ఇప్పుడేమో ఈ ఈరోడు వెళ్లే  సంగతి బాగా మరిచిపోయి, నా పెళ్ళిగురించి ఆలోచిస్తున్నారు! నాకితనితో పెళ్ళా? తమాషాగా ఉంది!' అని రాధై కసురుకుంది.

కాని ఈ పెళ్ళి సంబంధం ఏనాడూ జరగడని ఆమెకి బాగా తెలుసు. నాన్నగారికి ఈ సంవత్సరం తన పెళ్ళిగురించి ఎటువంటి ఆలోచనా లేనేలేదు. “సరేలేండి, వరుడని ఎవరైనా వస్తే చూద్దాం!” అని తన తల్లిమాటలు విని నాన్నగారు కూతురు పెళ్ళిగురించి ఆలోచిస్తున్నారని రాధై ఊహించింది.

'ఏనా అగత్యంలేకుండా ఎందుకీ పెళ్ళిమాటలు? ఈరోడు ప్రయాణంగురించి కొంచెం తొందరపడితే బాగున్ను!' అని విసుగ్గుంది.

'ఆ అందగాడే నాకు తగిన వరుడు!' అని రాధై మనసులో ఉంది. 'అన్నయ్య'ని చూడాలని ఆమె తపించిపోతోంది. అలాంటప్పుడు నాన్నగారి ప్రవర్తన చూసి రాధైకి కోపం రావడం సహజమేకదా? ఆ మానసిక బాధతోబాటు, తన పిన్నికుటుంబంలో ఎవరూ పెళ్ళికి రాలేదని రాధై గుర్తుచేసుకుంది.

ఈరోడు ప్రయాణంగురించి నాన్నగారు పట్టించుకోలేదని రాధై బాధపడినా అతను మాత్రం ఆలాగేం ఊరుకోలేదు. పెళ్ళి విడిదినుంచి గోపు తండ్రి సుబ్బయ్యర్ కి అతను ఉత్తరం రాసారు. సబేశన్ స్టేషన్ కి నిశ్చితంగా ఒక రాత్రి వస్తే తనకి వసతిగా ఉంటుందని గోపు తండ్రి అతనికి ప్రత్యుత్తరంలో సూచించారు.

అందరూ కోయంబత్తూర్ నుంచి బయలుదేరారు; సబేశన్ మధ్యలో తన కుటుంబంతో ఈరోడులో దిగాలని, ఇతరులు తిన్నగా కరూర్ కి ప్రయాణం చెయ్యాలని నిశ్చయమైంది.

రైలుబండి ఈరోడు స్టేషన్ చేరుకొనే సమయం రాగానే రాధై ఒక కిటికీలో మొహం పెట్టుకొని బైట చూసింది; సబేశన్ ఇంకొక కిటికీలోనుంచి సుబ్బైయ్యర్ ప్లాట్ ఫారంలో ఎక్కడైనా కనిపిస్తున్నారా అని చూస్తున్నారు.

బండి కదలుతూనే ఉంది. “అదో, ఆ స్తంబం దగ్గర . . . ” అని రాధై గభీమని అరిచింది.

"అవును, అతనే! . . . స్తంబం దగ్గర ఉన్నారు!" అని సభేశన్ ఆమోదించారు.

"నీకెలా తెలుసే? నువ్వుగాని అతన్ని ఇంతకుముందు చూసివున్నావా?" అని విశాలం ఆశ్చర్యంతో కూతురిని అడిగింది.

ఒక క్షణం రాధై చిక్కులో పడింది; ఒడలంతా వణికింది; దానితోబాటు హృదయస్పందన ఎక్కువైంది. ఐనా ఆ సమయంలో ఆమె మౌనం వహించడం ఎవరైనా గుర్తించారా, లేదు! రైలు స్టేషన్ లో వచ్చి ఆగింది; ప్రయాణికులందరూ త్వర త్వరగా దిగుతున్నారు. విశాలం ప్రశ్న అడిగింది కాని జవాబు ఎదురుచూడలేదు; రాధై కూడా జవాబు చెప్పే పరస్థితిలో లేదు.

స్తంబం దగ్గర రాధై చూసినది ఆ యువకుడే! తొందర తొందరగా ఆమె నోటినుంచి మాటలు వెలుబడ్డాయి! ఆ స్తంబం పక్కనే సుబ్బయ్యర్ నిలబడి ఉన్నారు! అతన్నే సటేశన్ సూచించారు!

రైలు ఆగింది. సటేశన్ సైగ చూసి సుబ్బైయ్యర్ అతనున్న జాగాకి వచ్చేసారు. రాధై తిరిగిచూసింది; స్తంబం పక్కన కొంచెం దూరంలో కనిపించిన యువకుడు అక్కడే నిలబడివున్నాడు. ఏదీ ఎదురుచూడకుండా ఆమెను కలుసుకున్నట్టు అతని కళ్ళు ఒక క్షణం రాధైమీద వాలాయి.

సటేశన్ కంపార్టుమెంటునుంచి మూటాముల్లెలు దింపుతూ, అప్పుడప్పుడు సుబ్బైయ్యరుతో ఏవో మాటలు చెప్పుకున్నారు. సుబ్బైయ్యర్ సటేశన్ తల్లిదండ్రులనీ, అక్కయ్యనీ జరిగిన పెళ్ళిగురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీళ్ళమధ్య నిలబడి అన్నీ వింటున్న విశాలం గభీమని రాధైను చూసింది.

"ఏమే, రాధే? మాటాడవేం? అన్నయ్యని ఇంకా పదిహేను నిమిషాల్లో చూస్తావులే!" అని అంటూ సుబ్బైయ్యర్ని చూసి విశాలం అడిగింది: "ఏమండీ, మీతో గోపు రాలేదా? రాధై ఇప్పుడే అతన్ని చూసివుంటుందే?"

సుబ్బైయ్యర్ కొంచెం పరధ్యానంగా కనిపించినా విశాలం ప్రశ్న అతను విన్నారు. "మీరెందుకు అడుగతున్నారు? గోపూకూడా వచ్చాడే? వాడెక్కడ?" అని తల తిప్పుతూ "ఒరేయ్ గోపు, ఇలా రా?" అని పిలిచారు.

“గోపు పెళ్ళికి వచ్చాడా?” అని విశాలం, సభేశన్ ఆశ్చర్యపడే అదే సమయంలో రాధై ‘ఐతే అన్నయ్య వచ్చాడన్నమాట! ఇతనేనా గోపు అన్నయ్య?’ అని అందగాడైన ఆ యువకుడుని గుర్తుచేసుకుంది.

సుబ్బైయ్యర్ మాటలు విని, స్తంబంని వదిలి వీళ్ళని కలుసుకోవాలని గోపు ముందుకు నడిచి వచ్చాడు; తను ప్రేమించిన ఆ యువకుడిని చూసి రాధై ఉలిక్కిపడిందంటే అందులో ఆశ్చర్యమేముంది?

గోపు నవ్వుతూ అందరికి దర్శనమిచ్చాడు. సబేశన్ ఒక క్షణం కనుబొమలు ఎత్తి “అవును, ఇది మన గోపువే, నాకు గుర్తుంది . . . వీడిని ఇటీవల ఎక్కడో చూసానే?” అని మెల్లగా లాగారు.

“మరెక్కడ, మీరు పెళ్ళిలోనే చూసివుంటారు! వాడూ కోయంబత్తూర్ వచ్చాడుగా! కాని ముహూర్తం ఐనవెంటనే తిరిగి వచ్చేసాడు! వీడికి తనకుతానే ఎవరితోనూ మాటాడే అలవాటు లేదు! నా మాట విని ‘సరే, ఒక రోజే కదా?’ అని పెళ్లికి వెళ్లాడు!” అన్నారు సుబ్బైయ్యర్.

“విన్నారా? అలాగే కాబోలు . . . వాడూ ఒంటరిగా వచ్చాడు, పెళ్ళిలో ఎవరితోనూ ఎక్కువగా కలుసుకోలేదు! మాకూ వాడిగురించి ఏమీ తెలియదు! మీరెవరూ పెళ్ళికి రాలేదనుకున్నాం, గోపు మాత్రం వస్తాడని మాకు తెలీదే! ఇంకా వాడొక చిన్న పిల్లవాడనేకదా మా మనసులో ఉంది? వాడిని చూసి ఎంత కాలమైందో, అదే జ్ఞాపకం మాలో నిలిచిపోయింది! అబ్బోయ్, వాడిప్పుడు ఎంత బాగా పెరిగిపోయాడు! అప్పుడే రాధై అన్నయ్యని చూసి ఉంటే ఎంత బాగున్ను! అదీ చాలా ఆతురతగా ఉంది. అసలు మా అయనే గోపుని గుర్తుపట్టలేదు! మరి నాకెలా తెలుసు చెప్పండి!” అని విశాలం అంది.

“ఇప్పుడు దగ్గరగా చూస్తే నాకు గోపు మొహంలో పోలిక కనిపిస్తోంది . . . అవును, అప్పుడు వాడికి మీసం లేదు . . . కాని మొహంలో ఏం పెద్ద మార్పూ కనిపించడంలేదు . . . మరి నేనెంకెందుకు వాడిని పెళ్ళిలో కనిబెట్టలేదో నాకు తెలియదు!” అన్నారు సబేశన్.

“రాధే, అన్నయ్యని చూసావా, బాగా చూడు! . . . అరే, దాధై కూడా బాగా పెరిగిపోయిందే? దాన్ని నేను నాలుగేళ్ళ వయసులో చూసినట్టు జ్ఞాపకం . . . ఆదీ, ఒకే ఒక సారి అనుకుంటాను . . . ” అని సుబ్బాయ్యర్ పలికారు.

“అన్నయ్యకి ఎదుట వచ్చి నిలబడు!” అని కూతురు చెయి పట్టుకొని విశాలం రాధైని ముందుకు తోసింది; “అయ్యో, నేను రాను!” అని దాధై భయపడుతూ వెనకాడింది. అది విని అందరూ నవ్వారు. రాధై పడిన బాధ వాళ్ళకి తెలియదే?

ఎలాగో ఆఖరికి సభేశన్ కుటుంబమంతా  ఆనందిస్తూ సుబ్బైయ్యర్ ఇల్లు చేరుకున్నారు. గోపు ఎక్కువగా ఏమీ మాటాడలేదు. “నాన్నగారు ఒత్తిడి చేసారు; మనింటినుంచి ఎవరైనా ఒకరు తప్పకుండా పెళ్ళికి వెళ్ళాలని అన్నారు. అందుకనే నేను వెళ్ళాను . . . మీరెవరితోనూ నాకు పరిచయం లేదు, లేకపోతే తప్పకుండా మిమ్మల్ని కలుసుకొనివుంటాను,” అని సబేశన్ కి చెప్పుతూ  అంటూ  రాధైని చూసాడు.

‘అయ్యో, మీరేనా నా అన్నయ్య?’ అని సిగ్గూ, మొహమాటంతో అడుగుతున్నట్టు రాధై గోపుని చూసింది.

‘నన్నా నువ్వు ఇన్నిరోజులూ ‘అన్నయ్య’ అని కల్పించుకున్నావ్? నువ్వేనా ఆ రాధై?’ అని గోపు తన్ను అడుగుతున్నట్టు రాధైకి భ్రమ కలిగింది.

ఇంతవరకూ వారిద్దరి మనసులమధ్యా సంప్రదింపులు ఎటువంటి అడ్డం, ఆటంకం లేకుండా కన్నులతోనే జరిగాయి; ఇప్పుడు ఆ పరివర్తన రాళ్ళు, కొండలమధ్య ప్రవహించే కూలంకషలాగ సాగింది.

అన్నయ్య ఇంటిలో - గోపుని తప్పిస్తే - రాధై దాగుడుమూతలు ఆడుతోందని అందరూ హేళన చేసారు. “చూసారా, ‘అన్నయ్య’, ‘అన్నయ్య’ అని పాట పాడే పిల్లకి ఇంత సిగ్గు ఎలా వచ్చేసిందో? ఒక మాటైనా అనదేం? బాగుంది, నోరు విప్పి ‘అన్నయ్యా’ అని పిలవకూడదా?” అని విశాలం భర్తని అడిగి పకపకమని నవ్వేసింది.

“రాధై, విను, మనం ఊరుకి వెళ్ళిసతరువాత నువ్వు మరేం గొడవ చెయ్యకూడదు! ఈ నాలుగు రోజులూ అన్నయ్యతో కలిసి, మెలిసి అన్ని ముచ్చటలూ కానీ!” అని అన్నారు సబేశన్.

"ఒరేయ్, గోపు, నువ్వు ముందు నీ చెల్లెల్ని పిలిచి మాటాడవేం?" అని అతను గోపుని ప్రేరేపించారు. గోపు నవ్వేసి మరేం అనక ఊరుకున్నాడు. 'ఇదేంటి, ఎందుకు అమ్మా, నాన్నా ఇలా నన్నుచంపుతున్నారు?' అని రాధైకి కోపం వచ్చింది; కాని దానితోబాటు ఆమె మొహంలో కాంతీ, సిగ్గూ, చిరునవ్వూ చోటుచేసుకున్నాయి.

ఈ తమాషా అంతా పెళ్ళిలో నూతన వధూవరులని ఎగతాళి చేసే ధోరణిలో జరుగుతున్నట్టు అందరికీ అనిపించింది. రాధై పెళ్ళికూతురులాగే లజ్జతో ఇంటిలో ఇక్కడా అక్కడా దాగుతూ రోజులు గడిపింది. గోపు పెళ్ళికొడుకులాగ జడ్డి నవ్వు నవ్వుతూ, కాని డాబుతో మెలిగాడు; కాని లోలోపల ఇద్దరూ బాధపడుతూనేవున్నారు.

ఇంద్రియ జ్ఞానం అనే రీతిలో గోపుని రాధై ప్రియుడుగా భావించినా, ఆమె అతన్ని అన్నయ్య అనే కొనియాడింది. అలాగే గోపు మనసులో రాధై ప్రియురాలు అనే నిర్వచనం దాటి ఆమె తన భావనలో చెల్లెలుగా పరిచయమైన యువతి అని తెలుసుకున్నాడు.

రాధై 'ఊరుకి ఎప్పుడు తిరిగి వెళ్తాం?' అని కాచుకొని ఉంది; లేకపోతే, 'అమ్మా, నాన్నగారూ తన్ను రోజూ ఇలాగే పీడిస్తూ ఉంటారు!' అని తనలో గొణుక్కుంది.

ఒకరోజు మధ్యాహ్నం సభేశన్, సుబ్బైయ్యర్ ఉయ్యాలలో కూర్చొని పిచ్చాపాటీలో రాధై, గోపు గురించి గురించి ఏవో కబుర్లు పంచుకున్నారు.

"అసలు ఇంతకుముందు వీళ్ళిద్దరికీ ఎటువంటి పొత్తూ లేదుకదా? అందువలనే ఈ మోమాటం, బిడియం అంతా . . . అప్పుడే - మూడు సంవత్సరాలముందుగాని పరిచయమైవుంటే - ఈపాటికి ఏ చిక్కూ ఉండదు . . .అసలు ఏం జరిగిందంటే మీరు ఎక్కడో దూరదేశంకి వెళ్ళిపోయారు, ఆ తర్వాత ఈ చుట్టుపక్కల్లో కనిపించనే లేదు!" అన్నారు సుబ్బైయ్యర్.

"అవును . . . నిజం."

"నా మాట వినండి! నన్ను అపార్థం చేసుకోవద్దు! చూడండి! ఇప్పుడు గోపు రాధై అన్నయ్య- చెల్లెలు అని మనం అంటే వాళ్ళు నిజంగానే అన్నయ్య- చెల్లెలు ఐపోతారా? ఇద్దరికీ రక్తసంబంధం అని ఏమీ లేదే? అటువంటి రక్తసంబంధంగాని ఉందంటే దాని మహిమ వలన ఈ సిగ్గుకీ, మొహమాటంకీ వీల్లేదు! అవునా? నేను

ఏమంటునన్నానో మీకు తెలిసిందా?" అని అంటూ సుబ్బైయ్యరు ముక్కుపొడిని పీల్చారు.

"అవును . . . అవును . . . " అని సటేశన్ గొణిగారు.

"చూడండి! తన పిన్ని పిల్లలకి పెద్దనాన్నగారి కొడుకు గోపు అన్నయ్య అని రాధైకి తెలుసు. అలాగే వాడూ తనకి అన్నయ్య అని రాధై తృప్తి పడుతోంది. అవునా? ఆ ఆలోచన రాధైకి ఎలా వచ్చిందో తెలుసా? దానికి విశాలమే కారణం!" అని అంటూ సుబ్బైయ్యర్ మళ్ళీ ఒకసారి ముక్కుపొడి లాగారు.

సటేశన్ లేతగా నవ్వారు. వంటగదిలోనుంచి తొంగిచూసిన భార్యను చూసారు; 'ఇదొక మంచి సంబంధం!' అని వింటే రాధైకి ఎలా ఉంటుంది?' అనే ఆలోచనతోబాటు అతనికి భయమూ  కలిగింది. కుండలు చెయ్యాలంటే అది కుమ్మరికి చాలారోజుల పని; కుండలు బద్దలుచెయ్యడానికి ఒక నిమిషం చాలు.

ముక్కు తుడుచుకుంటూ సుబ్బైయ్యర్ మళ్ళీ సంభాషణ సాగించారు:

"ఇదిగో చూడండి! నేను చెప్పదలచుకున్నది వింటే నాకే ఎలాగోవుంది . . . ఇలాగేదీ జరగలేదంటే అసలు నేనూ మా అబ్బాయికి రాధైని చేసుకోవాలని అడిగివుండను, అవునా? చెప్పండి,  ఈ పెళ్ళి జరగవలసినదేకదా? మీదీ మాదీ వేరే వేరే  కుటుంబాలు; మీ గోత్రంకూడా  వేరు. ఈడుజోడు సరిగ్గానే ఉంటుందని నా ఉద్దేశం. వయస్సులో ఆరేడేళ్ళ భేదం ఉండొచ్చు, అంతే! అవునా?"

'ఇతనేమో నిలకడలేని మాటలు పలుకుతున్నారు!'  అని ఒక నిమిషం సటేసన్ ఆలోచించారు. కాని వెంటనే తన మనసులో ఏముందో అతను తెలియజేసారు.

"అలాగనకండి . . . రాధై  మీ మాటలు  వింటే గంతులేస్తుంది! అన్నయ్య లేదంటే అది మమ్మల్ని వదలనేవదలదు! ఇక మా గతి ఏంకాను?" అని అంటూ సటేశన్ నవ్వేసారు.

మేడమెట్లమీద కూర్చొని సుబ్బైయ్యర్ మాటలు వింటున్న రాధైకి నిజంగానే ఒక గెంతు గెంతాలనే ఆవేశం కలిగింది. కాని మేడమెట్ల మొనలో గంతులేస్తే తను కిందబడి దొర్లవలసిందే! అందుకే ఆ ఆవేశం రాధై మనసులో దాచుకుంది.

సుబ్బైయ్యర్ పలికిన ఆఖరి మాటల్లోని సందేశం ఆమె మనసుని గల్లంతు చేసింది; నాన్నగారి మాటలు దాన్నిసుస్థిరం చేసాయి.

ఎవడో స్నేహితుడు ఇంటినుంచి అప్పుడే ఇంటికి తిరిగివస్తున్న గోపు ఏదో సినిమా పాట చివర పదాలు వల్లించుకుంటూ మేడమెట్లు ఎక్కిరావడం రాధై గమనించింది. గభీమని లేచి, వరండా ద్వారా మేడ హాలులోని వెనుకభాగం చేరుకొని, అక్కడున్న మెట్లు దిగి, పెరడులోని బావిని దాటి ఇంట్లోకి ప్రవేశించింది. ఇవన్నీ రెండు నిమిషాలలో ఆపోయాయి!

సముద్రతీరంలో అలలు వచ్చినప్పుడు ఆ నీళ్ళలో  మునిగి ఆడాలని పిల్లలికి ఆశ సహజం.  మనసులో భయం, పిరికితనం చోటు చేసుకున్నా ఆ ఆటలు, ముచ్చటలు  మానరు. అలాగే రాధై మొదటి రెండురోజులూ తమాషాగా గడపింది. ఆ తర్వాత రెండురోజులూ ఆ హాయిలోని అనుభూతి లేదు.

“ఏమే రాధే! ఇప్పుడైనా అన్నయ్యకి ఏం చెప్పాలో అన్నీ ఒక సారి బాగా చెప్పేయ్ . . . ఊరుకు వెళ్ళినతరువాత ఉత్తరాలు రాయవచ్చు!” అన్నారు సటేశన్.

“ఊరుకోండి, నాన్నగారూ!” అని రాధై సిగ్గుతో అతన్ని బతిమాలింది.

“నాకేం పోయింది? ఊరుకి వెళ్ళి మళ్ళీ ‘అన్నయ్య’, ‘అన్నయ్య’ అని చాడీలు చెప్తే నేను ఊరుకోను!” అని అతను బెదిరించారు; కూతురు మొండితనం తగ్గలేదని అతను విసుగ్గున్నారు.

‘సరే, నేను చాడీలు చెప్పను!’ అని రాధై సణుక్కొని ఊరుకుంది; ఆమె మాటలు ఎవరూ వినలేదన్నది నిజం.

ఆ ఇంటికి వచ్చినప్పుడు “ఇక ‘అన్నయ్య’, ‘అన్నయ్య’ అని చికాకుపడడం మానుకో!” అని సటేశన్ మందలించినప్పుడు రాధై ఎలా కళ్ళు తడబెట్టుకొని ఏ మూలలోనో దాంకుంది! ఇప్పుడు తను కొంచెం కఠినంగా హెచ్చరించినా ఆమెలో ఆ ప్రభావం లేదని అతనికి ఆశ్చర్యం కలిగింది.

అసలు ఏం జరిగిందంటే రాధైలో గాఢమైన మార్పు వచ్చేసింది. ఆఖరికి గోపు దగ్గర సెలవు తీసుకొనే వేళలో రాధై అతన్ని కన్నులార చూసి, ఆనందించి తన ఊరుకి తిరిగి వచ్చింది.

‘అమ్మా, ఈ రోజుల్లో ప్రియుడు అన్నయ్యగా మారడం మామూలుగా జరిగేదే; ప్రేమలో ఓడిపోయి మరొకతను భర్తగా రావడం జరిగితే నిరాశ చెందిన ఆ యువతి మనసు మారవలసిందేకదా?’

‘అన్నయ్య అని నేను కల్పించుకున్న ఒకతను నాకు భర్తగా మారుతారనే చోద్యం నాకు  ఇప్పుడే అర్ధమైంది! ఇది నాకొక వింత అనుభవం! అదే నా ఆకాంక్ష! నువ్వు దాన్ని నిరవేర్చుతావా?’

ఈ ప్రశ్నని, తన మనోవ్యధని ఒక చీటీలో రాసిపెట్టి రాధై చమత్కారంగా సినిమాకి వెళ్ళిపోయింది. తను తిరిగివచ్చేసరికి ఆ పధకం ఏమైందని తెలియాలి! సినిమా చూసివచ్చిన తరువాత ఏమీ తెలియనట్టు మంచంలో వాలింది!

ఆ చీటీకి ఫలితం రెండువారాల తరువాత తెలిసింది. ఎక్కడో మూలలోనున్న పనసపండు వాసన బాహటంగా  వ్యాపించినట్టు అందరూ రాధై పెళ్ళిగురించి మాటాడుకున్నారు; రెండు కుటుంబాలమధ్య ఉత్తరాలు పంచుకోవడం; రాధై-గోపు పేర్లూ, జాతకాలు సరిపోల్చడం, ఆ తరువాత పెద్దల అనుమతి, దీవెనలు.  ఇవన్నీ లాంఛనప్రాయంగా జరిగాయి.

‘భార్యాభర్తల శాస్వతనుభంధానికి గుర్తుగా నాకిప్పుడు మంగళసూత్రం ఉంది. ఇక ఈ లోకంలో అందరూ నా తోబుట్టువులే! ‘అన్నయ్య’ అని నేను కొనియాడినతను నన్ను ఇప్పుడు భర్తగా ఏలుకున్నారు! ఇక అతనే నా ప్రపంచం!’ అని ఆహ్లాదించే రాధై ‘మన పురాణ గాధల్లో మావంటి తక్కిన భార్యాభర్తలున్నారా?’ అని ఆలోచిస్తోంది!

ఆదర్శ ప్రియులగుంచి మన ఇతిహాసాల్లో చాలా పిట్టకధలున్నాయని రాధైకి తెలియదేమో?

‘రాధైకి అన్నయ్య లేడు!’ అని ఎవరూ ఇక ఎగతాళి చెయ్యరు. లేత వయసులో రాధై తన ప్రేమానురాగాలకి అవతారం అని నమ్మిన ఒక వ్యక్తిని ‘అన్నయ్య’ అని భావించింది; యువతిగా అతనే తన భర్త అని తెలుసుకుంది. ఈ ప్రజ్ఞ ఆమె దాంపత్యంకి దోహదం చేసే ప్రేరణ అని వేరే చెప్పాలా?

********

**(మూలం ప్రచురణ: కావేరీ: మార్చ్, 1947)**


கூப்பியகை
வீந்தியா

# ముకుళిత హస్తాలు[1]

ఉదయాన్నే నాకు ఫలహారం తీసుకువచ్చిన యువకుని నేను తదేకదృష్టితో గమనించాను. తెలివైన విద్యార్థిలా కానవస్తున్నాడేకాని  ఇలాగ టేబిలువద్ద పడిగాపులుపడి కాలం గడపమని విధి శపించినట్లుంది. దైవ సంకల్పం తెలియ ఎవరితరం?

"న్యూస్ పేపర్ అబ్బాయి ఎంత సేపటికి  వస్తాడు? నాకు ఇప్పుడే కావాలి," అని అడిగాను.

"మీకోసం నేను తెచ్చిపెడ్తానండి."

"నువ్వు పేపర్ ఏజంటువా?"

"కాదు. కాని గత నెల్ఫాళ్ళుబట్టి నిత్యం పేపరు కొంటున్నాను. నేనిక్కడ అతుక్కుపోయాను, ఐనా ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని నాకనిపించింది. ఉండండి,  మీకు పేపరు తెచ్చిపెడ్తాను," అని అంటూ మాయమైపోయాడు; త్వరలో పేపరుతోబాటు ప్రత్యక్షమయ్యాడు.

"నువ్వెంతవరకు చదివావ్?"

"నేను ఎనిమిదో క్లాసు చదువుతుండగానే మా నాన్నగారు పోయారు. అందువలన స్కూలు మానేయవలసివచ్చింది."

"నీ కర్తవ్యం నువ్వు నిర్వహిస్తూండు. ఎప్పుడూ దైవం మీద విశ్వాసాన్ని విడనాడకు. అంతా మన మంచికే జరుగుతుంది."

ఇతరుల్ని ఉత్తేజపరిచేందుకు నేను సదా వాడే పడిగట్టు పదాలు అవి.

యువకుడు నన్ను చూసి ఒక చిరునవ్వు నవ్వాడు.

"ఏం, ముందు ముందుకు మంచి రోజులు వస్తాయని నమ్మకం లేదా నీకు? విశ్వాసాన్ని అభివృద్ధిపరచుకో. ఆ భగవంతుడే మార్గం చూపిస్తాడు నీకు."

"నా భవిష్యత్తు మీద నాకు నమ్మకం ఉంది.  కాని భగవంతునిమీద నమ్మకం పెట్టలేకపోతున్నాను."

[1] ఈ కథ కే.వి. శేషారావుగారు అనువదించారు

"ఆయనమీద పరిపూర్తి విశ్వాసం ఉన్నవారికే ఆయన దేవుడు. లేనివారికి ఆయన ఒక రాతి విగ్రహమే. ఆ భగవంతుడు నీకు విశ్వాసం, ధైర్యం ఇవ్వాలని నేను కోరుకుంటున్నాను," అని అంటూ వార్తాపత్రిక పేజీలు తిరగవేయడం ఆరంభించాను.

ఎనిమిదన్నర ప్రాంతంలో నా వ్యాపార వ్యవహారాలు చూసుకోడానికి బయలుదేరాను. అప్పుడే ఆ అబ్బాయిని పిలిచి, "నీ పేరేంటి?" అని అడిగాను.

చిరునవ్వు చిందిస్తూ, "సుబ్రమణ్యన్," అని జవాబిచ్చాడు.

"ఈ దగ్గర్లో ఏవైనా మందిరాలు ఉన్నాయేమో నీకు తెలుసా? నేను బైటకి వెళ్తున్నప్పుడు దర్శించుకుంటాను."

"హోటల్ నుంచి బైటకి వెళ్ళగానే మెయిన్ రోడులో ఎటూ తిరక్కుండా తిన్నగా వెళ్ళండి. కొంత దూరంలో ఒక అరటితోట కనిపిస్తుంది. ఆ తోట మధ్య ఒక మందిరం ఉందనుకుంటాను. అది తప్పితే చుట్టుపక్కల మరో మందిరం ఏదీ లేదనుకుంటాను."

"ఎవరినైనా అడిగితేగాని ఎలా తెలుస్తుంది?" అనుకుంటూ టాక్సీలో ఎక్కి కూర్చున్నాను. ఇప్పటి నా ఈ పరపతి ఐశ్వర్యం మధ్యలోకూడా, అవకాశం ఉంటే మందిర దర్శనం చెయ్యకతప్పను అనే సంగతి సుబ్రమణ్యన్ తెలుసుకోవాలని నాలో నేను అనుకున్నాను.

నిత్యం ఒక పుస్తకంలో 'శ్రీరామజయం' అనే అక్షరాలు రాసుకున్నాక కాని ఆ రోజు ఏ కార్యక్రమంకూడా ప్రారంభించని తరహా మనిషి నేను. వ్యాపారరీత్యా నిత్యం వందలు, వేల రూపాయలు నా చేతిమీద నడుస్తాయి. ఇప్పుడు అకస్మాత్తుగా ఒక చిక్కులో పడ్డాను. ఇప్పుడు చేతిలోని ఒక వ్యవహారం సంధర్భంగా, స్వయంగా చూసుకోవలసిన పనిమీద, వెంటనే ఇంటికి వెళ్ళవలసిన అవసరం ఏర్పడింది.

నేను ఇంటినుంచి బయలుతేరుతున్నప్పుడు కొన్ని కరెన్సీ నోట్లు కట్టలు నింపిన ఒక పాకెట్టుని నా సూట్ కేసులో పెట్టిన గుర్తుంది. ఇప్పుడది కానరావటంలేదు. ప్రయాణం మధ్యలో దాన్ని పోగొట్టుకున్నానా? ఈ హోటల్లో ఎవరికీ దాన్ని తాకే అవకాశం లేదని ఖచ్చితంగా చెప్పగలను. ఇప్పుడు ఇంటికి

వెళ్ళడానికికూడా నా దగ్గర డబ్బులు లేవు. ఈ సమయంలో నాకెవరు సాయం చేస్తారు? ఈ దగ్గర్లో నాకెవరూ చుట్టాలూ, బంధువులూ లేరు. ఆ కారణం వల్లనేకదా నేను హోటల్ లో బస చెయ్యవలసివచ్చింది?

"త్రాగడానికి చల్లని నీళ్ళిమ్మంటారా అయ్యా?" అంటూ గదిలోకి ప్రవేశించాడు సుబ్రమణ్యన్. "మీరు చాలా అలసిపోయి ఉన్నట్లు కనిపిస్తున్నారు. ముఖం పీక్కుపోయినట్లుంది."

"త్రాగడానికి చల్లని నీళ్ళు తీసుకురా. నేనిప్పుడు ఒక చిక్కులో పడ్డాను," అన్నాను నా పరిస్థితిని చెప్పడానికి ముందుగా ఒక చిరునవ్వుతో.

"అయ్యా, మీకొచ్చిన చిక్కేమిటో నేను తెలుసుకోవచ్చా?"

"ముందు కొంచెం మంచి నీళ్ళు తీసుకురా, ఆ తరువాత సంగతేమిటో చెప్తాను," అని అతన్ని బయటకి పంపించేసాను.

ఉన్నపాళంగా నాకు కనీసం డబ్బై రూపాయలు కావాలి. అంత డబ్బు సుబ్రమణ్యన్ని అప్పుగా అడగవచ్చా? ఆయన ఇవ్వగలడా? హోటళ్ళలో సాధారణంగా అనుమానస్పదంగా వ్యవహారాలు నడిపించేబాపతు వ్యాపారినే నేనుకూడా అని అతను అనుమానిస్తే? గొప్ప వ్యాపారస్తుల్లా నటించి అమాయిక జనాల్ని మోసగించే సంఘటనలు మనం ఎన్ని వింటున్నాం? . . .

సిగ్గుతో నా హృదయం కుంచించిపోయింది. కాని నా ఆలోచన నా మీద పైచెయ్యి అయింది. నాకన్న తక్కువ స్థాయివాడి దగ్గర్నుంచి నేను సహాయం పొందకపోవడానికి నాకు తగిన కారణం కనిపించలేదు.

సుబ్రమణ్యన్ మంచినీళ్ళు తీసుకొని వచ్చాడు.

"నీ దగ్గర కొంత సహాయం అడగడానికి బిడిదు పడితే నాకు జరిగే మేలు ఏమీ ఉండదు. నాకు వెంటనే కనీసం డబ్బై రూపాయలు కావాలి. నా ఉంగరం అమ్మి వెంటనే కొంత సొమ్ము చేసుకోవచ్చును, కాని నాకలా చెయ్యడం ఇష్టం లేదు. నువ్వు నాకు డబ్బై రూపాయలు అప్పుగా ఇవ్వగలవా? నేను మా ఇంటికి చేరుకున్నవెంటనే ఆ సొమ్ము పంపించేస్తాను. నీకు డబ్బు అందిన తరువాతనే

నాకు నా ఉంగరం పంపించేయవచ్చు. ఇది కేవలం పరస్పర నమ్మకంతో కూడిన వ్యవహారం" అని నా ఉద్దేశం ఏమిటో తెలియజేసాను.

అరమరిక లేకుండా సమాధానం ఇచ్చాడు అబ్బాయి: "నమ్మకంతో కూడిన వ్యవహారం అంటున్నారు. దానికి మధ్యలో మళ్ళీ ఉంగరం మాటెందుకు?"

"కాని తాత్కాలికంగా నా ఉంగరం నీ దగ్గర అట్టిపెట్టుకోవచ్చు," అని అంటూ నా చేతిలోని ఉంగరం తీయబోయాను.

"దయచేసి అలాంటిదేమిటి చెయ్యవద్దు. ప్రస్తుతం నా దగ్గర అరవై రూపాయలున్నాయి. కావాలంటే మీరు ఇంటికి తిరిగి వెళ్ళాక ఆ డబ్బు పంపించవచ్చు."

ఆ అబ్బాయి సత్వరచర్య చూసి నాకు చాలా ఆనందం కలిగింది. అతనికి భగవంతునిమీద నమ్మకం లేకపోయినా మానవులమీద ఆ నమ్మకం ఉంది. అతనిచ్చిన అరవై రూపాయలు కృతజ్ఞతతో అందుకున్నాను. "సమయానికి నువ్వు చేసిన మేలుకు చాలా సంతోషం," అంటూ, "మరోవారంలో నీ డబ్బు అందుకుంటావ్," అని మరోసారి అన్నాను.

నేను గది ఖాళీ చేద్దామని రిసెప్షన్ కౌంటర్ దగ్గరికి వెళ్ళేసరికి అక్కడ ఒక ఆశ్చర్యకర విషయం ఎదురైంది.

కాఖీ బట్టలు వేసుకొని ఉన్న ఒక ఆసామికి చేత్తో నన్ను చూపిస్తూ హోటల్ మేనేజరు ఏమిటో అంటున్నారు: "నీతో ఇంతవరకూ ప్రస్తావిస్తున్న ఆయన ఈయనే!"

మా అబ్బాయి టెలిగ్రాం మనియార్డర్ ద్వారా నాకు డబ్బు పంపించేసాడు, "పొరపాటున మీరు డబ్బు ఇంటిదగ్గర విడిచిపెట్టేసారు. ఈ రోజే T.M.O. చేస్తున్నాను. అందుకున్నట్లు తెలియపరచండి," అనే సందేశంతోపాటు.

అదే దైవకృపకి కారణం అంటాను.

"సుబ్రమణ్యం, నీ హస్తరాసి చాలా మంచిదోయ్," అని అతనితో అన్నాను ఆనందంగా. "నువ్వు నీ చేత్తో అరవై రూపాయలు ఇచ్చావ్, చూడు, ఇప్పుడు నా చేతిలో రెండువేల రూపాయలు!"

"మీరు ఆనందంగా ఉండడం చూసి నాకు చాలా సంతోషంగా ఉందండి."

"నేను మీ హోటల్లో మరో రెండురోజులు ఉండాలని నిశ్చయించుకున్నాను. నేను రూమ్ ఖాళీ చేసి వెళ్ళినప్పుడు నీ అరవై రూపాయలు నీకు తిరిగి ఇచ్చేస్తాను. నీ డబ్బు నా చేతిలో ఉన్నంతవరకూ నా లావాదేవీలు అన్నీ లాభకరంగా జరిగిపోతాయనే నమ్మకం నాకు కల్గుతోంది."

"మీరలా అనుకోవడం నా అదృష్టం. మీరు కోరుకున్నంతకాలం ఆ డబ్బు మీ దగ్గరే అట్టిపెట్టుకోండి," అని అంటూ ఒక చిరునవ్వుతో సుబ్రమణ్యన్ సమాధానం ఇచ్చాడు. "మీరు రెండువేల రూపాయలందుకున్న తరువాతకూడా నా అరవై రూపాయలకి మీరిచ్చే విలువ చూస్తూంటే నాకు చాలా ఆనందంగా ఉందండి." వెంటనే వ్యవహార సరళిలో "రాత్రికి మీకు చప్పాతి, కూటు ఏర్పాటు చెయ్యనా? కొబ్బరి చట్నీకూడా ఉంటుంది," అని అన్నాడు.

"ఓ, అలాగే చెయ్యి," అని అంటూ అతన్ని మళ్ళీ ఒకసారి మెచ్చుకున్నాను. "ఈ ఉదయం చెప్పిన సంగతి నువ్వు గుర్తుంచుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక్కడకి వచ్చే రకరకాల వ్యక్తులు రకరకాల అభిరుచులు కోరుకుంటుంటారు. అలాంటప్పుడు ప్రత్యేకంగా ఒక వ్యక్తి కోరుకున్నదేమిటో గుర్తు పెట్టుకోవడం చాలా కష్టం. నేను గత ఎనిమిదేళ్ళు ఉత్తరదేశంలో ఉంటున్నానేమో, రాత్రుళ్ళు చపాతీ తినడం అలవాటైపోయింది." సుబ్రమణ్యన్ పిచ్చాపాటిలో పాల్గొనాలనే ఉద్దేశ్యంతో మాటల్లోకి దింపాను, కాని అతను వెంటనే నన్నువిడిచి వెళ్ళిపోయాడు. బహూశా నావంటివాడితో అంత చనువు ఆయనికి నచ్చకపోయుండవచ్చు.

అతన్ని మళ్ళీ పిలిచాను. "ఈ ఉదయం నేను గుడికి వెళ్ళలేదు. ఊ తోటలోకి వెళ్ళి గుడి ఎక్కడుందో వెతుక్కునంత సమయం లేకపోయింది. ఇప్పుడు సావకాశంగా వెళ్ళి రావాలని ఉంది. రాత్రి భోజనంగురించి నా మనస్సు మార్చుకున్నాను. నేనేమీ తీసుకోనని నిశ్చయించుకున్నాను." శ్రద్ధగా విని, తల ఆడించి సుబ్రమణ్యన్ వెళ్ళిపోయాడు.

నేను హోటలు వదలి ఇంకా ఎంతో దూరం వెళ్ళకముందే సుబ్రమణ్యన్ నా వెనుక పరుగెత్తుకొని వచ్చాడు. "ఇప్పుడు అక్కడ చీకటిగా ఉంటుంది, ఇది మీకు ఉపయోగపడ్తుంది," అంటూ ఒక flash light నాకు అందించాడు. "రేపు ఉదయం మరొక అబ్బాయి మీకు పరిచర్య చేస్తాడు. ఈ లైటు మీరు రేపు సాయంత్రం నాకు తిరిగి ఇవ్వవచ్చు."

"అదేంటి, ఈ రోజంతా నువ్వు డ్యూటీలో ఉన్నావ్?"

"నిజమే. ఈ రోజు పగటి డ్యూటీకి రావలసిన రాజుకి ఒంట్లో బాగులేదు. కాని రాజుకు బదులుగా రేపు సాయంత్రం నేను డ్యూటీ చేస్తాను."

"ఐతే, నాతోపాటు రాకూడదా? నువ్వెప్పుడూ మందిరంకి వెళ్ళవా?"

"మందిరంకి వెళ్ళకూడదనే గట్టి సిద్ధాంతం ఏమీ లేదు నాకు. కాని ఇప్పుడు రాజుకి జావ చేసి ఇవ్వాలి," అని అంటూ సుబ్రమణ్యన్ వెళ్ళిపోయాడు.

నేను మళ్ళీ నడవడం ప్రారంభించాను. దారిలో సుబ్రమణ్యన్ గురించి ఆలోచించకుండా ఉండలేకపోయాను. ఇతనొక యువకుడు. మంచివాడే. ఒళ్ళు వంచి పని చేస్తాడు. ఇతరుల అవసరాలేమిటో కనిపెట్టి ఉండేవాడు. నేను మందిరానికి ఎలా వెళ్ళాలో తగు సూచనలిచ్చిన ఆ యువకుని పద్ధతిని నేను ఆత్మీయతో గుర్తు చేసుకున్నాను. అతను హోటల్లో ఒక సర్వరే; అది నిజంగా క్రమశిక్షణ, బాధ్యతలతో కూడుకున్న ఉద్యోగమే.

అతను ఎంతో దూరదృష్టితో ఇచ్చిన ఆ టార్చ్ లైటు ఎంత ఉపయోగపడింది! వెన్నెల వెలుగు, వీధి దీపాలు కొంతవరకు పొదల మధ్య సాహసంగా వెళ్ళే నా ప్రయత్నానికి తోడ్పడ్డాయి. కాని ఒకసారి మందిరంలో అడుగు పెట్టగానే నన్ను అంతటా చీకటి కప్పుకుంది. లోకప్పునుంచి వ్రేలాడే రెండెత్తుల ఇత్తడి దీపం వెలుగే కానవచ్చింది. నూనెలో తడిసిన చిన్న వొత్తులనుండివచ్చే వెలుగు మాత్రమే నిగనిగలాడుతోంది. ఆ తళ తళ మెరుపు పూర్తిగా ఆవరించుకున్న చీకటిని చెదరగొట్టడం ఎలాగ? చేతిలోని టార్చ్ లైటు అందించిన సాయంతో నేను దర్శనం చేసుకున్నాను.

ఆ మరునాడు సాయంత్రం టార్చ్ లైటు తిరిగి ఇచ్చేస్తున్నప్పుడు ఇదే విషయం సుబ్రమణ్యన్ దగ్గర ప్రస్తావించాను. "ఒకసారి పగటిపూట దర్శనం చేసుకోండి," అన్నాడు అతను.

మంచి సలహా ఎవరిచ్చినా స్వీకరించవలసినదేకదా? అందువలన మూడవ రోజున ఉదయం స్నానం ముగించుకొని మందిరంకి నేను మరలా వెళ్ళాను. మందిరం చాలా చిన్నదే ఐనా శుచిశుభ్రంగా ఉంది. నా ఎదుట ఆంజనేయస్వాములు చాలా ఎత్తుగానూ, అందంగానూ నిలుచిని ఉన్నారు. ఒక చేతిలో సంజీవనీ పర్వతం. ఒత్తుగా, పొడవుగా కనిపించే తోక చుట్టలు చుట్టలుగా బోర్లపడి ఉంది. విశ్వాసంతో తన్ను కొలిచే భక్తుడికి ఈ ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చు అని అభయమిచ్చే రీతిలో కానవస్తుంది ఆ విగ్రహం. అర్చకుడుగా ఒక యువకుడు ఉన్నాడు. అతనే నిత్యకృత్యాలు కొనసాగిస్తున్నాడు. ఆయన కొనసాగిస్తున్న పూజా విధానం చూస్తుంటే సంప్రదాయ విధానాన్ని ఆచరించి నిత్యపూజలు చేస్తున్నట్లు కనిపించాడు. ఆయన హృదయాంతరంలో నిజమైన విశ్వాసం ఏమాత్రం ఉందో అని నేను ఆశ్చర్యపడ్డాను.

సుబ్రమణ్యన్ని ఒకసారి గుర్తు చేసుకున్నాను. అతనొక మార్గదర్శకుడు కాగల స్థిరమనస్తత్వ స్వభావం కాగలగే యువకుడు; కపటం లేని నమ్రత అతనిలో ఉంది; కాయకష్టంమీద గౌరవభావం గల వ్యక్తి. ఏ చురుకైన మనిషికైనా భగవత్ విశ్వాసం విడదీయరాని అనుభవం. జీవన గమనానికి అదొక అర్ధం, పతమార్ధం చూపుతుంది. ఐతే మరి ఈ సుబ్రమణ్యన్ ఎందుకు ఈ అవసరాన్ని అర్ధం చేసుకోలేకపోతున్నాడు?

ఆ సాయంత్రం అతన్ని కలుసుకున్నాను. "నీ స్నేహితుడు ఎలా ఉన్నాడు?" అని ప్రశ్నించాను.

"జ్వరం ఇంకా తగ్గలేదు," అని సమాధానం ఇచ్చాడు. "ఇంకా రెండుమూడు రోజుల్లో తగ్గిపోవచ్చు."

"అతని నుదుటమీద నమ్మకంతో ఈ కుంకం పెట్టు," అన్నాను చిరునవ్వుతో. సుబ్రమణ్యన్ కూడా పొడినవ్వు నవ్వాడు

"నీకు దైవంమీద నమ్మకం లేకపోవచ్చుగాక. కాని నేను పూర్తి నమ్మకంతో ఇది నీకు ఇస్తున్నాను. నాకు దైవమంటే నమ్మకం ఉంది. నిన్నొకటి అడుగుతాను. నీ చుట్టూ ఉన్న ప్రకృతిని ఒక్కమారు గమనించు. ఎన్నెన్ని అధ్భుతాలు! ప్రకృతిలో ప్రతీ వస్తువు దేనికదే ఒక ప్రత్యేకత, అందం సంతరించుకుంటుంది. ప్రతి వృక్షం దేనికదే ఒక ప్రత్యేకమైన ఆకును, పండును, పువ్వును కలుగి ఉంటుంది. అలాగే పచ్చిక చూడు. కలుపు మొక్కలూ, క్రిమి కీటకాలూ, మనకి నిత్యం ఎదురయ్యే విషపూరిత మొక్కలూ, లెక్కకు మించిన క్రిమి కీటకాలూ కూడా ఏదో ఒక ప్రత్యేకమైన ఉపయోగార్థమే సృష్టంచబడ్డాయి. కోటానుకోటి జీవరాసులన్నీకూడా సృష్టి, స్తిత లయం అనే జీవిత చక్రానికి లోబడే ఉంటాయి. ఏ ఇద్దరు వ్యక్తులుకూడా ఒకేలాగుండరు. ఇదంతా ఎలా సంభవించిందంటావు? దేముడున్నాడనే సిద్ధాంతాన్ని బలపర్చడానికి కాదు నేను చెప్తున్నది, కాని మన అవగాహానికి, ఆలోచనా సామర్థ్యానికి అతీతంగా మహోన్నతమైన తెలివితేటలతో ఒక దివ్యశక్తి మాత్రం ఉన్నదన్న విషయం మనం గమనించకతప్పదు. అదిగో, అటువంటి శక్తికే మనం ఒక రూపం కల్పించుకొని దాన్నే దైవం అంటున్నాం. అటువంటి దైవంపట్ల మన నమ్మకాన్ని భక్తి అంటున్నాం. అటవంటి భక్తివల్ల మనకెటువంటి నష్టమూ లేదు. ఇంకా చెప్పాలంటే మనం కొంత లాభంకూడా పొందుతాం. మొన్న ఒకరోజు నీకు నీ భవష్యత్తులో నమ్మకం ఉందని నాకు చెప్పావ్. దేవుడిమీద నమ్మకం లేకుండా నీ జీవితాన్ని కొనసాగింపగలవా? ప్రయత్నించి చూడు. త్వరలోనే నీ మనస్సు కల్లోలంలో పడుతుంది. నేను చెప్పేది అర్థమైందా?"

నేను ఒక ప్రశ్నతో ముగించాను. దైవసిద్ధాంతాన్నిగురించి ఇదే నా మొదటి ప్రస్తావన. నా వాదం నమ్మకం కలిగించే విధంగా ఉన్నాదని నా భావన.

నేలచూపులు చూస్తూ సుబ్రమణ్యన్ నాతో అన్నాడు: "ఏం చెప్పను సార్? కారణం ఏమిటో తెలియదుకాని నాకెప్పుడూ భగవంతున్ని పూజించాలనే ధ్యాస కలగలేదు. అదేమిటో నాకు అర్థం కావటం లేదు."


சிப்பு

"మన సైన్స్ ఏం చెప్తుందో మీకు తెలుసా?" అని ప్రశ్నిస్తూ ఇంకా ఇలా కొనసాగించాను. "ఈ సృష్టిలో ప్రతి వస్తువుకూడా ఏదో ఒక అనిర్వచనీయమైన కార్యకలాప ఫలితమే అని మనం తెలుసుకోగల్గుతాం. ఆ విధానమేదో మన ప్రయోగశాలల్లోకూడా నిర్ణయించుకోగల్గుతాం. అదే నిజమైతే నా ప్రతిస్పందన ఏమిటి? ఈ ప్రపంచమంతా ఒక పెద్ద ప్రయోగశాలే! దేవుడు అందులో సైంటిస్టు, అనగా శాస్త్రవేత్త అని నేనంటాను. మానవజన్మయొక్క ప్రతిష్ట, గౌరవం అంతా కూడా ఆ మేధాశక్తికే ఋణపడి ఉంది. నిత్యం మనం వైజ్ఞానిక పరిశోధనలు, కొత్త కొత్త సూత్రాలగురించి చదువుకుంటుంటాం. అటునంటివి చదునుకున్నకొద్దీ నాలో ఏదో తెలియని అద్వితీయమైన సంభ్రమాశ్చర్యాలు కలిగి, దైవంమీద నమ్మకం మరికొంత దృడపడ్తూ ఉంటుంది. నేనేం చెయ్యను? ఈ కారణంతోనే నేను నీవంటివారికి ఇటువంటి సూచనలతో ముక్తాయింపు ఇస్తూవుంటాను."

"మీరు నాకన్న పెద్దవారు, నాకు సలహా ఇవ్వాలనిపించడం సహజమే," అని సుబ్రమణ్యన్ బదులిచ్చాడు. "నా మట్టుకు నాకు నాలో భక్తిభావం లేదనుకోను. కాని నా మనస్సులో ఉన్నదేమిటో తెలియజెప్పలేను."

ఆ రాత్రికి నా వ్యాపారలావాదేవులన్నీ ముగించుకొని నా తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నాను. సుబ్రమణ్యన్ని పిలిచి మాట్లాడినందుకు నాలో నాకు గొప్ప తృప్తి, సంతోషం కలిగాయి.

"ఏదీ, నీ చెయ్యి చూపించు, నాకు అదృష్టం చూపించిన ఆ బంగారు చేతిని నాకు ఒకసారి చూపించు. జ్ఞాపక చిహ్నంగా నేను నీకొక ఉంగరం ఇస్తున్నాను. నువ్వు దాన్ని స్వీకరించాలి," అని అన్నాను.

నాకు గత కొన్ని రోజులుగా సేవలందించిన ఆ చేతిని నేనెరుదును. అతనికోసం అప్పుడే నేనొక బంగారు ఉంగరం కొని తెచ్చాను. ఆ ఉంగరం అతని వేలుకి సరిపోతుందో లేదో చూడాలి.

"నన్ను క్షమించాలి. బహుమతులు తీసుకోవడం నాకు అలవాటు కాదు," అంటూ త్వరగా సుబ్రమణ్యన్ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

'ఎంత అహంకారం, గర్వం ఈ అబ్బాయికి!' అనుకున్నాను.

"ఇదేదో లంచం అని అనుకుంటున్నావా?" అన్నాను. సుబ్రమణ్యన్ తన నిర్ణయాన్ని మార్చుకోనందుకు నేను చాలా చింతించాను. నా అభ్యంతరాన్ని దృడంగా నాలుగైదుసార్లు తెలియజేసినతరువాతకూడా ఫలితం లేకపోయింది. అతని జేబులో ఆ ఉంగరం జార్చేద్దాం అనుకున్నాను. కాని సుబ్రమణ్యన్ తన గుండెలమీద రెండుచేతులూ అడ్డంగా ఉంచడంవలన అందుకుకూడా అవకాశం లేకపోయింది.

"ఒక నిమిషం ఆగు. నువ్వు ఆ రోజున నాకిచ్చిన డబ్బు నేను నీకు బాకీ అన్నాను. ఆ డబ్బుకి బదులుగా ఈ ఉంగరం ఇస్తున్నానని అనుకుంటున్నావుకదూ? ఇదికూడా నా కృతజ్ఞతకి ఒక చిన్న సూచన మాత్రమే. రా, వచ్చి ఈ ఉంగరం అందుకో," అని కోరాను.

"అదేం లాభంలేదు, " అంటూ సుబ్రమణ్యన్ వెళ్ళిపోయాడు.

'ఏం గర్వం, ఎంత ఉపేక్ష,' అని అనుకున్నాను నేను. కాని నా కోపం వెంటనే మాయమైపోయింది.

నాకు తగిన సమయంలో నా ఇబ్బందినుంచి కాపాడడానికి M.O. ద్వారా డబ్బు పంపించిన నా కుమారుడికి బహుమానంగా ఇవ్వడానికి పనికివస్తుందికదా అని ఆ ఉంగరాన్ని సూట్ కేసులో భద్రపరిచాను. సుబ్రమణ్యన్ దగ్గర బదలుగా తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేసేందుకు కొంత డబ్బు తీసి లెక్కపెట్టి వేరే కవరులో ఉంచాను. నాకు వీడ్కోలు చెప్పడానికి వచ్చిన సుబ్రమణ్యంకి thanks చెప్పాను. బైట టాక్సీ సిద్ధంగా ఉంది.

"సుబ్రమణ్యన్, నేను వెళ్ళివస్తానయ్యా! ఆ భగవంతునికే ఎరుక మనం మళ్ళీ కలుసుకుంటామోలేదో." మేం విడిపోతుండగా అవే నా చివరి మాటలు.

ఆ యువకుడు - హోటలు సర్వరు - తను ఇచ్చినంత డబ్బే అందులో ఉంటుందనుకొని ఆ కవరులోని ఆ నోట్లు మళ్ళీ లెక్కబెట్టుకోలేదు. భక్తిపూర్వకంగా రెండు చేతులూ జోడించి నన్ను మళ్ళీ ఒకసారి రెప్పవేయకుండా చూసాడు. నా

అంకిత భావం, మతంమీద నాకున్న పట్టుదల అతని హృదయంకి ఏమైనా చెప్తోందా?

** ** **

నాలుగేళ్ళ తరువాత అదే గ్రామానికి నేను మళ్ళీ రావడం జరిగింది. మళ్ళీ అదే హోటల్లో దిగాను, మళ్ళీ సుబ్రమణ్యాన్ని చూడగలుగుతానేమో అనే ఆశతో.

సుబ్రమణ్యాన్ జాడ ఎక్కడా లేదు. నాకు ఉప ఆహారం తెచ్చిన సర్వర్ని అడిగాను.

"అతనెవరో నాకు తెలియదండీ," అన్నాడు ఆ సర్వరు. "నేనిక్కడికివచ్చి పదిహేను రోజులే ఐంది. నా వృత్తిలో నాలుగేళ్ళపైన ఎవరు అంటిపెట్టుకొని ఉండగలరు. చెప్పండి! అటువంటివారెవరైనావుంటే ఆయనికి ఒక గుడి కట్టి పూజ చెయ్యాలి. భగవంతుడికికూడా అటువంటి ఓర్మి ఉంటుందా అంటే అనుమానమే."

నేనొక చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను.

యధాలాపంగానే ఈ అబ్బాయి మళ్ళీ ఆ గుడిమాట నాకు గుర్తుచేసేసాడు. ఈ హోటల్లో దిగుతున్నప్పుడు సుబ్రమణ్యంమీదే నా మనస్సంతా; మందిరం గుర్తుకి రాలేదు. నిజంగా ఆ విషయమే మరిచిపోయాను! ఆ పరిస్తితికి కారణముంది: మందిరాలూ, అరటితోటలూ ఎక్కడైనా తారసిల్లుతాయి, కావి సుబ్రమణ్యంలాంటి మనిషి ఎక్కడ దొరుకుతాడు?

మారుతి మందిరంకి వెళ్ళాను. మందిరం చుట్టూ అరటి చెట్లు - అక్కడొకటి, ఇక్కడొకటిగా ఉన్నాయి. ఒక మూల కొత్తగా నీటి పైపు అమర్చబడివుంది. కొంతమంది అబ్బాయిలు మందిరం ముఖద్వారాన్ని రంగురంగుల కాగితాలతో అలంకరిస్తున్నారు.

"ఏమిటి విశేషం?" అని అర్చకున్ని అడిగాను.

"రాబోయే మూడు రోజుల్లో హనుమాన్ విగ్రహాన్ని ఆ మందిరం ఆవరణో కొలువు తీరుస్తాం. ఆ కార్యక్రమం రేపు రాత్రి ఆరంభమవుతుంది."

"రాత్రికా? ఈ చుట్టుపక్కల ఎలెక్ట్రిక్ కరెంటు ఉందా? గాస్ లైట్లు వాడుతారా?" అని అడిగాను, పైకి చూస్తూ.

ఏమాశ్చర్యం! ఒక స్తంబంనుంచి లైటు వేలాడుతోంది!

“ఇదెప్పుడు జరిగింది? నేను నాలుగేళ్ళక్రితం ఇక్కడికి వచ్చాను. అప్పట్లో కరంటు లేదు!”

“గత నాలుగేళ్ళనుంచి మీవంటి పెద్దల పుణ్యమా అని మాకు కరెంటు వచ్చింది.”

మందిరంకి ఇంకా కావలసిన అవసరాలేమైనా ఉన్నాయేమో అని తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఒకసారి ప్రదక్షణంలాగ చుట్టూ తిరిగి గమనించాను. ఏవో అక్షరాలతో ఉన్న ఒక నల్లసేనపురాయి ఫలకంమీద నా దృష్టి పడింది. దగ్గరగావెళ్లి రాసివున్నదేమిటో చదివాను. వెంటనే అర్చకుని దగ్గర పరుగున వెళ్ళి, “ఏమండీ, ఆ శిలాశాసనంలో ముద్రవేసిన ఆయను ఎవరు?” అని అడిగాను.

“మీకు అప్పుడే చెప్పానుగా? ఎవరో మీలాంటి ఉదార, స్వభావులు ఈ మందిరంకి కళ్ళు దానం చేసారు. మరి దీపాలంటే కళ్ళతో సమానం కదా?”

‘మీరంటున్నదేమో నాకు తెలుసులే!’ అని నాలో నేనే అనుకొని మళ్ళీ అర్చకస్వామిని అడిగాను: “ఆయన ఎంత ఇచ్చారో మీకు తెలుసా?”

“నిజంగానే నాకు తెలియదయ్యా. ఏభై రూపాయలో లేక అంతకన్న ఎక్కువేమో . . . ”

నా పని చూసుకొని హోటల్ కి తిరుగుముఖం పట్టాను. నేను ఉదయం చూసిన సర్వరుకన్న కొంచెం వయస్సులో పెద్దవాడైన మరొక సర్వరు నన్ను సమీపించాడు.

రాత్రి బాగా ప్రొద్దుపోయేవరకూ, హోటల్లో వ్యాపారం మట్టుపడ్డవరకూ ఆగి అప్పుడే మేనేజర్ని ప్రశ్నించడానికి నేను కాచుకొని ఉండలేకపోయాను. ఆ కొత్తవాడినే నేరుగా సుబ్రమణ్యం గురించి విచారించాను.

“సుబ్రమణ్యం గురించి తెలిసినవారెవరైనా ఇక్కడ ఉన్నారేమో అని నీకు తెలుసా? రాజు అనే అబ్బాయి గురించి విన్నావా? అతను ఇంకా ఇక్కడ ఉన్నాడా?”

ఆ అబ్బాయి చిరునవ్వు నవ్వి, “నేనే రాజుని. సుబ్రమణ్యం నా స్నేహితుడు,” అన్నాడు.

హైస్కూలు చదువు పూర్తిచెయ్యాలనే దృఢసంకల్పంతో సుభ్మణ్యం ఈ హోటలు పని మానేసాడట. అతని ప్రయత్నంలో సఫలీకృతుడై ఇప్పుడు మద్రాసులో టైపిస్టుగా చేస్తున్నాడని తెలుసుకున్నాను.

"గత నాలుగు సంవత్సరాలుగా నువ్విక్కడ ఉంటున్నావా?"

తన మానసికబాధ తెలియజేయగానే రాజు ముఖం తెల్లబారిపోయింది. "నేనుకూడా ఈ పని మానేసి ఇంకెకడైనా ప్రయత్నించాలనుకుంటున్నాను. కాని నాకా అదృష్టం లేదు. అందుకే ఇక్కడే చిక్కుకుపోయాను."

"నీ ఆరోగ్యం బాగుండలేదని అతను నాకు చెప్పాడు. అందువలనే నిన్ను గుర్తుపట్టాను. సుబ్రమణ్యం చాలా మంచి అబ్బాయి."

నవ్వుతూ రాజు మొదలుబెట్టాడు. "ఓహో, ఇప్పుడు నాకు అర్థమైంది! కోవిల కుంకుమ ప్రసాదం పంపించినది మీరే ఐవుండాలి! నా నుదిటికి కుంకం పెడ్తూ సుబ్రమణ్యం మీ గురించి చెప్పాడు. అదే బాగా పని చేసిందేమో, ఆ మర్నాడే జ్వరం తగ్గిపోయింది."

"కాని సుబ్రమణ్యంకి అటువంటి నమ్మకాలు లేవు!" అని రాజుని ఆటపట్టించాను.

"అదేమో నాకంత బాగా తెలీదు. కాని ఆ మరుసటి నెలలోనే ఆ మందిరంకీ, ఆ ప్రాంతంకీ కరెంటు తెప్పించాలని సుబ్రమణ్యం పట్టుబడ్డాడు. ఆటువంటి ఆదర్శ ప్రేరణకి అంత డబ్బు ఎక్కణ్ణుంచి వచ్చిందని అడిగితే సమాధానం చెప్పేవాడుకాదు. సుబ్రమణ్యం ఒక అసామాన్యమైన వ్యక్తి, చాలా అదృష్టవంతుడుకూడా. తనొక టైపిస్టని చెప్పుకోవచ్చు, కాని ఆ పదంకి మంచి గౌరవంకూడా ఉంది . . . సరే, కానీండి . . . ఇప్పుడు మీకేం కావాలో నాకు తెలుసుకోనివ్వండి . . . ఓవల్టిన్ తెచ్చేదా?"

సుబ్రమణ్యంకి నామీద ఎటువంటి గౌరవం ఉంది? నా సంపద చూసి అతను మారిపోయాడా? హఠాత్తుగా దైవభక్తిపారాయణుడైపోయాడా? లేక, నా మతవిశ్వాసంపట్ల అతనికి అభిలాష కలిగిందా?

నాకు సుబ్రమణ్యం వీడ్కోలు ఇచ్చిన దృశ్యం చాలా భారమైన హృదయంతో గుర్తుచేసుకున్నాను. చాలా భక్తిభావంతో రెండుచేతులూ జోడించి అతను నన్ను

నమస్కరించాడు. ఇన్నిరోజుల తరువాతకూడా నాపట్ల అతని భావనలో మార్పు ఉండకూడదని నేను నిజంగా కోరుతున్నాను. ఇప్పుడు అతను నాకు ఆపాదించే గౌరవం స్వీకరించడానికి నా మనస్సు అంగీకరించదు. నిజంగానే నేనందుకు తగను. నేను గతంలో సుబ్రమణ్యంకి చేసిన ధాతృత్వం, అతనిపట్ల నాకున్న అప్యాయత: అవే నిజంగా అతన్ని ఆ గౌరవంకి అర్హుడుగా చేసాయి.

మీకు తెలుసునో లేదో . . . అత్యవసరంలో సుబ్రమణ్యం నాకిచ్చిన అరపై రూపాయలు తిరిగి అతనికి అందజేస్తున్న సమయంలో, ఉదారంగా దానితోబాటు ఇంకో అరపై రూపాయలు జతపర్చి అందజేసాను. ఆ డబ్బునే సుబ్రమణ్యం మందిరానికి ఒక మంచి పనికోసం ఉపయోగించాడు. ఆయన ఉద్దేశంపట్ల నాకెటువంటి అనుమానమూ లేదు. ఆ శిలాశాశనంమాద చెక్కబడినది ***నా పేరే.***

********

# పూల దండ

మా పరిసరాలు దాటి నాలుగు వీదులకి అవతల ఒక ఇంట్లో పెళ్లి. ఆ వైభవంకి నేను వెళ్ళాను. అమ్మకే ఆ ఇంటివారితో బాగా పరిచయం ఉంది, కాని నేను అమ్మ ప్రతినిధిగా వెళ్ళాను. హోమగుండం ముందు కూర్చున్న కొత్త వధూవరువులని చూడాలని నాకు చాలా ఆతురత.

నేను తమిళుల పెళ్ళి చూసి చాలా కాలమైంది. అందుకే ఇప్పుడు అన్నీ సంబరాలు - లాలీ, వధూవరులని ఉయ్యాలలో కూర్చోబెట్టి పాడే ముచ్చటలు - ఇవన్నీ చూసి ఆనందించాలని మూహూర్తంకి ముందు రోజే, ఒక సాయంకాలం, ఆ ఇల్లు చేరుకున్నాను.

ముహూర్త దినం . . .

పెళ్ళికొడుకు బంధువుల్లో చాలామంది కాశీయాత్రకి వెళ్ళిపోయారు. పెళ్ళికూతురు మాత్రం తన అక్కయ్యతోనూ, మరి వేరే ఇద్దరు స్నేహితులతోనూ, వధువుకే తగిన సిగ్గూ, ఆనందంతో కానవచ్చింది. పొర్లుతున్న ఆ కళ్ళలో ఆమె తటాపటాయింపు నాకు బాగా బోధపడింది; ఆమె అక్కయ్య నిండు గర్భవతి అన్న కారణంవలన ఇంట్లోనే చెల్లెలికి తోడుగా ఉన్నారు; నాకూ, నా చెల్లెలికి ఆవిడే స్వాగతం చెప్పారు.

మామధ్య ఎక్కువ పరిచయం లేకపోవడంవలన మేం ఎక్కువగా ఏమీ మాటాడుకోలేదు.

పెళ్ళికి వచ్చిన అతిథుల్లో ఎవరో అడిగారు కాబోలు - వధువు అక్కయ్య తంగం వాళ్ళతో ఉత్సాహంతో మాటాడారు. “ఈ పెళ్ళేమో తొందర తొందరగా నిశ్చయమైంది; పెద్దలు టెలిగ్రాములతోనే పెళ్ళి వివరాలన్నీ సంప్రదించుకున్నారు. అదేదో ఈ సంవత్సరంలోనే జరగాలని పట్టుదలతో అన్ని పనులూ జరిగాయి,” అని అన్నారు.

నాకు ఆ వాతావరణం నచ్చింది: ‘ఇదెలాంటి పెళ్ళి?’ అని నేను తహతహలాడాను. నేను చూడబోయేది పెద్దలు నిర్ణయించిన సంబంధమా? లేకపోతే ఒక యువతి, ఒక

యువకుడు, ఒకరినొకరు ప్రేమించుకున్న తరువాత , తల్లిదండ్రులు మరేం అభ్యంతరం చెప్పలేకుండా, తటాలున, జరుగుతోందా?

నాకున్న చాలా కోరికలలో ఒకటి love marriage తప్పక చూడాలని. పెద్దలు నిర్ణయించి యువతరం సమ్మతించే పెళ్ళిలో వధూవరులు సంతుష్టితో కనిపించవచ్చు - కాని వాళ్ల చూపుల్లో చెలిమి కనిపించదు; యువతరం నిర్ణయించిన పెళ్ళిని నేను - కన్నుల విందుగా - తనివి తీర చూసి ఆనందించాలి! ఇది ఎటువంటి పెళ్ళి?

పెళ్ళిపీఠంలో వధూవరులు కూర్చున్నంతవరకూ కాచుకొని- వాళ్ళ కంటిచూపులు చూసి - నేను ఊహించవచ్చు; కాని నాకు అంతవరకూ ఓపిక లేదు!

తంగం ముత్తైదువుతో పిచ్చాపాటిగా మాటాడి ఏమైనా తెలుసుకుందాం అని నేను ఆలోచించాను.

స్త్రీలలో ఒక ప్రత్యేక గుణముందని మగవారు చెప్పడం నిజమే అని నేను ఒప్పుకుంటాను. ఇంతకుముందు పరిచయంలేనివారితో త్వరగా అలవరించుకోడం స్త్రీలకి తెలుసు; బాగా పరిచయమున్నవారైతే ఏమీ మాటాడకుండా జారుకోవడమూ స్త్రీలకే తెలుసు.

పైపైగా ఏవేవో కబుర్లు అడుగుతున్నట్టు నేను తంగంతో మాడాడలేదు. "మేం ఉత్తరదేశంలో ఉంటున్నాం, తమిళుల పెళ్లి చూసే అవకాశం మాకు లేదే?" అని పరస్పర అవగాహనతో, ప్రశ్నతో ఆరంభించాను; ఇక మా సంబాషణ సాగడానికి మరేం అడ్డులేదని చెప్పాలా?

"ఈ రోజుల్లోకూడా జాతకాల పొందిక, శకునం, సదుపాయం, పెద్దల అనుమతి - ఇవన్నీ కలిసివస్తేనే పెళ్ళి జరుగుతుంది!" అని నేను అనడానికి త్వరలోనే అవకాశం వచ్చేసింది.

"ఏమండీ, కథల్లో పెళ్ళిళ్ళు చాలా సులభంగా నెరవేరుతాయి లేక భంగమవుతాయి! కాని జీవితంలో మనం నిజంగా చూసేదంతా ఎన్ని ఇక్కట్లు, ఎన్ని ఆలోచనలు, ఎన్ని ఆటంకాలు! అసలు love marriage అని మనం ఏదైనా చూసివున్నామా, చెప్పండి!" అని మాట వరుసకి అన్నాను.

నా బంగారు కంఠ హారం చూస్తూ మురిసిపోతున్న తంగం గభీమని రోషంతో నాకు జవాబు చెప్పారు.

"ఏం, ఎందుకు లేదు? నేనూ అన్నీ చూసానమ్మా! ఇక Love Marriage గురించి చెప్పాలంటే . . . ఇదిగో విను . . . అసలు మా ఊరులో ఏం జరిగిందంటే . . . "

'ఇవాళ జరిగేది Love Marriage కాదు!' అని తెలియడానికి నాకు మరేం జాడ కావాలి? నాకు కొంచెం నిరాశే అనిపించినా 'సరేలే, Love Marriage చూడలేకపోయినా Love Marriage గురించి ఏదైనా కథ విందాం!' అనే అభిలాషతో "సరే, చెప్పండి, విందాం!" అని అన్నాను.

పక్కన ఉన్నవాళ్ళందరూ కథ వినడానికి సిద్ధమైయ్యారు; పెళ్ళికూతురుకూడా తన పెద్ద నల్ల కళ్ళని మా పక్క మళ్ళించింది.

తంగం ఆరంభించారు:

"మేం మా ఆయన ఆఫీసుకి దగ్గరగా పెద్ద కాలనీలో ఉంటున్నాం. మా ఇల్లు బ్రహ్మాండంగా ఒక భవనంలాగ ఉంటుంది. మా ఇంట్లో ఉన్న flower vase లో రోజూ మేం కొత్త కొత్త గులాబీ పువ్వులు వాడుతాం. మా తోటలో ఉన్న అన్ని పూలచెట్లూ నిర్వహించడానికి నేనే ఒక మాలిని నియమించాను . . . "

గులాబీల పరిమళతైలంలాగ - ఆవిడ వర్ణన - అందరి మనసులోనూ - క్రమ్ముకుంది.

"అది టెలిగ్రాఫ్ ఆఫీసుకదా? చాలామంది యువతులు అక్కడ పని చేసేవారు. ఆ గుంపులో ఒక అమ్మాయికి ఒక clerk మీద love వచ్చేసింది; అప్పుడే ఆరంభమైంది ఆ love affair!" అని అంటూ తంగం నవ్వారు.

"ఆఫీసులో జాగా చాలకపోవడంవలన మూడు నెలలకి మా ఇంట్లో రెండు పెద్ద గదులు వాడుతారని మాకు ఆజ్ఞ వచ్చింది; సరే అన్నాం. ఆ రెండు గదుల్లో ఒక పెద్ద Exchange ఏర్పాటు చేసారు. అక్కడే ఆ అమ్మాయి పని చేసేది. ఎంత సేపు పని చేస్తూందో నాకు తెలీదు. కాని నిత్యమూ ఫోనులో ఆమె ఆ clerk తో మాటాడడం నాకు తెలుసు. నవ్వుతూ, హాస్యమాడుతూ వాళ్లు కబుర్లు పంచుకున్నప్పుడు నా చెవులు

వినకుండా ఉత్తికే ఉంటాయా? 'మనకెందుకు, ఎమీ వినకూడదు!' అని అనుకుంటాను, కాని వినకుండా ఉండలేను, ఆ చెత్త, పెర్రికూత అంతా వింటాను!"

అవును మరి. ప్రేమంటే అందరికీ ఆతురతకదా? తంగం తహతహలాడిందంటే అది సహజమేకదా?

"ఏమండీ, ఆ అమ్మాయి Clerk తోనే కదా మాటాడుతుంది? వాళ్ళిద్దరిమధ్యా స్నేహముందని మీకెలా తెలిసింది?" అని నేను అడిగాను.

"ఆ clerk తరచుగా exchange కి వస్తూంటాడు. ఫోనులో వాడు అమ్మాయి పేరు పిలవడం నేను వింటున్నానుగా? నేను ద్వారందగ్గర నిలబడి వాళ్ళని చూస్తాను. వీళ్ళ ప్రేమ సల్లాపంగురించి మా ఆయనకి చెప్పాను. 'ఓ, అలాగా? కానీలే . . . ' అని మాత్రం అతను అనేవారు; కాని నేనిక భరించలేక పోయాను. ఒకరోజు వాళ్ళిద్దరూ ఒకరినొకరు చేతబట్టుకొని మేజాచుట్టూ తిరగడం చూసాను. అబ్బా, ఏం గొడవ, ఏం గడబిడ! 'వీళ్ళు సినిమాలు చూసి ఇవన్నీ నేర్చుకున్నారో, లేకపోతే వీళ్ళ లీలలు చూసే సినిమాలో మనకి ఇవన్నీ చూపిస్తున్నారో?' అని నాకు అనుమానం కలిగింది. ఆ రోజు ఆ ప్రేమికుల ముచ్చట చూసి నాకలాగనిపించింది: ఇక ఏ సినిమా చూడనక్కరలేదు! ఈ వ్యవహారం విపరీతంగా మారుతుంది, వెంటనే ఈ రహస్యం బట్టబయిలు చెయ్యాలని నిశ్చయించాను; మావారికి చెప్పేసాను."

కథ సరసమైన ఘట్టంలో సాగుతోంది. అప్పుడే ఒక అమ్మాయి పరుగెత్తుకొని వచ్చింది. "పిండివంటలన్నీ సరిగ్గా ఉన్నాయా అని అత్త మిమ్మల్ని చూడమంది!" అనే సందేశం తంగంకి అందించి మాయమైంది. దూరంలో నాదస్వరం సంగీతం వినిపించింది. నేను పెళ్ళికూతుర్ని చూసాను. ఆమె తత్తరపడుతున్నట్టు కనిపించింది; చీర కొన సర్దుకుంది.

"ఏమండీ, మీరు వెళ్ళాలా? కథ ఇంకా తీరకుండా ఉందే?" అన్నాను నేను.

"అవన్నీ సరిగ్గానే ఉన్నాయమ్మా . . . కథకేం, ఒక నిమిషం!" అని అంటూ తంగం చేరువలో కనిపించిన ఒక అబ్బాయిని పిలిచి వాడికేదో పని అప్పగించి, నాపక్క మళ్ళీ తిరిగారు.

‘ఇంకా ఒక నిమిషమే కావాలా? సరే, కథలో ఇదే ఆఖరి ఘట్టం కాబోలు!’ అని నాకనిపించింది.

“అయిందా? . . . మా ఆయనకి చెప్పానుకదా? అతనూ చురుగ్గా పనిచేసారు. ఆ అమ్మాయి తండ్రికి, ఇతనిలాగే, అదే ఆపీసులో ఉద్యోగం. మరి స్నేహితుడంటే ఈ అత్యవసర పరిస్థితిని వివరించి చెయ్యవలసిందేదేమో చెయ్యడం మన బాధ్యతకదా?”

“అవును, నిజం!” అని నేను తలూపాను; దూరంలో నాదస్వరగానం వినిపిస్తూనేవుంది.

“ఆఖరికి మా ఆయన చెప్పేసారు; నేనూ ఆ ఇంట్లోవున్న స్త్రీలని కలుసుకున్నాను. అంతే, మరేం కావాలి? ఆ మరుసటివారం ఆ అమ్మాయి పెళ్ళి నిశ్చయమైంది. నేను చెప్పినది మంచిదైందని వాళ్ళందరూ సంతోషించారు . . . ”

“అలాగా? అంత త్వరగా పెళ్ళి జరిగిందన్నమాట!” అని నేను విస్తుపోయాను.

“అవును, ఒకే ఒక వారం తరువాత! ఆ అమ్మాయిని ఆపదనుంచి కాపాడానని నాకు చాలా తృప్తి. విను, ఈ ప్రపంచంలో ఎది జరిగినా అది మనం చేసే ప్రయత్నంబట్టి ఉంటుంది . . . ఒక పెళ్ళి సంబంధం సాధ్యమయ్యేట్లు చేస్తే మనకెంత పుణ్యమో తెలుసా? ఇన్ని సంవత్సరాలుగా నా చెల్లెలికి వరుడు దొరకనేలేదు . . . ఇప్పుడు చూడు, ఆ పెళ్లి ఆరు మాసాలే ఐంది. ఇప్పుడు ఇది జరుగుతోంది!” . . . అని తంగం ఆహ్లాదపడుతూ మాటాడారు.

నేను పెళ్ళికూతురు ముఖం చూసాను. ఆ కళ్ళలో నాకు ఆమె మానసికక్షోభ అర్థమైంది. ఆఖరికి తను కాచుకొనివున్న భర్తే దొరికాడనే యాతన ఆ చూపులో కనిపిస్తోంది కాబోలు!

ఇంతలో తంగం కోడలు పరుగెత్తుకొని వచ్చింది. “‘ఆరతికి అన్నీ రెడీగా ఉన్నాయా?’ అని అత్త అడుగుతోంది!’ అని అడిగింది.

“పాపం, మీకు బోలెడు పనులున్నాయ్; అవన్నీ వదులుకొని పెళ్ళి సందడిలో నాకు కథ చెప్పమని అడిగాను!” అని నేను నొచ్చుకున్నాను.

"అన్నిపనులూ అమరికగానే ఉన్నాయి. అమ్మకి ఎప్పుడూ గాబరాపే! నేను నీకు కథ పూర్తిగా చెప్పాలి . . . అసలు ముఖ్యంగా ఎందుకు చెప్పానో తెలుసా . . . ?" అని నిదానంగా ప్రశ్నించి తంగం ఆగారు.

"కథ ఇంకా ఉందన్నమాట!"

పెళ్ళికూతురుకూడా తన చూపుని పదునుబెట్టుకొని మమ్మల్ని చూసింది.

"అవును, విను. ఆ అమ్మాయి ఇప్పుడు సినిమాలో నటిస్తుందని విన్నాను - భర్తని వదిలేసిందట! ఇలాగ జారుకునే ఆడపిల్లలకే ప్రేమా, గీమా అనే పిచ్చి పట్టుకుంటుందని మనకనిపిస్తుంది. ఏమంటావ్?"

పరిచయంలేని ఆ యువతిమీద నాకు పట్టరాని కోపం వచ్చింది. ఎందుకా అమ్మాయి తన బతుకు నాశనం చేసుకోవాలి? ఇలాంటి యువతులవలనేకదా ఆదర్శ ప్రేమకున్న గౌరవంకి హాని కలుగుతోంది?

"అవును, కొందరు యువతులు అలాగుండవచ్చు - అది ప్రేమ కాదు!" అని నేను అన్నాను.

"అదేంటో నాకు తెలీదు. ఆ అమ్మాయికి ఎంత ధైర్యం! సినిమాలో ఛాన్సు కావాలని ఎంత సాహసం!" అని తంగం అసహ్యించుకున్నారు.

"అమ్మాయి మంచి అందగత్తె కాబోలు, ఎవరికి తెలుసు? పేరు తెలుసా?ఎప్పుడైనా సినిమాలో మనం చూస్తామేమో?"

"దాని పేరు శశికళ . . . ఇప్పుడు ఏం పేరో ఎవరికి తెలుసు? భర్త ఒక ఆఫీసరు, జీతం ఆరువందల రూపాయలు. మరి దానికి ఎందుకు ఇలా మతిపోయిందని నాకు అర్థం కావటం లేదు!"

నేను ఉలిక్కిపడ్డాను. ఆమె భర్త - ఆమె ప్రేమించిన యువకుడు - ఆఫీసరా? అతనొక clerk అని విన్నానుగా?

"లేదే? అతనొక మంత్రికి అసిస్టంట్ గా పని చేస్తున్నాడు . . . "

"అతని పినతండ్రి శిఫారసు వలన అతనికి ఆ ఉద్యోగం దొరికిందేమో? . . . "

"లేదే? మొదటినుంచే అతనికదే ఉద్యోగం. పెళ్ళి చాలా వైభవంగా జరిగింది. పెళ్ళికొడుకు విమానంలో వచ్చి దిగాడు."

నా అనుమానం బలపడుతూ వచ్చి, ఆఖరికి నా మెడని గట్టిగా పట్టుకుంది. ఆ యువతిని -శశికళని - ఎవరికిచ్చి పెళ్ళిచేసారు? ఆమె ప్రేమికుడికి కాదా?

“లేదే? వాడ్ని వెంటనే బదిలీ చేసేసి, ఈ అమ్మాయిని ఉద్యోగంనుంచి తొలగించి, ఆ అమ్మాయికి వరుడు నిశ్చయించి ఆమె పినతండ్రి పెళ్ళి చేసేసారు. ఆ పిల్ల మహారాష్ట్రంకి చెందిన యువతి. ఆ clerk బెంగాలీ యువకుడు. ఇద్దరికీ పొత్తు ఎలాగ?”

మొగలాకులమధ్య నాగుపాముని చూసి వెనుకంజ వేసినట్టు నా హృదయం తపించిపోయింది:

‘ఓ మూర్ఖురాలా, శశికళ బతుకుని ఎందుకిలా మీరు పాడుచేసారు? మీలాంటి స్త్రీలుంటే ఆదర్శప్రేమ ఎలా వర్ధిల్లుతుంది? మీరు దానికి చేసినది సహాయం కాదు, ద్రోహం! తంగం, మీకు రాతిమనసు! పాపం, శశికళ! మీ వలనే ఆమెకి ఏ హక్కూ, ఎవరి యాజమాన్యమూ లేనట్టు కనిపిస్తోంది. దానికి మంచి హృదయం ఉంది; మీరొక పెద్ద పాపం చేసారు!’

తంగం ముఖాన్ని నా చేతులతో తటాలున గుంజుకొని గట్టిగా గర్జించాలని నాకు ఆవేశం కలిగింది. పెళ్ళికూతురు తన అక్కయ్యని చూసిన చూపులోనూ ఆ కటువే నేను గుర్తుచేసుకున్నాను; ఆమె కనుబొమ్మలు ముడుచుకున్నాయి; కళ్ళలో ఒక ప్రశ్న లేచింది.

“ఆ రోజుల్లో Exchange చేరువలో ఉండడం వలన నేనన్నీ చూడగలిగాను; అక్కడ ఇంకా ఎన్ని దుర్నీతులు జరుగుతున్నాయో ఎవరికి తెలుసు? ఇప్పుడు ఎవరైనా నన్ను సాయంకి పిలిచినా నేను చేసేదేముంది? నా దేహంకి బలం లేదు!” అని అంటూ, చిరునవ్వు నవ్వుతూ తంగం - ఆ నిండు చూలాలు - శ్రమతో లేచి నిష్క్రమించారు.

నాదస్వరగానం, మేళం నాకు చాలా సమీపంలో వినిపించాయి; ప్రేమగాధకూడా సమాప్తి ఐపోయింది. మేం లేచి బయటికి వెళ్ళడానికి సిద్ధమైయ్యాం. పెళ్ళికూతురు మాత్రం ఆ చిన్నగదిలోనే ఉంది. రెండు చేతులూ మెడకి దగ్గరగా మడతపెట్టుకొని కూర్చొనివుంది. దేవున్ని ఏంకావాలని ప్రార్ధిస్తుందో? తనిక కొత్త జీవితంలో అడుగుపెట్టే సమయం వచ్చేసిందికదా?

బయట - పచ్చని తోరణాలతో అలంకరించబడిన పందిరికింద - పెళ్ళికొడుకు కాశీయాత్ర ఉడుపులో దర్శనమిచ్చారు.

"పెళ్ళికూతురుని రమ్మనండి!" అని ఆజ్ఞ రాగానే పెళ్ళికూతురు, వొంచిన తలెత్తకుండా నడిచివచ్చింది. పూలదండలు పరివర్తన చేసుకునే చోటకి రాగానే, తలెత్తి పక్కనున్నవారిని సంకోచం లేకుండా చూసింది.

"పూలదండలు మార్చుకోండి!" అని ఒక పెద్దాయన ఆజ్ఞ ఇచ్చారు.

పెళ్ళికొడుకు ఒక సుగంధమైన మల్లెపువ్వుల దండని అందుకొని వధువుని సమీపించాడు.

"అయ్యయ్యో!"

ఎవరది? . . . ఈ శుభవేళలో?

"ఎవరమ్మా? నువ్వా?"

"అయ్యయ్యో! . . . అవును! . . . అదిగో పాము! . . . "

"ఎక్కడ? ఎక్కడ? ఎక్కడ? ఎక్కడ?"

"అదుగో . . . అక్కడ . . . "

"ఎక్కడమ్మా?"

"అదుగో . . . అతని చేతుల్లో . . . "

పెళ్ళికొడుక్కి ఒకటే దిగులు. అతని చెయినుంచి పూల దండ జారిపోయింది.

"అదుగో, చూడండి, పాము ఎలా పాకుతుందో! . . . అయ్యయ్యో . . . " అని రెండు కళ్ళూ మూసుకొని పెళ్ళికూతురు ఉయ్యాలలో కూర్చుండిపోయింది.

"అది పూలదండమ్మా!"

"కళ్ళు తెరిచి చూడు . . . బాగా చూడు . . . "

"ఇప్పుడు పూలదండలాగ కనిపిస్తోంది . . ."

"ఉత్తికే భయపడవద్దు! నీకేం మతి పోయిందా? లేచి రా!"

"సార్, పూలదండ తీసుకోండి. మళ్ళీ వెయ్యండి!"

పెళ్ళికొడుకు మళ్ళీ దండని అందుకున్నారు.

"అయ్యయ్యో, అది పామే . . . నాకు వద్దు! . . . "

దండ మళ్ళీ నేలమీద వాలింది; ఎవరికీ ఏంచెయాలో అర్థం కాలేదు.

పెళ్ళికొడుకు కారుతున్న చెమటని తుడుచుకుంటూ "సార్, వద్దు! నాకిష్టం లేదు. ఇలాంటి అపశకునం మంచిదికాదు. నేను వెళ్తాను," అని అన్నాడు.

అతని మాటలకి ఎవరూ ఆక్షేపణ తెలియజేయలేదు.

"అమ్మాయికి ఏమైందో, ఎవరి కుదృష్టి పడిందో?" అని చాలామంది మాటాడుకున్నారు.

తంగం నాకు వివరించిన కథ పెళ్ళికూతుర్ని తాకిందేమో? ఆ కథ ఆమెకూడా విందికదా?

తంగం శశికళకి చేసిన ద్రోహం ఇప్పుడు పాములాగ వచ్చి కసితీర్చుకుందా? మనం ఎది చేసినా దానికి ప్రతికారం ఉంటుందని తంగం అనలేదూ?

రకరకాల ఆలోచనలతో నేను పెళ్ళికాని ఆ ఇల్లు వదిలి మా ఇంటికి నడిచాను.

'ఇక ఈ పెళ్ళికూతురు ప్రేమించి వేరే పెళ్ళి చేసుకుంటుందా?' అని నేను ఆలోచించాను. అది తెలియక నా చెల్లెలు "పోనీలే అక్కయ్యా! హేమాకి అసలు ఈ పెళ్ళిగురించి ఏ విచారమూ ఉండదు.  ఈ పెళ్ళి తనకి ఇష్టం లేదన్నట్టు హేమా మాటాడిందని వినికిడి!" అని  చెప్పుతూ నాతో నడిచింది.

పెళ్ళివారింట్లో పూలదండలూ, పూలగుత్తులూ వాడి, చెడిపోయి, పనికి రాకుండా నశించిపోయాయి. నా మనసులో మొలకెత్తిన చిన్న చిన్న చిగురులు క్రమంగా ఒక పూలదండగా అల్లుకున్నాయి. ఈ దండలకి అర్హులు ఎవరు? నేనా లేక ఈ రోజు స్వల్పకాలమే పెళ్ళికూతురుగా వెలసిన ఆ గడుసైన హేమావా?

********

**(మూల ప్రచురణ స్వదేశమిత్రన్, ఆగస్టు 26, 1951)**



# விழியின் வெம்மை

‘விந்தியா’

# కారుణ్యం తొణికే నయనాలు

## ముందు మాట

(రచయిత్రి జీవితంలో పరిచితమైన వ్యక్తులమీద ఆధారపడినది ఈ కథ. ఇందులో కేశవన్ అనే పాత్ర మారెళ్ళ కేశవగారు (1924 - 1992) పేరునుంచి స్వీకరింపబడినది. రచయిత్రి స్వగ్రామం ఒడిషాలోని బరంపురంకి చెందిన వ్యక్తి ఆయన).

ఆయన అంధుడు. వెలుగు అందాలు గ్రహించలేడు. ఐనా దాన్ని తను కనుగొలగనని అంటాడు . . .

*****

నేను పెరిగిన ఇంటిలో దీపావళి మేమంతా వేడుగ్గా పాల్గొనే పెద్ద పండుగ. ఇప్పుడు తమిళనాడు అనే దక్షనాదినుండి వలసవెళ్ళిన మా తల్లితండ్రులు 1920 దశకంలో స్థిరనివాశం ఏర్పరుచుకున్న తూర్పు కోస్తా తీరంలో అదొక చిన్న పట్నం. అక్కడ దీపావళి చాలా ఆర్భాటంగా, శాస్వతంగా వెలిగే దీపాల తోరణాలతో, మందుగుండు సామానులు కాల్చడం మొదలైన వేడుకలతో జరుపుకొనేవాళ్లం. జనాలు వాళ్ళ ఇంటి వాసారాల్లో, ఇంటి కప్పులమీద, తోటల్లోను, నూనె ప్రమిదలతో దీపాలని అలంకరించుకొనేవారు. రంగురంగుల ఎలెక్ట్రిక్ బల్బుల తోరణాలతో బాటు మందుగుండ సామానులు కాల్చడం వగైరా జరుగుతుండేవి.

ఈ పండుగలలో అచ్చుతరామయ్యగారి ఇంట్లో తయారయే కుంపీలగురించి మా చుట్టుపట్ల ఉండేవారు, పెద్దలు కాబట్టి, చెప్పుకునేవారు. మా ఇంటికి సుమారు ఐదారిళ్ళ అవతల ఉంటుండేవారు అచ్యుతం కుటుంబం. ప్రతీ సంవత్సరం దీపావళినాడు ఆ ఇల్లు నన్ను ఆకర్షించేది. అయినా ఆ ఇంట్లో ఉంటూ ఉన్న కేశవన్ నన్ను మంత్రముగ్ధుడుగా చేసేవాడు.

కేశవన్ కళ్ళలో కాంతిగాని, దృష్టిగాని లేదు. ఐనాకూడా అతని చేయి వేళ్ళు దైవదత్తమైన సంగీత జ్ఞానం కలిగి ఉంటాయి. ఆయన తల నెరసిపోయిందేగాని ఆ వేళ్ళలో ఒక చిన్నవయసురాలైనదాని వేళ్ళ మృదుత్వం కానవస్తుంది. అతని

మహోన్నతమైన సంగీత ప్రజ్ఞ ఆయనిలోని ఒక లోపాన్ని అధిగమించి, మూర్తీభవించింది.

కేశవన్ సంగీతం నేర్చుకుంటున్నాడని మా వాళ్ళు అనుకుంటున్న సమయానికి నేనింకా చిన్నవాణ్ణే. తంతులో నిభిడకృతమైన మాధుర్యంగాని, ప్రతి ధ్వనిని ఆశ్వాదించే వయస్సు కాదు నాకు. అప్పుడే ఇంకా నేను సరిగమలు నేచుకోవడం ఆరంభించాను.

మా అమ్మ తరచుగా చెప్తూండేవారు కేశవన్ సంగీత సాధన గురించి; నాకు ఆశ్చర్యం అనిపించేది, కేసవన్ ఎలాగ వైలిన్ పట్టుకోగల్గుతాడని.

ఆ సంగీత సాధన సమయంలో అసలు ఏంజరుగుతుందో నువ్వు నిజంగా నమ్మగలవా?" అని అడిగింది అమ్మ. "ఆయన గురువుగారుకూడా అంధుడే. గురువుగారు తాళం, లయలోని మెళుకువలు చెప్పాలనుకున్నప్పుడు, కేశవన్‌కి వినబడేలాగ తన తొడమీద గట్టిగా దరపు చేసుకునేవారు. గురువుగారు ఏమైనా రాగం వాయిస్తే కేశవన్ అది గ్రహించి వైలిన్ మీద కమాను తీసిపలికించేవాడు. కేశవన్ నాన్నగారు ఆయన వెనుక కూర్చొని అందులో ఉన్న సాధకబాదకాలన్నీ ఉమర్తి చెప్తుండేవారు: ఎలా వైలిన్ పట్టుకోవాలో, కమాన్ ఎలా పట్టుకొని తంతులమీద ఆనాలో. రాగం ఎలా ఆలాపన చెయ్యాలో ఇత్యాదులు. సరైన ఏ స్తితిలో ఎలా కూర్చోవాలో, ఎలా వేళ్ళు నడపాలో. రాగం ఎలా వాయించాలో మొదలైన వివరాలు, నడత కేశవన్ వెంట ఉండి నేర్పించేవారు. ఈ విధానమంతా ఎంత తికమక వ్యవహారమో నువ్వు ఊహించగలవా? ఈ ఊళ్ళో అంధుడుకాని ఒక గురువు లభించకపోవడమేమిటి? ఏం దురదృష్టం?" అమ్మకు ఆశ్చర్యంతోబాటు జాలికూడాను. కేశవన్ వాళ్ళ ఇంట్లో సాధకం చేసుకుంటూండే నాకు కూడా కుతూహలం కలిగి గెంతులేసుకుంటూ వెళ్ళి గమనిస్తూ ఉండేవాణ్ణి.

కేశవన్ తల్లితండ్రులు వాళ్ళ అబ్బాయికి భగవత్ కృపవల్లనే ప్రావీణ్యమైన సంగీత జ్ఞానం అబ్బిందని నమ్మేవారు. భగవంతునిమీదే భారం వేసి వారి అబ్బాయికి ఒక సంగీత స్కూల్లో ప్రవేశపెట్టారు. అక్కడ ఐదు సంవత్సరాలు యువ సంగీతకారుడుగా తర్ఫీదు అనంతరం కేశవన్ ఒక మేధావిగా తిరిగివచ్చాడు. ఆయనలోని పాండిత్యానికి, విధ్యాభ్యాసానికి అందరూ ఎంతో సంతోషించారు.

కేసవన్‌కి ఇద్దరు తమ్ముళ్ళున్నారు. వారిలో పెద్దవాడు నాకన్న వయసులో పెద్దవాడే; ఆయన నా కాలేజిలో చదువుతున్నాడు. చిన్నవాడు నాకంటే చాలా చిన్నవాడు. ఆ ఇద్దరిలో నాకు ఎవరితోను చనువు లేదు. నేనింకా హైస్కూల్లో ఉన్నాను; నా చదువుతోనే నాకు సరిపోయేది - ఫైనల్ పరీక్షలు రాయవలసి ఉన్నాయి. అధ్భుతవ్యక్తి కేసవన్ నిత్యం చేసుకునే ఫైలన్ సాధకాన్ని చూడడానికి ఊళ్ళోని సంగీత ప్రియులు చాలా పెద్ద సంఖ్యలలో కేశవన్ ఇంటిని చుట్టుముట్టేవారు. క్రమం తప్పకుండా కేశవన్ నిత్యం రెండుసార్లు ఫైలిన్ సాధన చేసేవాడు. అందరితోబాటు నేను కూడా ఆ సమయంలో మెల్లిగా ప్రవేశం సంపాదించి ఆశక్తితో గమనిస్తూండేవాడిని.

** ** **

ఒక దీపావళి సంధర్భంలో నేను ఒక హృదయవిచారమైన దృశ్యం చూసాను. కేశవన్ దురవస్తని చూసి జాలిగా రెండు కన్నీటి బొట్లు రాలాయి మొదటిసారిగా.

అచ్యుతం కుటుంబంలో బాణసంచాక్రమంలో అధ్భుతమైన కుంపీలు ప్రవేశపెడ్తారాని చెప్పేనుగా? బాణాసంచాలు నేలనుంచి వెలుగులు వెరజిమ్ముకుంటూ లేచి బ్రహ్మాండమైన జిలుగులు పెదజల్లుకుంటూ, పేలి పోకుండా, వెలుగుతుందన్నమాట. సాధారణంగా రాత్రి పదిగంటలతరువాత, ఇంకా వీధిలో మతాబా కాల్పులు కొనసాగుతుండగా, కుంపీలు వెలిగిస్తారు. ఎప్పటిలాగే బాణాసంచాలు కాల్పడం చూద్దామని నేను అచ్యుతంగారింటికి వెళ్ళాను. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆ వేడుకలో నిమగ్నమై ఆనందిస్తున్నారు. అమ్మ ఎప్పుడూ చెప్తుండేవారు: తమిళనాడు తంజావూరు ప్రాంతాన సర్వసాధారణంగా పెళ్ళిల్లోనే బాణాసంచా వింతలు చూడగలం అని. కాని ఈ ఊళ్ళో దీపావళినాడే ఇటువంటి వేడుకలు సర్వసాధారణం. ఆంధ్ర సంస్కృతి లక్షణంగా ప్రతీ వీధిలోనూ, ప్రతీ ఇంటా ఈ దృశ్యం పరిపాటే. కుంపీలు తప్పనిసరిగా ఇంట్లోనే తయారుచెస్తారు. అందులొ కలపవలసిన మందుగుండ బజారునుండి కొని తెచ్చుకొని కొన్ని పాళ్ళ ప్రకారం కలుపుతారు. దాని తరువాత చిన్న మట్టి కుండల్లో, ఇంట్లో ఉన్న బాలురు బాలికలచేత దిట్టింపిస్తారు. కుంపీ బాగా వెలగడం ఆ దట్టింపుమీదే ఆధారపడి

ఉంటుంది. ప్రతీ ఇంట్లోను ఆ కుంపీమీద అది ఎవరు దట్టించారో వారి పేరుతో కాయితం అంటించి ఉంటుంది.

చేతులో పట్టుకొని వెలిగించే కాకరవత్తిలో ఉన్నట్లుగా రెండు రకాలు ఉన్నట్లే కుంపీలో కూడా రెండు రకాలున్నాయి, కోలగా ఉన్న ఒక మట్టి పిడతచివర్న వెలిగిస్తేచాలు, ఓయి నాయానా, ఒక్కసారి జుమ్మని, పొడపైన వెలుగు ఎగజిమ్ముతుంది. ముత్యాలు, పువ్వులు, ఇంకా రకరకాల అలంకారాలతో అంత ఎత్తువరకు లేస్తుంది. వాడిన మందుపాళ్ళబట్టి తెల్లగానో లేక గోధుమరంగులోనో ఉంటుంది. అలంకారాలుకూడిన

మేమందరం నోరువెళ్ళబట్టుకొని ఆ వెలుగుల్ని చూసి కేరింతలాడుతుండగా, కేశవన్ చిన్న తమ్ముడు, "బలే, బలే, చూడండి, చూడండి, అది ఎంత ఎత్తుకు లేచిందో చూడండి," అని చప్పట్లు కొడుతూ కేరింతలుకొట్టేడు. " నువ్వు దట్టించేవా ఈ కుంపీ?" అని అచ్యుతం ఆ అబ్బాయిని అడిగారు. "ఏమో, నాకు తెలియదు," ఆని అబ్బాయి బదులు చెప్పేడు. "దాని మీది కాయితంలోని పేరు చూడ్డం మరిచిపోయాను."

"ఈ సారి వెలిగించడానికి ముందుగానే పేరు తెలుసుకో!" అని వెనకనుంచి ఎవరో అన్నారు. అలా అన్నది కేశవన్నే!

నాకు చాలా దుఖం వచ్చింది. ఈ మతాబులు కాల్చడం కేశవన్ చూడలేడు; ఈ వేడుకలన్నీ చూడలేకపోతున్నంతుకు కేశవన్ ఏమాత్రం విచారిస్తున్నట్టుగా లేదు.

కేశవన్ అమ్మగారి ప్రక్కనే వరుసలో కూర్చున్న మా అమ్మగారు కేశవన్ తల్లిని ప్రశ్నించారు: "కొన్నాళ్ళు క్రితం మీరు చెప్పేరుకదూ, కేశవన్ చిన్న వయసులో ఉన్నప్పుడే సూర్యరశ్మిలోగాని, తీక్షణమైన వెలుగులోగాని వస్తువుల్ని పోల్చుకోగలివాడని; అతను ఇప్పుడుకూడా అలా చూడగల్గుతున్నాడా?".

"వాడు మొదట్లో అలా చెప్తున్నప్పుడు మేం ఆశపడినది వాస్తవమే. మేం ఒక కంటి వధ్య నిపుణున్ని సంప్రదించడం, కేశవన్ కి కంటి ఆపరేషన్ చేయించడంకూడా జరిగింది. కాని ఫలితం లేక పోయింది. భగవంతుడు మా ప్రార్ధనలకు స్పందించలేదు."

ఈ సంభాషణంతా శ్రద్దగా వింటున్న కేశవన్ కల్పించుకొని "ఇప్పుడుకూడా నేనలాగే చూడగల్గుతున్నాను," అన్నాడు.

"అలాగా?" అని అడిగారు మా అమ్మగారు. కేశవన్ అమ్మగారు మౌనం వహించారు.

"అతని చేతికి ఒక విష్ణు చక్రం ఇచ్చి వెలిగింపించవచ్చుకదా?" అని మా అమ్మగారు సూచించారు.

నేను వెంటనే కేశవన్ తమ్ముడు దగ్గరకి పరుగెత్తుకొనివెళ్ళి ఈ విషయం చెప్పేను. వెంటనే వరండాలో కేశవన్ చేతిలో విష్ణు చక్రం వెలిగించడానికి సిద్దంగా నిలబడడం గమనించాం.

విష్ణు చక్రం వత్తి వెలిగించి అది చేతిలో తిరగడం ప్రారంభించేసరికి తమ్ముడు కేశవన్ని హెచ్చరించాడు: "అన్నయ్యా, చక్రాన్ని గట్టిగా పట్టుకో. నువ్వుకూడా నిజారుగా నిలబడితే చక్రం ఆటంకం లేకుండా గిరగిర తిరుగుతుంది," కేశవన్ ఆ సూచనలన్నీ పాటించాడు. చక్రం కాంతి కిరణాలు వెదజల్లుతూ కొంత సేపటికి రాలిపోయింది.

"దాన్ని నేలమీద పడేయి నాయనా," అని కేశవన్ నాన్నగారు సూచించారు. పిడికిలి వదిలించగా అది నేలన రాలిపోయింది.

"నీకేమైనా వెలుగు కానవచ్చిందా నాయనా?" అని వాళ్ళ అమ్మగారు ప్రశ్నించి జవాబుకోసం అత్రంగా నిలబడ్డారు.

"నేను చూసేను."

"నిజంగానే చూసినట్లుందా?" అని ఒకింత ఆశ్చర్యాన్ని కనబరుస్తూ ఆవిడ అడిగారు.

"నిజంగానే నీకలా అనిపిస్తుందా?" అని వాళ్ళ నాన్నగారుకూడా ఆమెతోబాటు కలిసేరు: "నీకేదైనా వెలుగు కనిపించిందా?"

"ఔను, నేను ఒక వెలుగు చూసాను."

"అదెలాగుంది? నీకు నిజంగా ఎలా అనిపించింది?"

"అది చాలా వేడిగా ఉంది."

"వేడిగానా?" అని అంటూ తండ్రి నిస్పృహతోకూడిన ఒక నిట్టూర్పు విడిచారు. అమాయకత్వం పూర్తిగా వెల్లడైనట్లుగా భర్త వెనక నిలిచిపోయింది ఆ తల్లి.

వేడికీ, వెలుగికీ తారతమ్యత కేశవన్‌కి తెలియకపోలేదు. ఆయనకున్న హద్దులేమిటో అతనికి బాగా తెలుసు: అందరిలాగ తను సినిమాలు చూడలేననీ,

తోటలేని మొక్కలు, పూల అందాలు, ఇక ప్రపంచంలో అందమైన వాటిని చూడలేని అంధుడననీ అతనికి బాగా తెలుసు.

తన ఆత్మీయుల్ని తను చూడలేడేకాని వాళ్ళు తనని, ఇతర ప్రపంచాన్ని చూడగలరు . మరి అలాంటప్పుడు కేశవన్ వేడిగా ఉందని ఎందుకు చెప్పాడు? అసలు యధార్థం ఏమిటంటే ఇతరులు బాణాసంచా కాల్పులో వెలుగుని చూడగల్గుతే తను మాత్రం వాటిలోని వేడిని గ్రహించగలడు. కేశవన్ కళ్ళకి చూపు లేదు. కాని విద్యుచ్ఛక్తిలో నిబిడమై ఉన్నట్లే తనలో అంతర్ హితమైన స్పర్శ శక్తితోనే వ్య వహిస్తున్నట్టు కానవస్తాడు. విద్యుచ్ఛక్తి ధ్వనిగా, కాంతిగా వ్యవహిస్తుందికదా? ఇతరులు సంగీతం, ఉప న్యాసాలు, రేడియోలోవచ్చేనాటకాలు విని ఆనందించినట్లే కేశవన్ వినికిడితోనే నిత్యదిన కార్యక్రమాలు అవగతం చేసుకోగలడు. ఇంటిలో రేడియోని ఎక్కువగా వాడుకునేది ఆతనే. తనకి కావలసినట్టుగా రేడియోని వాడుకోడంలో అతనికి ఏ విధమైన ఇబ్బంది లేదు. వాళ్ళ నాన్నగారి సహాయంతో ఆయన రోజుకు రెండుసార్లు వ్యాహ్యాళికి వెళ్ళాలని నిర్దేసిస్తాడు. నానాగారి సహకారం చాలా ఎక్కువే; బయటకి వెళ్ళేటప్పుడు కేశవన్ భుజంమీద ఆయన చెయి వేసి కేశవన్ని నడిపిస్తూంటారు. కేశవన్ కచేరిలికి వెళ్ళినప్పుడు ఆయన తంబూరా తీసుకొని ఆయనవెంట వెళ్తారు. పై ఊళ్ళలో కచేరిలకి వెళ్ళినప్పుడుకూడా నాన్నగారే అతనికి తోడునీడ. అందువలన కచేరిలకి వచ్చేపారితోషికం ఇద్దరి ఖర్చులుపోగా మిగిలేది కొంచమే; కాని ఖ్యాతో? ఒక ఊరునుంచి ఇంకక ఊరికి అంధుడైన కొడుకు వెంట ఆ తండ్రి వెళ్తూండడం కాస్త ఇబ్బందికరమే, కాని కేశవన్ కి తన సొంత తండ్రికాక వేరెవరుంటారు తొడు?

కేశవన్ సంగీతం ఇంకా బాగా ఎదిగిన సబ్దంతో కొట్టవచ్చినట్లు వినిపించాలని కొంతమంది భావించారు. అతను అంధుడు కాపట్టి మూల ఆహారంతోబాటు అదనంగా పాలు, గుడ్డులు చేర్రాలని సూచించారౌ.

అతని చెయిలో నాజూకతో కూడిన సౌకుమార్యం లోభించలేదు. అందువలన అతని కచేరిలు మైకు లేకుండానే చాలా గాంభీర్యంగా ఉండేవి. ఏవైనా ప్రత్యేకంగా ఏర్పాడుచేసే కచేరిలలో మైక్ అవశ్యత ఉండేది. ఆ విధంగా కేశవని ఖ్యాతి దేశ తీరాలకి వ్యాపించింది; అంటే ఊరు విడిచి పైఊళ్ళకి తరుచుగా వేళ్ళవలసి ఉండేది.

ప్రయాణాల్లో కేశవన్ మద్రాసు హోటళ్ళనే ప్రోత్సాహించాలని నిర్దేసించేవాడు. ముఖ్యంగా మద్రాసు వంటకాలని ఎక్కువగా ఇష్టపడేవాడు. ఇంటి దగ్గర రెండేళ్ళ పిల్లల భోజనంలా ఉండేది అతని తిండి. ఒకసారి ఆయన్ని మా ఇంటికి భోజనానికి ఆహ్వానించాం; ఆ సందర్భం ఎంత హృదయవిచారమైనదో నాకు బాగా గుర్తుండిపోయింది. వంతకాలన్నీ అరిటాకుమీద వడ్డించాం. కాని కేశవన్ వేళ్ళు దయనీయంగా వాటికి పక్కగా తడుముతూండేవి. కోడుకంటే చాలా ప్రేమాభిమానాలుకూడా ఆ తండ్రికి. అప్పుడపుడు కేశవంలోని మంకుతనానికి, ఆ తండ్రికి చికాకు, కోపం కలుగుతుండేవని చెప్పుకోవడం విన్నాం. వాళ్ళ ప్రయాణాళ్ళో ఆయన అలసి, సొలసి ఉన్నప్పుడుకూడా మద్రాసు హోటలే కావాలనే పట్టుదలకి చాలా బాధపడేవారు. ఆయనకి తన ఆహార నియమాలు బాగా తెలుసు. వాటిని తు.చ. తప్పకుండా ఆయన పాటిస్తుండేవారు. ఐనాకూడా తనకి వీలున్నా, లేకపోయినాకూడా కేశవన్ వెంట వెళ్ళడానికి మట్టుకు ఆయన సిద్ధమయేవారు. ఇంటిలో ఇద్దరు కొడుకులున్నారు; కాని వాళ్ళు చదువుకుంటున్నారు. చదువులు విడిచి కేశవన్‌తో ఊళ్ళవెంట ఎలా తిరగగలరు? అందువల్ల తండ్రే కేశవన్‌కి కళ్ళూ, ఊతకర్రగా ఉపయోగపడుతుండేవారు. అన్ని మెళుకువలతో, ఒక పరిపక్వం చెందిన సంగీతకారుడుగా తన కొడుకు ఎదిగే రోజుకోసం ఆయన ఎదురుచూస్తూండేవారు. తంతులమీద నేర్పుగా మ్రోగించే చేతికి బంగారంలో ఒక ఉంగరం చేయించారు; కమాను పట్టుకొనే చెయ్యికి ఒక బంగారు మురుగు, ఇంకా వైలీను ఆనుకునే భుజానికి జరీ అంచు అంగవస్త్రం వేసేరు. ఇక మెడకి ఒక బంగారు గొలుసు చేయించారు. కేశవన్ వీటినేవీ చూడనైనాలేదుకదా, అవి కావాలని కోరనూలేదు. కాని ఆ తండ్రి అవన్నీ చూసి ఆనందించారు.

"తమిళ సంగీతకారులకి వాళ్ళ ఖ్యాతినీ, సంపదనీ, ఎలా పెంపొందించుకోవాలో బాగా తెలుసు," అని ఆయన తరచు మెచ్చుకోలుగా అంటూండేవారు. అందువలన అటువంటి పొగడ్తలూ, సొగసులూ, తన కుమారునికికూడా అతను అన్వయించుకొనేవారు. త్వరలో కేశవన్ బంగారు ఫ్రేంతో ఉన్న నల్ల కళ్ళద్దాలు పెట్టుకునేవాడు. అందువలన కేశవన్ ఇంటిలో ఉన్నప్పుడు మాత్రమే నిలకడలేని తెల్ల నేత్రాలను చూడే అవకాశం కలిగేది.


చిన్నవాడిగా ఉండగా నాకు సంగీతం అంటే మక్కువేతప్ప, అందులో మిళితమైన శాస్త్రం పట్లగాని, పరిపక్వం పట్లగాని, అవగాహన ఉండేదికాదు. యువకుడుగా మృదంగం నేర్చుకోవాలనే అభిలాషతో మా ఊళ్ళో ఉన్న ఒక రేడియోలో Class IV కళాకారుడివద్ద కొన్నాళ్ళు శిష్యరికం చేసాను. మా అక్కయ్య కర్నాటక సంగీతం అభ్యసిస్తూండేది. ఆమె పాడుతుండగా గమనిస్తున్న నాకుకూడా సంగీతంపట్ల అభిమానం పెరిగింది; మా అక్కయ్య సంగీతం గురువుగారుకూడా ఆ విషయాన్ని అంగీకరించారు! కేశవన్ ఇంటి దగ్గర సాధకం చేస్తూన్నప్పుడు ఆయనతోబాటు నేనుకూడా ఆయన ఇంటివద్ద సాధకం చేస్తే బాగుండునని అనిపించింది. నా వయస్సుతోబాటు నా గమ్యాన్ని చేరుకోగలననే ధీమా కూడా పెరిగింది. కేశవన్‌తోబాటే నేను కూడా సాధకం చెయ్యాలనే నా కోరికని కేశవన్ ఏ విధమైన అమరిక లేకుండా అంగీకరించారు. చాలా రోజులు కేశవన్ పర్యాటనలో ఉండడం వలన ఆయన ఇంటివద్ద ఉండే కొన్ని రోజులే నేను సాధ్యమైనంతవరకూ నా కాలాన్ని సద్వినియోగం చేసుకొనేవాణ్ణి.

కేశవన్ కి ఉపనయనం జరిగింది; పవిత్ర యజ్ఞోపవీతం ధరింపజేసారు. చందనం కర్రతోతయారుచెయ్యబడిన ఒక అగర్బత్తి స్టాండు మేం బహుమతిగా ఇచ్చాం. అది ఒక స్నేహిడుద్వారా పురమాయించాం; దాని సువాసనతోనే కేశవన్ దాన్ని మెచ్చుకోకలిగాడు.

“కళలపట్ల వారి ప్రేమ, మేధస్సు గమనిస్తేమట్టుకు తమిళలు వారికి వారే సాటి!” అని కేశవన్ నాన్నగారు భార్యతో అంటున్న మాటలు ఇప్పటికీ నా చెవుల్లో మారుమ్రోగుతున్నాయి. “మనకి ఎన్నో బహుమతులు వచ్చాయేకాని భావంలోకాని, భవ్యతలోకాని వారిచ్చనిదానితో సరితూగగలదా అన్న ఆయన ప్రశంశ నేనెన్నటికీ మర్చిపోలేను. ఆయన కుటుంబ సభ్యులలాగే నేనుకూడా ఆయనపట్ల గౌరవభావంతో ఉంటాను.

కాని ఇప్పుడు ఆయన కేవలం ఒక గుర్తుగానే మిగిలిపోయారు, కేశవన్ భుజంమీద చెయి వేసుకొని కొడుకువెనుక వెళ్ళే ఆ తండ్రి ఇప్పుడు లేరు. వాళ్ళలో ఒకరితో ఒకరికి ఎడబాటు జరిగినది ఒక హృదయవిదారకమైన సంఘటన.

కేశవన్ కచేరీలన్నీ సర్వసాధారణంగా విజయవాడ స్టేషన్ నుండే ప్రసారమయ్యేవి. చాలా కాలంగా కేశవన్ నాన్నగారు తన కుమారుడిని అనుసరించి



తను కనే కలలు సఫలమవడానికి మద్రాసుకి మకాం మార్చాలనే అభిప్రాయంతో ఉండేవారు. అంతేకాక సంగీతానికి, కళలకి కేంద్రంగా మద్రాసు ప్రసిద్ధి చెందింది. అక్కడి రేడియో స్టేషన్ ద్వారాకూడా కేశవన్ కచేరీలు ప్రసారమయ్యే అవకాశంకూడా ఉండేది. ఆ తండ్రి ఈ విధమైన ఆలోచనలు కొనసాగిస్తున్న సమయంలో ఆ కుటుంబానికి ఘోర విపత్తు సంభవించింది.

రేడియో ప్రోగ్రాం ఐన వెంటనే ఆ ఉభయులు ఇంటికి రైళ్ళోతిరిగివెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ తండ్రి చికాకుకి తగినట్టుగా ఆ రోజు వాళ్లు వెళ్ళవలసిన రైలు ఒక గంటన్నర ఆలస్యంగా రానున్నది. ప్లేట్ ఫారంలో సామాను ఒక పక్కగా సర్దుకొని రైలుకోసం నిరీక్షిస్తున్నారు, తన అలవాటు ప్రకారం కేశవన్ చాలా విషయాలగురించి ప్రశ్నలు కురిపిస్తున్నప్పుడు కేశవన్ తండ్రి కటువుగా సమాధానమిస్తున్నారు. కొడుకు ఇంకో ప్రశ్న అడగబోతుండగా ఒర్మి నశించినందుకు ఆ తండ్రి "విసిగించకుండా నోరు మూసుకొని ఉండలేవా? నేను నీ ప్రశ్నలకి జవాబు చెప్పలేనురా బాబూ, నన్ను విడచిపెట్టు! నా ఛాతీలోని నొప్పి నన్ను చంపేస్తుంది," అని కాస్త చిరాక్కుగుగా అన్నారు. నాన్నగారి కోపం గ్రహించిన కేశవన్ మరి మరుమాట లేకుండా మౌనం వహించాడు. చాలా సేపైనతరువాత నాన్నగారిని తాగడానికి నీళ్ళడిగాడు. బదులు రాకపోవడంతో నాన్నగారు పక్కకి తప్పుకొని ఉంటారనుకొని, ఆయన తిరిగివస్తారని తనని తానే సరిపెట్టుకున్నాడు.

రైలు రాకతో ప్లేట్ ఫారం మీద కల్లోలం కానవచ్చింది. "నాన్నగారూ, ఇది మనం వెళ్ళవలసిన రైలేనా?" అని కేశవన్ అడిగాడు, కాని సమాధానం రాలేదు. టికెట్లు కొనితేవడానికి ఆయన వెళ్ళివుంటారనుకొని లేచి నిలబడాలనుకున్నాడు కేశవన్. కాని ఎవరో తన చెయి పట్టుకున్నట్టుగా అనిపించి, "ఎవరబ్బా ఇలా పడుకోగలరు?" అని ఆయన తనలో తనే గొణుకుతున్నట్టుగా విన్నాడు. ఇంకా చెయి విడిచిపెట్టకుండానే, "నువ్వు గుడ్డివాడివా?" అని ఆయన కేశవన్ని అడిగారు.

"ఔను, మీరు రైల్వే అధికారులా? ఈ రైలు ఎక్కడికి వెళ్తోంది?" అని కేశవన్ అడిగాడు.

“ఈ పక్కన పడుకొని ఉన్న పెద్దాయన ఎవరు? అని ఆ అధికారి అడిగాడు - కంగారు, ఆశ్చర్యం మిళితమైన గొంతుకతో.

“నిజంగా నాకు తెలియదు!” అని జవాబిచ్చాడు కేశవన్.

“మీ వెంట తోడుగా ఎవరున్నారు?” అని అడిగాడు ఆ అధికారి.

“మా నాన్నగారు నా వెంట ఉన్నారు; ఆయన టికెట్లు కొనితేవడానికి వెళ్ళారు.”

ఆ ప్రాంతం అంతా గుసగుసలతో నిండిపోయింది.

కేశవన్ని ప్రశ్నలవర్షం ముంచేసింది. అతన్ని అన్ని వివరాలూ అడిగారు: తన పేరు, ఏ ఊరు, విజయవాడకి ఎందుకు వచ్చారు, మొదలైన వివరాలు; “మీ నాన్నగారికి ఎవరైనా తాగడానికి ఏమైనా ఇచ్చారా? అతను ఒళ్ళో బాగులేదని ఏమైనా చెప్పారా?”

ఆ తండ్రి కొడుకులు రేడియో స్టేషన్ నుంచి బయలుదేరి రైల్వేస్టేషన్ చేరుకున్నంతవరకు అన్నీ వివరంగా చెప్పమన్నారు.

తనకు సాధ్యమైనంతవరకూ కేశవన్ అన్నింటికీ సమాధానం చెప్పాడు: “అప్పుడప్పుడు నాన్నగారు ఛాతీలో నొప్పి అని అంటూ ఉండేవారు; ఈ రోజుకూడా ఆ మాట అన్నారు. ఐనా, ఆయనేం చెయ్యగలరు, నన్ను జాగ్రత్తగా చూసుకోవడం తప్ప?”

“ఐయ్యో, మేం చాలా బాధపడ్తున్నాం, విషయం చాలా కఠినమైనదే. మీ నాన్నగారు చనిపోయారు. మీ మట్టుకు మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆయన చనిపోయారు. అంటే ఏమిటో మీకు అర్థమైందా?” అని అడిగాడు ఆ అధికారి.

“ఇది నిజమేనా? ఆయన నిజంగా మా నాన్నగారేనా? ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారేమో? నిన్న రాత్రంతా దోమల బాధ వల్ల సరిగ్గా నిద్రలేదని నాతో అన్నారు” అని అంటూ ఇంకా అనుమానం తీరక కేశవన్ నాన్నగారిని తట్టి లేపడానికి ప్రయత్నిస్తున్నాడు.

రైల్వే అధికారి, ఇంకా అక్కడ చేరుకున్న జనులూ కేసవన్ పట్ల సానుభూతి చూపించారు. ఆ వార్తని రేడియో స్టేషన్ అధికార్లకి తెలియజేయగా వారు కేశవన్ కి వాళ్ళ ప్రాంగణంలో ఆశ్రయం కల్పించారు. కేశవన్ గురువుగారికి, ఇంటికి

టెలిగ్రాములు పంపించారు. ఆ టెలిగ్రాం అందుకున్న కేశవన్ తమ్ముడు అదిరిపడి వారి పెరట్లోవున్న నూతిలో గెంతబోయాడు అని చెప్పుకుంటారు. తిరిగి ఇంటికి రాబోయే భర్త, కొడుకు కోసం వారికి ఇష్టమైన వంటకాన్ని తయారుచేస్తున్న కేశవన్ అమ్మగారు, చిన్నకొడుకు పిచ్చిగా పరుగెత్తడం గమనించి అతన్ని వెనక్కి లాగి పట్టుకున్నారట. వెంటనే ఆ ఇంటిలో అంధకారం అలుముకుంది.

కేశవన్ని విజయవాడనుంచి వెంటబెట్టుకొని రావడానికి కేశవన్ తమ్ముడ్ని పంపడానికి అతని అమ్మగారు ఇష్టపడలేదు. ఏం చెప్పగలం, వాడుకూడా పట్టాలమీదపడి ఆత్మహత్య చేసుకుంటాడేమో? కాని చివరకి అతనే ఆ పనిమీద వెళ్ళాడు. "కేశవన్ మంచీ చెడ్డా చూసుకోడానికి ఇప్పుడు ఇంట్లో ఉన్నవాడిని నేనే. నేనెప్పుడూ ఆత్మహత్య చేసుకోను. నా జీవితాన్ని కేశవన్ సేవకే అంకితం చేస్తున్నాను!" అని కొడుకు తల్లికి మాట ఇచ్చాడు; కేశవన్ తో ఇంటికి తిరిగివచ్చాడు. తండ్రిగారి ప్రార్ధిత శరీరం ఇంటికి చేరలేదు. కేశవన్ కి ఉపనయనం అయి ఉండడంవలన ఉత్తర క్రియలు జరిపించడానికి ఆయన అక్కడే ఉండి కర్మకాండం జరిపించబడింది. "ప్రార్ధిత శరీరం చూసిన వెంటనే కర్మకాండం జరిపించాలని నిర్ణయం చేసాను," అని తమ్ముడు చెప్పాడు. కేశవన్ రెండు చేతులూ పట్టుకొని, బహిరంగంగా విలపిస్తూ, కేశవా, మన నాన్నగారు ఇక లేరు! దహన సంస్కారం నీ చేతులమీదే జరిగింది. ఐనా, నీవెప్పుడూ నీ దృష్టి ఆయనమీద పెట్టలేదు. ఎంత దురదృష్టం! అసలు నాన్నగారెలావుంటారో నువ్వెప్పుడూ చూడలేదు!" అని వాపోయాడు. కొన్ని క్షణాల మౌనం తరువాత కేశవన్ రహస్యంగా ఉచ్చరించుతున్నట్టు "నేను చూసానే, ఆ ఉష్ణం నాకు తెలుసు," అని అన్నాడు.

నాన్నగారిని కేసవన్ ఎప్పుడూ చూడలేదే; అతనితో వ్యవహారమంతా నాన్నగారి శరీరంతోనూ, జీవితంతోనూ; ఆ రెండూ ఇప్పుడు లేవు. ఆ తండ్రి మరణాంతరం ఆ కుటుంబ సభ్యులలో కేశవన్ మాత్రం ఎక్కువ దృఢంగానూ, ఆత్మస్థైర్యంతోనూ ఉన్నట్టు కనిపిస్తాడు. బహూశా, ఆయన పోయిన తరువాతకూడా, మునపటిలాగే, కేశవన్ నాన్నగారిని చూస్తుండవచ్చు.

"మా నాన్నగారి ఫోటో ఈ మధ్యనే ఎంలార్జ్ చేయించాం, చూడు," అని ఒకరోజు కేశవన్ అన్నాడు. నేను తలెత్తి గోడవైపు చూసాను. ఆయన జీవించగా నేనెరిగిన

అచ్చుతరామయ్యగారు ఇప్పుడు పూలమాలలతో అలంకరించబడిన చట్టంనుంచి నా వైపు చూస్తున్నారు.

“అతన్ని ముఖాముఖిగా నేను చూస్తున్నట్టు నాకనిపిస్తోంది . . . ఆయన ఇంక లేరు అని నమ్మలేకపోతున్నాను!” అని అన్నాను.

“నాన్నగారిగురించి అందరూ అలాగే అనుకుంటారు. ‘ఆయన ఏదో ఊరుకి వెళ్ళి ఉంటారు, మనంకూడా ఎప్పుడో ఒక రోజు వెళ్ళి ఆయన్ని కలుసుకుంటాం!’ అని మేం అనుకుంటాం. నా భావమేమిటో నీకు బోధపడిందా? ఆయనకి మన దగ్గరకి రావడానికి వీలు కాకపోతే ఏదో ఒక రోజు మనమే ఆయన్ని కలుసుకోవడానికి వెళ్ళవరసిరావడం ఉచితం,” అని కేశవన్ నిర్వేదమైన నవ్వుతో ముగించాడు.

అసమానమైన సంగాత ప్రజ్ఞ; వేదంత ధోరణి; ప్రాపంచిక పరిజ్ఞానం. పూర్తిగా కంటిచూపు గలవారిలో ఎంతమందిలో ఉంటాయి అని చెప్పుకోగలిగిన లక్షణాలు; అదికూడా అంత చిన్న వయసులో . . . .

నిశ్చలంగానూ, నిర్మలత్వంలో ఆ నయనాలు కారుణ్యాన్ని వర్షిస్తాయో అనిపిస్తుంది. ఏమైనప్పటికీ, జీవంలేని కేశవన్ కళ్ళలో ఎవరికైనా కానవచ్చేది ప్రతిఫలించే దైవదత్తమైన ప్రజ్ఞతో కూడిన అప్యాయత. కన్నీరుగాని, అందంగాని ఆ కళ్ళలో కానరాకపోయినా, తన్ను చూసేవాళ్ళ కళ్ళు చెమర్పింపజేయగల శక్తి వాటికి ఉంది. అద్వితీయమైన ఆ చేతి వేళ్ళలోగల ఆ గాంభీర్యాన్నికూడా మరుగుపర్చగల తేజస్సు గలవి కేశవన్ నయనాలు.

********

**(మూలం ప్రచురణ కలైమగళ్, నవంబరు, 1954)**

# నా డైరీలోని కొన్ని గురుతులు

"ఆ శుక్రవారం నేను గుర్తుచేసుకున్నాను . . . ఈ ఆదివారంకూడా నాకు జ్ఞాపకం వచ్చింది. మనదేశంలోని సూర్యుడు అస్తమించి ఇవాళకి ఒక సంవత్సరమైంది."

ఇవే నేను ఆ రోజు నా డైరీలో రాసుకున్నవి. ఆ రోజు ఘటన ఎవరూ మరిచిపోరు, కాని నా దగ్గర డైరీ ఉన్న 'దోషం' వలన నాకలాగ రాయాలనిపించింది; రాసిపెట్టాను.

"ఇంతేనా? మరేం రాయలేదా?" అని మా ఆయన నన్ను అడిగారు.

"మరేం ఉంది రాయడానికి? అసలు ఈ చిన్న డైరీలో  జాగాకూడా ఎక్కువగా లేదే?"

అసలు డైరీ అంటే రోజువారీ సంఘటలని వివరించాలి; ఆ  ఘటనలమూలంగా మనకి తోచిన ఆలోచనలు, కల్పనలు క్లుప్తంగానైనా రాసిపెట్టాలి. అది నాకు తెలుసు. కాని ఇవాళ ఆ నియమం అనుసరించి నేను రాయలేదు.

"నేను చెప్పానుగా, ఇలా రాస్తే లాభం లేదు!" అన్నారు మావారు.

"అవును. కాని ఇవాళ నాకేమో మనసులో తోచినది రాయాలనిపించింది!" అని అన్నాను; వచ్చే నవ్వుని తడబడుతూ ఆపుకున్నాను.

"ఏం, ఎందుకు?"

"ఎందుకా? ఇవాళ నా మనసులోని ఆలోచనలన్నీ వివరించాలంటే వీలుకాదు . . . అవన్నీ  ఒక రామాయణంలాగ సాగగొట్టాలంటే ఎలాగ?"

'ఆ రోజు జరిగినది ఒక విషాద సంఘటనకదూ?" అని అతను నన్ను అడగకలేక పోయారు; నేను నవ్వుతూనేకదా అతనికి జవాబు చెప్పాను?

"అలాగేం సాగగొట్టనక్కరలేదు. నీ మనసులో ఏముందో ఒకే వాక్యంలో పదిలం చేసేయాలన్నమాట! ఇవాళ గాంధీగారి మరణంగురించి నీ మనసులో ఏముంది? దానిగురించి రాసేయ్!" అని అతను వక్కాణించి మాటాడారు.

"సరే, అలాగే చేస్తాను, డైరీ ఇవ్వండి!" అని డైరీ పుచ్చుకున్నాను.

"అరేరే, ఇంతకన్న మహా పాపం ఏదైనా ఉందా? నీ డైరీని ఎవరు చదవరని నీకెంత ధైర్యం!" అని కోపంతో అడుగుతున్నట్టు మావారు నవ్వారు.

"ఏం, నేను అలా రాయకూడదా? నేను రాసినది నిజం. నిజం చెప్పాలంటే ఈ ఒక సంవత్సరం ఎడబాటులో నా జీవితం బాగానే గడిచింది. ఇలాగ అనడానికి, రాయడానికి నాకు సిగ్గుగా ఉంది. కాని గాంధీజీగారు కోరేది నిజం కదా? అందుకే నేను నిజం మాటాడుతున్నాను."

నేను ఈ జనవరి 30 తేదీన డైరీ పేజీలో అలాగే రాసాను.

"పదకొండు మాసాలు మనం హాయిగానే గడిపాం; ఒక నెలమాత్రం, ఆరంభంలో, కంగారు పడ్డాం. కాదంటారా?" అని అడిగాను.

"అవును. గాంధీగారు గురించి రాసినప్పుడు లేని దుఃఖమున్నట్టు మనం ఎందుకు నటించాలి?" అని అతనూ ఒప్పుకున్నారు; అతని మాటల్లోని నిశ్చలత, భక్తి, అణకువ, నాకు బోధపడింది.

"ఇలా రాయాలని నాకు అవాళే అనిపించింది; ఎందుకని ఊరుకున్నాను. ఇవాళ మీరు నాకు ధైర్యమిచ్చారు. అది మీకు బాధగా ఉందా?" అని అడిగాను.

"అలాగేం కాదు. ఇందులో మన తప్పేముంది? నువ్వన్నట్టు గత సంవత్సరం మనం హాయిగానే గడిపాంకదా?" అని అంటూ అతను చిరునవ్వు నవ్వగానే నా మనసు కుదుటపడింది.

ఆ సాయంకాలం మావారు మాత్రం ఒక స్నేహితుడుని చూడడానికి వెళ్ళారు; నేను ఇంటిలోనే ఉన్నాను.

'అదీ ఒక సాయంకాలంలోనే!' అని నేను గుర్తు చేసుకున్నాను; నా మనసులో రకరకాల ఆలోచనలు లేచాయి.

'నేనెందుకలా డైరీలో రాసాను?అది సరేనా? అసలు, అతనికికూడా ముందు అలాగే అనిపించిందికదా?' అని ఆలోచన తట్టింది.

'డైరీలోని కాగితాన్ని చింపేద్దామా? చింపేస్తే ఆ తేదీ ఇక కనిపించదు! రాసినది చెరపకుండా రాయడానికి ఇక జాగా లేదు! ఆ పేజీ పూర్తిగా నిండిపోయింది!'

మేజామీద తెల్ల కాగితాలున్నాయి. ఒక ఆలోచన తట్టింది. కలం తీసుకొని, మేజా ఎదుట కూర్చున్నాను; నా కల్పనా శక్తిని కూడపిలుచుకొని పరుగెత్తాను.

** ** **

అదొక శుక్రవారం.

గాలివాన వచ్చేముందు ఉరికే, ఏమీ తెలియక, ఉల్లాసంగా మొక్కలు ఊగిసలాడడడం మీరు చూసి ఉన్నారా? అలాగే మేంకూడా - ఆ సాయంకాలం రేడియోలో ఒక కచేరీ వింటున్నాం. ఎవరు? నేనూ, మా ఆయన, కాదు! నా స్నేహితురాలు పద్మా, నేనూ! అప్పుడు నాకూ అతనికీ ఇంకా పెళ్ళి అవలేదు; అసలు మా ఇద్దరి మనసులూ ఒక చేరువలో లేవు.

సమయం ఆరుగంటలుకూడా అవలేదు.

"ఇంకా ఐదునిమిషాలే బాకీ. పాట పూర్తిగా వినడం ఎలాగ?" అని పద్మ నొచ్చుకుంది.

"అదేం లెక్కో? ప్రోగ్రాం ఐదు నిమిషాలు ముందూ వెనుకా మార్చాలంటే ఎం కొంప మునిగిపోతుంది?" అని నేనూ విసుగ్గున్నాను.

ఏదో కారణం వలన రేడియో కచేరీ ప్రసారం ఆపేస్తారేమో అని మా బెంగ.

అప్పుడే పద్మ భర్త వార్తలు వినడానికి గదిలోకి ప్రవేశించారు; చాలా శ్రద్ధతో ఒక కుర్చీని లాగ్గొని అందులో కూర్చున్నారు.

'మనకి వార్తలంటే ముఖ్యం కాదు. కాని అందరూ అలావుంటారా?' అని మేమిద్దరం మాలో చెప్పుకున్నాం.

'మనకి న్యూస్ వద్దు!' అని లేచి గదినుంచి నిష్క్రమించాలని ప్రయత్నించాను. కాని "ఉండు, వచ్చే పదినిమిషాల తరువాత మంచి ప్రోగ్రాం విందాం!" అని పద్మ అనగానే సరేనని ఒప్పుకున్నాను.

వార్తలు ఆరంభమయ్యాయి.

"ఊరుకోండి, న్యూస్ విందాం!" అని మమ్మల్ని చూడకుండానే పద్మ భర్త మందలించారు.

"పద్మా, రా, మనం వెళ్దాం. నోరు మూసుకొనివుండడం మనకి చేతకాదు!" అని నేను మెల్లగా గొణిగాను.

"అవును, ఈ మౌనవ్రతం మనవల్లకాదు!" అని తన కంఠధ్వని తగ్గించకుండానే పద్మ లేచి నిలబడింది. తనన్న మాటలు భర్త చెవులకి అందాలని, వార్తలలో

అతనికివున్న మోజు తనకి తెలుసు అనే ధోరణిలో మాటాడింది. ఐతేనేం, ఆ స్వభావం తమ పరస్పర అనురాగంకి అడ్డురాదనే గాఢ నమ్మకం ఆమెకి ఉంది కాబోలు!

ఆ మాటలు విని అతను చిరచిరలాడుతారేమో అని నాకు ఆ క్షణం అనిపించింది. కాని, అంతలో . . .

"ఏయ్ . . . ఏయ్, ఉండండి . . . . ఏమిటీ?" అంటూ తటాలున శ్రీనివాసన్ కుర్చీనుంచి లేచి నిలబడ్డారు.

"అలాగా? . . . గాంధీగారినా? అవునా?" అని అతను గుంజుకున్నారు.

అవును. అదే వార్త . . . ఎవరూ నమ్మతగని వార్త . . . . మేం ద్వేషించే వార్తలకి శిఖరంగా ఒక ఘోరమైన వార్త!

ఎక్కడ చూసినా హడావిడి; శోకమయం.

"ఏమిటి?" అని నివ్వెరపోయి పద్మ రేడియోను చూస్తూ నిలబడిన భర్తని చేరుకుంది; నేను ఆమెదగ్గర సెలవు పుచ్చుకొని మా ఇంటికి పరుగెత్తాను.

అమ్మకూడా నా కబురు విని అదిరిపడింది.

"నాన్నగారు ఎక్కడ?" అని అడిగాను.

"అతనిక్కడ లేరే? మేనత్తని చూడడానికి వెళ్ళారుగా?" అని అమ్మ నాకు గుర్తు చేసింది.

నాన్నగారికి గాంధీ భక్తి ఎక్కువ; ఈ దుర్ఘటన అతనెలా భరిస్తారో అని మేం కలవరపడ్డాం.

ఆ రాత్రి అతను ఊరికి తిరిగిరాలేదు. ఎక్కడ చూసినా హరతాల్ - సహాయ నిరాకరణోద్యమం! అతను వెళ్లిన పని ఏమీ అవలేదు; రెండుమూడు రోజులతరువాతనే అతను వచ్చారు.

అతనొక చెడ్డ కబురుతో వచ్చారు: ఇటీవల బావ బలరామన్ ఏదో సంఘంలో చేరాడని, అందులోని సభ్యులకీ గాంధీ హత్యకీ సంబంధం ఉందనే అనుమానం వలన సభ్యులని అరెస్టు చేస్తున్నారని చెప్పారు. బావనికూడా అరెస్టు చెయ్యవచ్చు. ఇదే మేం వింటున్న హెచ్చరిక!

బావగాని ఎక్కడో ఉన్నాడంటే మాకూ నాన్నగారికి ఎటువంటి విచారమూ ఉండదు; అతను ఈ ఊరులోనే ఉన్నాడు. కాలేజీలో ఒక విద్యార్థి; హాస్టలులో పెద్దనాన్నగారి అబ్బాయితో ఉంటున్నాడు.

నాన్నగారు వెళ్ళినది అతని ఊరుకే. "మీరు మా బలరామన్ని కలుసుకోని వాడికి బుద్ధి చెప్పాలి!" అని అతని తల్లిదండ్రులు నాన్నగారిని వేడుకున్నారు.

అంతేకాదు. బలరామన్ తండ్రి కొన్నిరోజుల్లో అబ్బాయిని చూడడానికి వస్తున్నట్టు మాకూ, అతనికీ రాసారు.

వచ్చిన మాడు గంటలకి ముందే - మధ్యాహ్నం మూడుగంటలకి - నాన్నగారు తన బాధ్యత నెరవేర్చాలని కాలేజీ హాస్టలుకి వెళ్ళారు.

'బావని పోలీసులు అరెస్టు చేస్తారా?' అని నేనుకూడా అందరిలాగే బాధపడ్డాను. కాని 'వాడొక మోటు మనిషి!' అనే నా ఉద్దేశం వలన నా మనసులో ఎటువంటి బెంగా లేదు. నాన్నగారు బావకోసం హాస్టల్ కి వెళ్ళగానే నేను అమ్మని అడిగాను: "అమ్మా, నీకు జ్ఞాపకం ఉందా? మూడు సంవత్సరాలకుముందు మనం అత్తింటికి వెళ్ళినప్పుడు బావ ఏదో సంఘంలో చురుకుగా పనిచేస్తున్నట్టు కనిపించాడు. అదేనా ఈ R.S.S.?"

"అవునే, నీకు బాగా గుర్తుందే!" అని అమ్మకి ఆశ్చర్యం కలిగింది.

"బావగురించి నీకు ఇంత జ్ఞాపకం ఉందన్నమాట! 'వాడిని పెళ్ళిచేసుకుంటావా?' అని అడిగినప్పుడు నువ్వెలా మూతి ముడుచుకున్నావ్! ఇలా జరుగుతుందని, వాడు జెయిలుకి వెళ్తాడని నీకు తెలుసుకాబోలు!" అని అమ్మ నవ్వింది. నేను నోరు మూసుకొని వసారాకి వచ్చేసాను; కాని మనసులోని ఆరాటం పోలేదు.

'బావని మర్చిపోవడం ఎలాగ?' అనే ఆలోచన తట్టింది; దానితోబాటు కటువైన కొన్ని పాత ఘటనలు నాకు జ్ఞాపకంలో వచ్చాయి . . .

నేను అమ్మా, నాన్నతో అత్త ఇంటిలో నాలుగురోజులుగా ఉంటున్నాను.

"బావా, ఇదేంటి? కర్రతో చేసిన బాకులాగుందే?" అని అడిగాను; అదిరిపడి బావ నన్ను తిరిగిచూసాడు.

"అదెందుకే నీకు? Get out! నీకు మరేం పని లేదా?" అని కేకలు పెట్టాడు.

"నాకు వేరే పని ఏముంది? నీ పుస్తకాలు చూడాలని వచ్చాను," అని కొంచెం జంకుతూనే జవాబు చెప్పాను.

"సరే . . . కాని నువ్వెందుకు దాన్ని తీసావ్? మరేం గోలపెట్టకు . . . నీ తమ్ముళ్లూ, చెల్లెళ్ళూ దీన్ని చూస్తే ఊరకే వుంటారా? దానితో ఆడుకోవాలని బలవంతం చేస్తారు!" అని బావ గుసగుసలాడాడు.

"సరే, నేను వెళ్తాను . . . నాకొక మంచి పుస్తకం ఇస్తావా? . . . ఇదేం పుస్తకం?" అని పక్కనేవున్న ఒక పుస్తకం చెయిలో తీసుకున్నాను.

"ఏయ్! అది కింద పెట్టు! అబ్బా, నీకెంత ధైర్యం!" అని మళ్ళీ బావ బొబ్బలు పెట్టాడు.

నాకు ఏడవాలనిపించింది. మరేం అనక ఇవతల వచ్చేసాను. ఆ రోజు సాయంకాలం బావ మేమందరం కలిసి తప్పకుండా ఒక సినిమా వెళ్ళాలని అంటూ ఆ సినిమా గురించి హాస్యంగా ముచ్చటైన కబుర్లు చెప్పినతరువాత నాకు అతనిగరించి కొంచెం మనసు మారింది. ఆ మరునాడే మా తిరుగుప్రయాణం. అప్పటికీ బావ బాహటంగా నాకు చూపిన ఉగ్రత నేను మరువలేను.

అతని గదిలో ఒక మూలవున్న పెద్దాయన ఫోటో చూసి "బావా, అదెవరు?" అని మెల్లిగా అడిగాను.

"అవన్నీ నీకెందుకే? నోరు మూసుకో!" అని క్రూరంగా జవాబు చెప్పాడు.

'ఎంత హఠం! మంచి దండాకోరి!' అని అనుకున్నాను. అత్తయ్యని అడిగాను: "ఇదేం సంఘం బావ పని పెట్టుకొని తిరుగుతున్నాడు?" అని.

"అవును. వాడికి ఈ సంఘం పిచ్చి బాగా పట్టుకుంది! అక్కడ కసరత్తు, వెదురు కొయ్యలతో పోట్లాట, అన్నీ నేర్పుతారట! వీడు అసలే మొండిఘటం, ఇక చెప్పాలా?" అని అత్తయ్య నా అనుమానం రుజువు చేసింది.

నాన్నగారు తెచ్చిన కబురు ఆ రుజువుని బలపరిచింది.

కాని నా మనసులోని ఆరాటం తగ్గలేదు.  ఆ రోజు సాయంకాలం పద్మని కలుసుకున్నాను, దానికి చెప్పాను.

"అవును . . . అతనికి భయం కాబోలు . . .ఏడ్చాడని విన్నాను," అని అంది పద్మ నవ్వుతూ.

"ఏడ్చాడా? ఎప్పుడు?"

"అవాళ మగవాళ్ళందరూ రేడియోలో గాంధీగారి దహనక్రియలు వింటున్నప్పుడు నీ బావ బలరామన్ తన పెద్దనాన్నగారి అబ్బాయితో వచ్చాడట. అందరికంటే అతనే ఎక్కువగా ఏడ్చాడట. అతనే చెప్పారు. అరెస్టు చేస్తారని భయం ఆ రోజే వచ్చేసింది!"

ఆమె మాటలు విని నాకు కోపం, చికాకు కలిసివచ్చాయి. కాని బావని వెనకేసుకురావాలని నాకు తోచలేదు; ఇంటికి తిరిగవచ్చేసాను.

చాలా సమయం తరువాత నాన్నగారు ఇంటికి తిరిగివచ్చారు. "పాపం, బలరాము, వాడిని చూస్తే నాకు జాలిగా ఉంది! మొహం బాగా చిన్నబోయింది! ఈ పరిస్థితిలో వాడి సంఘంలోని సభ్యులు అజ్ఞాతంగా ఉంటున్నారు, కాని వాడు దానికి విరుద్ధం! 'తప్పకుండా నేను ఈ అవమానం, శిక్ష అనుభవించి తీరాలి!' అని వాపోతున్నాడు!" అని బావగురించి చెప్పారు.

'శిక్ష కావాలని బావ పట్టుదలతో ఉన్నాడు!' అని వినగానే అది అతని మోటుతనంకి నిదర్శనం అని నాకు తోచలేదు. 'బావకి ఎంత ఘనబుద్ధి! ఎక్కడో దాక్కోడం, న్యాయంనుంచి తప్పించుకోడం అతనికి ఇష్టం లేదు!' అని అనుకున్నాను.

ఇంత మంచి బావకి ఏమవుతుందో అని నాకూ, ఇంటిలో అందరికీ దిగిలు; నాన్నగారు ధైర్యం చెప్పారు:

"సంఘం సభ్యులలో కొందరికే బాధ్యతలుంటాయి; వీళ్ళని అంతగా లెక్కచెయ్యరు, కాని అరెస్టు చేస్తారు. కొన్నిరోజుల్లో రిలీజ్ చేసేస్తారు. బలరాము సంఘంలో చేరి ఐదారు సంవత్సరాలయ్యాయి కాబోలు! అందుకే అరెస్టు చేస్తారు, కాని మరేం భయం లేదు!"

"అవును, అలాగే కాబోలు!" అని మేం మాలో చెప్పుకున్నాం. నాన్నగారు మాకు ధైర్యం చెప్పారని నేను నేను పద్మకి తెలియజేసాను. పద్మ వయస్సులో నాకంటే పెద్దది, పెళ్ళైంది కనుక  మంచి అనుభవశాలికూడా. నాతో కలిసి స్కూల్లో చదివింది, పోయిన సంవత్సరం చదువు ఆపేసింది. అందువలన మా ఇద్దరికీ మంచి పొత్తువుంది. బావగురించి నేను పద్మకి అన్ని కబుర్లు చెప్పాను.

**        **        **

నాన్నగారు మేనమామతో బావ హాస్టలుకి వెళ్ళారు. తిరిగి వచ్చినప్పుడు అకస్మాత్తుగా ఇద్దరూ బావతో వచ్చారు. నేను ఇంతకుముందు బావని చూడలేదా? ఆ రోజుల్లో నెలకొకసారి చూసివుంటాను; ఇప్పుడే ఆరు నెలలుగా వాడిని చూడలేదు. కాని ఇప్పుడు చూసినతరువాత నేను పూర్తిగా మారిపోయాను! అలవాటుగా వాడొక మొండి, ఎవరికీ లొంగడు అనే ఆలోచనలో వాడు వచ్చినప్పుడు నేను పొరుగింటికి పారిపోతాను. వాడు మా ఇంటిలో ఉన్న పావుగంట, అర్ధగంటలో అమ్మా, నాన్నగారితో మాటాడుతాడు. అసలు వాడి రాకపోకలగురించి నేను లెక్క చెయ్యను.

కాని ఇప్పుడు వాడిని  నేరస్తుడుగా చూడగానే నేనూ ఏదో నేరం చేసినట్టు వెనకాడాను.

"ఒరేయ్, నా మాట విను! ఇక నువ్వు ఇక్కడ ఉండకూడదు! మన ఊరికి వచ్చేయ్! లేకపోతే ఇక్కడే, ఎవరికి కనిపించకుండా ఆంటీ, అంకుల్ తో ఉండు!" అని వాళ్ళ నాన్నగారు బావని బతిమాలారు. వాడు నోరు విప్పి చెప్పినదంతా "ఊహూమ్, ఏమైనా సరే, నేను దాక్కోను!" అనే.

బావ మళ్ళీ మళ్ళీ నన్ను చూస్తూనేవున్నాడు. ఆ చూపుని ఎలా వర్ణించడం?సిగ్గా? కాంక్షా? కోపమా? లేక, మనవి అనవచ్చా? అసలు నా మనసు నాకే బోధపడలేదు, ఇక వాడి మనసు నాకెలా అర్ధమవుతుంది?

రాత్రి తొమ్మిదిగంటలైపోయింది. బావ మేడమీద ఉన్నాడు; అక్కడే వాడు హాయిగా ఉన్నాడు. మేమందరం కింద ఉన్నాం.

నాకు కావలసిన ఒక పుస్తకం మేడమీద ఉంది.

"అది నాకు కావాలి," అని నాన్నగారికి జంకుతూ చెప్పాను.

"వెళ్ళి తీసుకోవే, నీకెందుకు భయం?"

"అదేంటో, ఈ అమ్మాయి బావనిచూసి ఎలా వణుకుతోంది! ఒకరోజైనా వాడిని నేరుగా చూసి మాటాడదేం?" అని అమ్మ గొణుకుతున్నట్టు - కాని మేనమామ చెవులకి అందినట్టు - నాన్నగారి దగ్గర మొరబెట్టుకుంది.

"అవును . . . దానికి ఇష్టమున్నట్టు మీరు రాయలేదు! . . . ఈ సంబంధంకి ప్రాప్తం లేదు కాబోలు! . . . వాడూ ఇప్పుడు ఇలాగైపోయాడు!" అని మేనమామ బాధపడ్డారు.

ఈ గడబిడలో నేను మేడమీదకి వెళ్ళాను.

'ఇప్పుడు నాకేం భయం లేదు! నేను ముందు మొహమాటంవలన జంకాను!" అని నేను ఎవరికీ చెప్పను!

పుస్తకాల అలమారీ పక్కన బావ కనిపించాడు.

"నాకు పుస్తకం కావాలి."

"తీసుకో!" అని జరిగాడు.

నేను నాకు కావలసిన పుస్తకం తీసుకున్నాను; గభీమని ఒక ఆలోచన తట్టింది.

"చూసావా, దీని అట్ట? ఆకుపచ్చని రంగు!" అన్నాను. నాకెలా ధైర్యం వచ్చిందో? ఇప్పుడు తలచుకుంటే ఆశ్చర్యంగా ఉంది!

'ఎంత మొండిధైర్యం!' అనే ధోరణిలో బావ నన్ను చూసాడు.

"గాంధీగారు పాకిస్తానుకి చేరవలసిన డబ్బు ఇచ్చెయ్యాలని చెప్పారట. అది విని మీ సంఘంలో సభ్యులకి కోపం అని నాన్నగారు అన్నారు."

బావ నన్ను మళ్ళీ వింతగా చూసాడు.

"అవును, నిజం . . . నేనూ ఒక ఖూనీకోరే, ఏమంటావ్?" అన్నాడు.

నేను మరేం అనక మెట్లు దిగి వచ్చేసాను.

నేను మేనత్త ఇంట్లో ఉన్నప్పుడు, మేం సినిమాకి బయలుదేరినప్పుడు నా ఆకుపచ్చ చీరని చూసి బావ "ఏమే, నీకు ఈ రంగేనా దొరికింది?" అని నన్ను ఎగతాళి చేసాడు; వాడి తృప్తికోసం నేను ఊదారంగు చీర మార్చుకున్నాను.

"చాలా బాగుంది!" అని బావ మెచ్చుకున్నాడు.

'ఎందుకురా ఇవాళ ఆకుపచ్చని రంగు గురించి మాటెత్తాను!" అని నేను నొచ్చుకున్నాను.

మేడ దిగివచ్చినా నా మనసులో ఆరాటం తగ్గలేదు. ఈ రాత్రి ఘటన తరువాత నిద్రెలా వస్తుంది?

మరునాడు . . .

"బలరామూ!" అని చాలామంది పిలచిన తరువాతకూడా ఏ జవాబు రాలేదని నాన్నగారు, మేనమామ మేడమీదకి వెళ్ళిచూసారు; నేనూ వెళ్ళాను. బావ కనిపించలేదు!

డాబామీదనుంచి ఎలాగో - తప్పకుండా వాడు మెట్లు దిగలేదు - కిందకి గెంతి బావ పారిపోయాడని నిశ్చయించారు.

'నేనొక ఖూనీకోరు!' అని బావ అన్నాడుగా? నేనడిగానని భరించలేక ఆత్మహత్య చేసికున్నాడా?

నేను ఏడ్చేసాను. బావ క్షేమంగా తిరిగిరావాలని అంతరాత్మలో వేడుకున్నాను.

ఆ మరుసటి రెండు వారాల్లో బావ అరెస్టైయి, చెరసాలనుంచి విడుదలై వచ్చేసాడు.

"సరే, ఆఖరిసారి అడుగుతున్నాను. ఈ సంవత్సరం నీ పెళ్ళి తప్పకుండా జరగాలి. వాడు మగవాడు, ఐతే, వాడికీ ఇంకా ఆలస్యం చేస్తే మంచిదికాదు. వాడికీ ఈ సంవత్సరం జరగాలి. నీ ఉద్దేశం ఏమిటో చెప్పేయ్!" అని అమ్మ అడిగింది.

చిట్టచివరకి అమ్మ అడిగిన ప్రశ్నకి, మొట్టమొదట నాకు బావమీద ఉన్న అభిమానం తెలియజేసాను.

** ** **

ఇంతే . . . ఇదే నేను రాసిన నా ప్రేమ గాధ . . . కాని దాన్ని ఎలా ముగించాలని నాకు తెలీదు.

మావారు వచ్చేలోపల కథని చక్కగా ముగించాలని నా కాంక్ష; కాని నాకది చేతకాదు.

రాసిన పేజీలు చక్కగా పోగుచేసినతరువాత ఆలోచించాను: ఇంతవరకూ నేను రాసినదానికి ఆధారం ఏమిటి? ఇందులో ఎదీ కల్పన కాదు! అన్నీ నిజంగా జరిగిన ఘటనలే! ఇందులో నా సొంత అనుభవాలు వివరించాను.

'ఇదే నా ప్రేమగాధ, దీనికి అంతు లేదు! మా ప్రేమగాధ ఇంకా చాలాకాలం సాగుతుంది!' అని చమత్కారంగా ముగించాలనే ఆలోచన లేచింది.

'మహాత్మాగాంధీ నూటయిరవై సంవత్సరాలు ఉంటారు!' అనే నమ్మకంలాగ ఒక వేళ ఇది కూడా . . .

'కూడదు, అలా రాయకూడదు!' అని నిశ్చయం చేసుకున్నాను.

గభీమని నాకు జ్ఞాపకం వచ్చింది: 'గాంధీగారి మరణంగురించి రాసినప్పుడు మేం ఈ సంవత్సరం ఎడబాటులో ఉన్నాం అని రాసినది పొరబాటు, న్యాయంకాదు!' అనే ధోరణీలోనేకదా నేనివన్నీ రాయడం మొదలుబెట్టాను?

సొగసులేనిచోట సొగసు నింపాలనే ఉద్దేశంతో ఇవన్నీ రాయడానికి నేను పూనుకున్నాను. అవునా?

'సరే, ముగింపు ఎలా ఉండాలి?' అని ఆలోచించాను; ఏదీ స్పష్టంగా అగుపించలేదు.

'ఇప్పుడు మహాత్మా మనతో లేరు అనే కారణంవలన అతని బోధనలు మనం చాలా శ్రద్ధతో పాటించుతాం' అని అంటున్నారు. 'అతనిలోనూ కొంచెం మొండితనం ఉంది!' అనే కారణంవలన అతనిపట్ల ఇంకా ఎక్కువ మర్యాద, అభిమానంతో అతన్ని అనిసరించాలని నాకనిపిస్తోంది. అతని ఆదర్శం సఫలమైనట్టు నా లక్ష్యంకూడా ఈడేరుతుంది!'

ఇలా రాయవచ్చా?

మరెలా రాయాలో నాకు అర్థం కాలేదు. 'నేనొక మొండిఘటం అనా నీ ఉద్దేశం? అందుకేనా నువ్విలా లొంగిపోవడం?' అని మావారు అడిగితే? అతనూ నేను రాసేది చదవాలికదా? మరి, అతనికీ నా మనసులో చెలరేగుతున్న భావనలు తెలియాలి; నేను డైరీలో రాసిన గురుతులకి రద్దు చెయ్యాలని రాసేది అతనూ చదవాలి, తెలుసుకోవాలి! ఇదేం నేను ప్రచురణకోసం రాయలేదే!

అతను వస్తున్నట్టు అడుగుజాడలు వినిపించాయి. నా కథ పూర్తవలేదు, అతను వచ్చేసారు!

అతనికి అందించాను. "చదివి చూడండి, ముగింపు ఎలా ఉండాలని చెప్పండి!" అని అన్నాను.

"కలం తీసుకురా!" అన్నారు; అందించాను.

“గాంధీజీ ఆరోగ్యానందాలతో మనమధ్య మెలిగినప్పుడు అతను మనకు చెప్పిన బోధనలు శ్రేష్ఠమైనవి; అతను పరమపదించి ఈ దేశంకి ఒక జ్యోతిగా వెలగుతూ మనకి అందించిన ఎఱుక, క్రమశిక్షణ, వాటికి మించినవి” అని అతను గతించిన దినం అందరూ చెప్పుకున్నారు.

ఇదిగో, మా ఇద్దరినీ జోడించే ఆత్మీయత - ఆ మహనీయుడు మృతి తరువాతే - లేచింది. ఇప్పుడు మా ఇద్దరి మనసులోనూ, జీవితంలోనూ అతను వెలిగించిన ఆత్మజ్యోతి సూర్యుడుగా ఈ దేశాన్ని ప్రకాశింపజేస్తోంది!”

మావారు ఇలాగ ముగించారు.

“ఆ రోజు నా మనసులో ఇలాంటి ఆలోచనే తట్టింది. అది మీకెలా తెలుసు?” అని ఆశ్చర్యంతో అడిగాను.

“నాకూ అలాగే అనిపించింది!” అన్నారు అతను.

“అలాగా? . . . .నేను గ్రహించలేకపోయానే!” అని బాధపడ్డాను.

‘ఆ నాటి దుర్ఘటన ఈ ఆదివారం భరించడం కష్టమే. కాని గాంధీగా వర్ధిల్లే ఆ సూర్యుడు వెలిగించిన ప్రేమానురాగాలు వాటిని మించుతాయి,” అని డైరిలో నేను మళ్ళీ రాసుకున్నాను.

ఆ వాక్యాలు జనవరి 30 తేదీ పేజీలోనే రాసాను. డైరీలో ఇంకొక పేజీ లేదే?

మావారు ఒక కొత్త డైరీ కొని తీసుకువచ్చారు.

“నువ్వు రాసినది చదివి నాకెలాగో అనిపించింది. ఇందులో కొత్తగా ఏమైనా రాయాలని ఉందా?” అని అంటూ దాన్ని నాకు అందించారు.

నేను అందులో రాసినది చదివారు.

“ఇదీ అదే ధ్వనిలో ఉంది. ‘ఆనందం శోకాన్ని మించేసింది!’ అని రాసావ్.”

“గాంధీజీకి నిజమే కావాలి!”


“అవును, మీ మనసుని నొప్పించకూడదని రాసినా, అందులో నిజం ఉంటుంది; నేనేం చెయ్యను?” అన్నాను.

“అవును, నిజం,” అని అతను ఒప్పుకున్నారు; ప్రేమానురాగం వలన అతనికి నామీద కోపం రాలేదు.

"ఇక నేనూ డైరీ రాయాలనుకుంటున్నాను!" అన్నారు అతను. మంచిది; అతనూ అందులో నిజమే రాస్తారు.

********

**(మూలం: స్వదేశమిత్రన్, జనవరి 30, 1940)**



# కళంకం

దూరంలో వీధి చివరన కనిపించిన తపాలువాడుని - అతను తన చెయిలోని ఉత్తరాలని, ఒక్కొక్కటినీ ఓరగా సర్దుకుంటున్నాడు - ఆతురతతో చూస్తూ వసంతి నిలబడింది; 'అబ్బా, ఎంత ఆలస్యం!' అని తనలో విసుగ్గుంది. అతన్ని చూడగానే తన ఇంటినుంచి పరుగెత్తుకొని వచ్చింది. కాని అతనింకా ఆ కట్టలోవున్న 56 నంబరు ఇంటి ఉత్తరాలు తీసిబెట్టలేదే? అతనిప్పుడు నిలబడివుండేది 49 నంబరు ఇంటిముందు; ఇంకా ఏడు ఇళ్ళకి అతను ఉత్తరాలు అందించాలి. అంటే ఈ పన్నెండేళ్ళ అమ్మాయి వోర్పుని అతనింకా పరీక్ష చేస్తున్నాడన్న మాట!

"అదిగో, పోస్టుమెన్! ఆ పత్రిక మాకే!" అని అంటూ వసంతి ఒక గెంతు గెంతింది.

"అది 55 నంబర్ ఇంటికమ్మా!" అని నింపాదిగానే జవాబు చెప్పి అతను ఆమెకి రెండు ఉత్తరాలు అందించాడు.

ఆ పిల్లల మాసపత్రిక తనకీ వస్తుందని వసంతి ఎదురుచూసింది; తనకి రాలేదని తెలిసి ఆమెకి  నిరాశ కలిగింది.

"మాకా పత్రిక  రాలేదా?" అని అడిగింది.

"లేదమ్మా!"

"ఎందుకు రాలేదు?"

"నాకు తెలీదమ్మా! రేపు రావొచ్చు . . . "

తపాలువాడు పొరుగింటికి నడిచాడు; వసంతి గబగబమని ఇంటికి తిరిగి వచ్చేసింది.

అసలేం జరిగిందో ఇల్లు చేరుకున్న తరువాతే వసంతికి తెలిసింది. నాన్నగారికి ఆమె అందించిన రెండు ఉత్తరాలూ ముఖ్యమైనవి. ఒకటి అన్నయ్య వాసు కలకత్తానుంచి రాసాడు; ఇంకొకటి ఆ పత్రిక కార్యాలయం నుంచి వచ్చింది.

ఇక ఆ పత్రిక రాదు!

“అన్నయ్య చందా కట్టలేదమ్మా, ఇక పత్రిక రాదు! ‘ఇంకా ఐదారు మాసాలతరువాత చందా కట్టాలని ఆలోచిస్తున్నాను!’ అని వాసు రాసాడు,” అన్నారు తండ్రి నారాయణస్వామి.

వసంతి ఏమీ అనక ఊరుకుంది.

ఇంతలో తల్లి మీనాక్షి జోక్యం చేసుకొని భర్తని అడిగింది.

“ఏం, ఎందుకు పత్రిక రాదంటున్నారు?”

“అదేం ప్రశ్న? చందా ఐపోయింది! మరెలా వస్తుంది?” అని అతను కొంచెం కోపంతోనే అడిగారు.

“ఆ చందా గురించి రిమైండర్ మనకి వచ్చిందని మీరు వాడికి రాయలేదు కాబోలు!” అని మీనాక్షి భర్తని ఎత్తిపొడిచింది,

“ఊరుకోవే, నీకన్నీ తెలిసినట్టు మాటాడుతున్నావ్! ఆ రిమైండర్ కార్డు నేను వాడి అడ్రసుకి పంపించేసాను! వాడూ రాసాడుగా ఇప్పుడు చందా కట్టే ఉద్దేశం లేదని?”

“అలాగా?”

“అవును!” అని అన్నారు నారాయణస్వామి; ఆ తరువాత కొన్ని నిమిషాలు అతను మౌనం వహించారు.

“ఇదిగో, వాడి ఉత్తరం! నువ్వే చదువు . . .” అని అంటూ అతను దాన్ని భార్యకి అందించారు; అతని కంఠధ్వనిలో నమ్రత కనిపించింది.

“నాకా రాసాడు?” అని మురిసిపడి మీనాక్షి ఉత్తరం చదవసాగింది. కాని చదువుతూంటేనే ఆమె మొహంలో మార్పు కానవచ్చింది; నుదుటమీద మడతలు కనిపించాయి.

“ఇదేంటి, ఈ నెల యాభై పంపిస్తానని రాసాడు? రెండు వారాలుగా మనం ఎదురుచూస్తున్నది . . . ”

దానికిమించి ఏమైనా అనడానికి ఇష్టం లేదో లేక సంకోచమో? మరే మాటా ఆవిడ నోటినుంచి రాలేదు.

"ఏం కారణమో, నాకూ అర్థం కావటంలేదు!" నారాయణస్వామి నిదానంగా మాటాడే విధంగా - శ్రమపడుతూనే - భార్యకి జవాబు చెప్పి, కొంచెం ఆగారు.

"ఇదేదో వింతగా ఉందే? డబ్బు పంపించడానికి ఆలస్యమైందని ఈ నెల ఓ ఇరవైయ్యో, నలభైయ్యో అదనంగా పంపించకుండా . . . "

"డబ్బు పంపించి తీరాలని నియమం ఉందా ఏమిటి?" అని విరక్తితో అడుగుతూ నారాయణస్వామి లేచి, మౌనంగా నిష్క్రమించారు; అతన్ని చూస్తూ నిలబడిన తల్లిని వసంతి సమీపించింది.

"అమ్మా - పత్రిక?"

"అవునే, అదొక్కటే నీకు కొరత! కావాలంటే ఎవరినైనా బతిమాలు, పత్రిక ఇస్తారు!" అని కూతురుమీద మండిపటుతూ మీనాక్షి వంటగదిలోకి ప్రవేశించింది. కాని కొంచెం సమయంలోనే ఆ ఉద్రేకం తగ్గింది: కూతురుమీద వాత్సల్యం లేక సానుభూతి కలిగిందా? తన కోపంకి న్యాయం లేదని ఆ తల్లి మెల్ల మెల్లగా గుర్తుచేసుకుంది.

"వసంతీ, రా, భోజనానికి," అని పిలిచింది.

"అన్నయ్యకి నిన్ను చూడాలని చాలా ఆతురతగా ఉందని రాసాడు. నువ్వు వాడి ఉత్తరం చదివావా? తమిళంలోనే రాసాడు - మనందరం చదవాలని . . . " అని అంటూ తల్లి కూతురుకి అన్నం వడ్డించింది.

"ఊహూమ్ . . . " అని వసంతి గొణుక్కుంది.

"అన్నయ్య ఉత్తరం చదివిచూడు! వాసు అన్నయ్య ఏం రాసాడో తెలుసా? 'వసంతీకి పట్టు వోణీ కొనిపంపిస్తాను!' అని రాసాడు . . . ఈ పత్రిక లేకపోతే మనకేం నష్టం, చెప్పు!"

'అన్నయ్యవలనే అమ్మ నన్ను తిట్టింది; అన్నయ్య వలనే నాకు పత్రిక రాలేదు!'

ఇలాంటి ఆలోచనలతో వసంతికి  అన్నయ్యమీద ద్వేషం వస్తే ఏంకాను? ఆ భయమే ఆ తల్లిని బాగా పట్టుకుంది. చెల్లెలు మనసులోనూ వాసు చులకనగా ఐపోవాలా? వద్దు! ఆ కారణం వలనే  ఆవిడ మనసులో కూతురుమీద అలుకవతోబాటు జాలికూడా  చోటుచేసుకుంది.

ఆవిడ యుక్తి సఫలమైంది!

"ఓ, అన్నయ్య వోణీ పంపిస్తాడా? సరే, నేను సరోజాన్ని అడిగి  పత్రిక చదువుకుంటాను!" అని వసంతి చెప్పి ఊరుకుంది; ఎప్పటిలాగే, మరేం గడబిడ చెయ్యకుండా, భోజనం చేసి, సంతోషంగా లేచి వెళ్ళింది.

కాని మీనాక్షి మనసులో ఆరాటం పోలేదు!

కొడుకు పరువు కాపాడాలని ఆ తల్లి ఆయాసపడుతోంది; కాని వాడు ఎలాగున్నాడు?

భర్తని భోజనంకి పిలిచింది; అతనూ వచ్చారు, భోంచేసారు, లేచి, వెంటనే వసారాకి వెళ్ళిపోయారు.

అంతసేపూ భార్యాభర్తలు ఎక్కువగా ఏమీ మాటాడుకోలేదు; కాని ఇద్దరి మనసులని ఒకే ఆలోచన ఆక్రమించిందని గ్రహించారు.

'మన అబ్బాయి ధోరణిలో మార్పు వచ్చేసింది! అందరు కొడుకుల్లాగే మన వాసు కూడా ఐపోయాడు; మనం ఇంతకుముందు చూసిన వాసు ఇప్పుడు లేడు!'

ఈ భావనే ఇద్దరి మనసులోనూ పదే పదే చోటుచేసుకొని దృఢపడింది.

మూడు మాసాలముందు వాసు నెలా వంద రూపాయలు పంపించేవాడు. మూడు సంవత్సరాలు అలాగ నియతంగా పంపించినవాడు, మూడు మాసాలముందు ఆ రొక్కాన్ని ఎనభై రూపాయలుగా తగ్గించాడు; ఐనాకూడా  తప్పనిసరిగా ఆ రొక్కం నెల నెలా రావడం జరిగింది. ఇప్పుడే - రెండు వారాలుగా - అతనిలో మార్పు కానవచ్చింది,

రొక్కం రాలేదు! ఇవాళ వచ్చిన రొక్కం యాభై రూపాయలు! ఈ నెల ఆలస్యంగా, తక్కువగా రొక్కం రావడం వింతగా ఉంది!

అంతేకాదు! వసంతి పేరులో చెల్లించే ఆ పత్రిక చందా - ఐదు రూపాయలు - వాసు తగ్గించేసాడు! కొత్తగా చందా కట్టలేదు! ఏం, ఎందుకు?

మీనాక్షి, నారాయణస్వామి దంపతులకి మానసికంగా దొరికిన జవాబు ఇదే:

'మన అబ్బాయి మనకోసం చేస్తున్న ఖర్చులు తగ్గించుకుంటున్నాడు! అవును, వాడు మారిపోయాడు! వాడి మనసులో కళంకం వచ్చేసింది!'

ఇటీవల మెల్లమెల్లగా లేచిన ఆ సందేహం ఈ రోజు దృఢపడింది.

వాసుకి ఇప్పుడు కొత్త సంసారం, కొత్త బాధ్యతలు . . .

'మనం చేసేదేముంది? మన అబ్బాయి మారిపోయాడు!'

దంపతులు మౌనంగా ఒకరికొకరు మాటాడుతున్నట్టు, బాహాటంగా ఏమీ అనకుండా, సంకోచంతో ఊరుకున్నారు.

పదకొండు గంటలకి మనియార్డర్ వచ్చేసింది; కాని వచ్చిన రొక్కం అరవై రూపాయలు, యాభై కాదు!

అది చూడగానే 'పాపం, ఉత్తరంలో యాభై అని రాసాడు, కాని అరవై పంపించాడు,' అని దంపతులు వాసుని మనసార అభినందించారు.

నారాయణస్వామి రొక్కం పుచ్చుకున్నారు; దాన్ని భార్యకి అందిచ్చినప్పుడు సంతాపంతో ఒక చిరునవ్వు నవ్వి, "యాభై ఎదురుచూసి ఇప్పుడు అరవై వస్తే మనకి మంచి లాభం వచ్చినట్టుంది!" అని అతను అన్నారు.

"అవును, అదొక గడుసైన పని! అందుకే అబ్బాయి ఎనభైని యాభై అని తగ్గించి, అరవైగా పంపాడు కాబోలు!" అని అంది మీనాక్షి; ఆమె స్వరంలో కోపం, ఎగతాళి, చోటుచేసుకున్నాయి.

అప్పుడు వసంతి అక్కడ లేదు. అందుకే మీనాక్షి భర్తకి ఇంకా చెప్పింది. "వచ్చే నెలలో వాడి భార్య రెండవ బిడ్డతో ఇంటికి వచ్చేస్తుంది! ఆ దుబారా ఖర్చులకి డబ్బు కూడబెట్టుకోవాలికదూ?" అని నిష్ఠూరంగా అడిగింది.

"అవును. ఇప్పుడు వాడికీ ఇద్దరు పిల్లలు. ముందులాగ ఎంతకాలం వాడు మనకి డబ్బు పంపించగలడు, చెప్పు? సంసారం పెరిగితే వాడూ కొత్తగా ఖర్చులు భరించాలికదా? పిల్లలకి పాలూ, బట్టలూ అన్నీ కొనాలి, డబ్బు వద్దా? "

"అవును, నిజం. మరి మన అమ్మాయి కూడా అలాగే పెరుగుతోంది కదా? మనకీ కొత్త ఖర్చులు లేవా? దాని పెళ్ళికి చెయ్యాలి, నగలేవైనా కొనాలి . . . "

"అందుకు మనకి భూములూ, పంట పొలాలూ ఉన్నాయిగా? మనకది చాలు. మన అబ్బాయి ఆర్థిక స్థితి మనం గుర్తుచేసుకోవాలి. వాడు ఎంత పంపించినా అది మనకి చాలు. ఇప్పుడు తన ఇద్దరు పిల్లల చదువు, సంరక్షణ చూసుకోవాలని వాడు మనకి యాభై పంపించినా, సరే! ఏమంటావ్?"

"మరేముంది అనడానికి? కన్నతల్లి అనే దోషం తప్పిస్తే మరేం కారణమూ లేదు!" మరేం అనక మీనాక్షి రొక్కంని తీసుకొని భద్రంగా దాచిపెట్టింది.

కాని ఆమె మనసు ఆరాటం తగ్గలేదు. కొడుకుగురించి ఆవిడకి ముప్పాతిక అంగలార్పు, పావు నమ్మకం; భర్తకి ముప్పాతిక నమ్మకం, పావు అంగలార్పు.

ఆ మరుదినం నారాయణస్వామి వాసుకి మనియార్డర్ వచ్చిందని తన సంతోషం తెలియజేసారు. 'పత్రిక ఇక రాదని వసంతి బాధపడలేదు,' అనికూడా రాసారు. అలవాటుగా ఉత్తరంలో అన్ని కబుర్లు రాసినా, ఒక ముఖ్యమైన సంగతి మాత్రం అతను విడిచిపెట్టారు.

"ఏది ఎలాగున్నా మన ఇంటి అమ్మాయిని మనం ముద్దుగా పోషించాలి. దానికేం కొరతా ఉండకూడదు! పత్రిక లేకపోతే పోనీ! ఇవాళే వసంతిని రేడియో బాలానందం కార్యక్రమంలో చేర్పించండి!" అని భార్య సలహా వినగానే నారాయణస్వామి అలాగే

చేసారు. కాని దారిగురించి అతను వాసుకి ఉత్తరంలో సూచించలేదు. వాడుకగా ఇంటి కబుర్లన్నీ అబ్బాయికి ఉత్తరాల్లో తెలియజేసే తండ్రి దీనిగురించి ఏమీ ప్రస్తావించలేదు.

ఏం, ఎందుకు?

ఆ తండ్రి అవగాహనలో తన కొడుకు మనసులో కళంకం వచ్చేసిందన్న సూచన కనిపించిదేమో? అవును, అదే కారణం!

ఆ మరుదినం All India Radio సంస్థకి రాసినప్పుడు 'మన అబ్బాయికి దీనిగురించి ఒక కార్డు రాసేద్దామా?' అని అతనికీ ఆతురత కలిగింది; ఒక నిమిషం ఆలోచించారు.

"అన్నయ్యా, నా పేరు బాలానందం ప్రోగ్రాంలో చదువుతారు, విను!" అని వసంతిసే తన అన్నయ్యకి రెండు రోజులతరువాత రాయమని చెప్పాలనే ఆలోచన అతనికి తట్టగానే, తనిక రాయవద్దని అతను నిశ్చయం చేసుకున్నారు.

నాలుగు రోజులు గడిచాయి. రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒకటి All India Radio సంస్థనుంచి వచ్చింది. అది చదివి వసంతి ఆహ్లాదపడింది; వాసు ఉత్తరం చదివి ఏడ్చింది.

"నా స్నేహితుడొకడు అక్కనుంచి బదిలీ అయి ఈ ఊరుకి వస్తున్నాడు. వాడిమూలంగా మన రేడియో పంపిస్తారా?" అని వాసు రాసాడు. నారాయణస్వామి ఉలిక్కిపడ్డారు; మీనాక్షికి పట్టరాని కోపం వచ్చింది. రేడియోని పంపించకూడదని వసంతి మొండిపట్టు పట్టింది.

కాని, వేరే గతి? ఆ స్నేహితుడు ఆ మరుదినమే బయలుదేరుతున్నట్టు వార్త అందింది. మరేం ఆలోచించకుండా నారాయణస్వామి రేడియోని వాసుకి తిరిగి పంపించడానికి అన్ని ఏర్పాట్లు చేసారు.

"అది అక్కడ వాడే కొన్నాడు. 'ఇక్కడ ఇంట్లో ఉండనీ!' అని వాడే చెప్పాడు. 'వసంతికి శంగీత శిక్షణ లేదు, రేడియోలో విని అది సంగీతం నేర్చుకోవచ్చు!' అని

అన్నాడే? ఇటీవల వసంతికి కర్ణాటక సంగీతంలో ఆసక్తి ఎక్కువైందని వాడికి తెలుసుగా? మరెందుకు రేడియో పంపించమని రాసాడు?”

ఈ ప్రశ్నే పెద్దలమనుని బాధించింది; వసంతి బోరుని ఏడ్చింది.

తన తల్లిదండ్రులకి కొడుకుమీద యాతన, ఇటీవల కోపం పెరిగిందని వసంతికి తెలీదు. కాని కూతురనే జ్ఞానం వలన వాళ్ల మనోవ్యధ ఆమె కళ్ళారచూసి పరిస్థితి తెలుసుకుంది, బాధపడింది.

‘సరే, ఇక దీని పెళ్లి, అబ్బాయిల చదువుకి వాడేం సాయం చేస్తాడో ఎవరికి తెలుసు?” అనే బెంగతో మీనాక్షి నిట్టూర్పు విడిచింది.

“పాపం, నాలుగు మాసాలుగా వాసు ఏదో దురవస్థలో చిక్కుకున్నట్టు కనిపించాడు. అది ఇప్పుడే నాకు ఋజువైంది . . . అసలు రేడియో ఎందుకు తిరిగి పంపించమన్నాడో? . . . పోనీలే . . . ” అని నారాయణస్వామి తనలో చెప్పుకున్నారు.

స్వాబావంలో నారాయణస్వామి సాధువు. అతనికి కోపం వస్తే అదేం అంత త్వరలో విరక్తిగా మారుతుందా? అంటే అతను తనలో తానే ఎంత బాధపడివుండాలి!

రేడియో కలకత్తాకి పంపించడమైంది; వసంతికి బాలానందం కార్యక్రమంలో పాల్గొనే అవకాశం పోయిందన్న భావన రానూ రానూ తగ్గుతూ వచ్చింది. కాని ఆమె అనుభవించని కొరతలు ఆ తల్లిదండ్రులు గుర్తుచేసుకున్నారు. వాళ్ల మానసిక వ్యధ పోలేదు. రేడియో తిరిగి పంపించిన ఇరవైరోజుల తరువాత ఎనభై రూపాయల రొక్కం మనియార్డర్ లో వచ్చినా వాళ్ళు దాన్ని లెక్కచెయ్యలేదు; రేడియో తిరిగి తీసుకొనడంవలన అదేదో ఒక నష్టపరిహారంలాగ వాళ్ళకి అనిపించింది.

వాసు, తల్లిదండ్రులమధ్య - వారా వారం జరిగే ఉత్తరాల పరివర్తన - ఇప్పుడు నెల నెలా జరుగుతూ వచ్చింది. వాసు అనురాగంతో, క్లుప్తంగా, ఇంపుగా రాసాడు; వాళ్ళుకూడా అతనికి రాసిన ఉత్తరాల్లో రవంతైనా కోపం, కటువు లేదు. లోకంలో కొడుకు మనసు మారడం సహజమేకదా?

“‘మన అబ్బాయికి గొప్ప మనస్సుంది!’ అని మనం గర్వపడుతున్నాం, అది పొరపాటేమో?” అనే ఆ దంపతులు ఆలోచించారు. దానితోబాటు వాసుదగ్గరనుంచి మనియార్డర్ వచ్చినప్పుడెల్లా ఆ రొక్కం తీసుకోవద్దనిపిస్తుంది. కాని అదెలా సాధ్యం? కాలేజీలో చదువుతున్న ఇద్దరు అబ్బాయిలకి వాసు సాయం చేస్తున్నాడు; అదెలా నిరాకరించడానికి మనసు వస్తుంది?

ఒకరోజు . . . వీధిలో సైకిలు గంట వినిపించింది. సైకిలులో వచ్చినవాడు ఒక టెలిగ్రాం అందించాడు. .

“ఏమే?” అని నారాయణస్వామి భార్యని పిలిచారు; మీనాక్షి వచ్చింది.

“‘మన ఊరు కోవిల ప్రసాదం విభూతి, కుంకం వెంటనే పంపండి, నేను క్షేమంగా ఉన్నాను!’ అని వాసు తంతివార్త పంపించాడు!”

“అలాగా? ఎందుకు విభూతి, కుంకం?

“అదేం వాడు రాయలేదే?”

“దేవుడా . . . ఎవరికేమైనా జబ్బో, జ్వరం . . . .”

“‘నేను క్షేమంగా ఉన్నాను,’ అని రాసాడే?”

“ఒకవేళ వాడి భార్యకీ, పిల్లలకీ ఏమైనా . . . .”

“అలాగేమైనా ఉంటే వాడు తప్పక రాసివుంటాడు . . . ”

“వాడి భార్యా, పిల్లలు వచ్చినట్టుకూడా వాడు మనకి రాయలేదే? మరేం కారణమో?” అంది మీనాక్షి.

“నాకూ ఏమీ అర్థం కావటంలేదు!”

ఇంతలో వసంతి వచ్చింది. “ఏమిటమ్మా?” అని కూతురడిగిన ప్రశ్నకి జవాబు చెప్పకుండా తల్లి ఆమెకి ఆజ్ఞ ఇచ్చింది.

“వెంటనే వెళ్లి తమలపాకూ, పళ్ళూ, కొబ్బరికాయ కొని తీసుకురా . . . ఇదిగో డబ్బు . . . ”

“ఎందుకమ్మా?”

“కోవిలకి వెళ్ళాలి . . .  వెంటనే వెళ్ళు! అన్నయ్యకి  విభూతి, కుంకం  ప్రసాదం పంపాలి.”

“ఎందుకు? ముందు కటకంనుంచి కలకత్తాకి వెళ్ళినప్పుడు అడిగాడే - అలాగా?”

భార్యాభర్తలు గభీమని ఒకరినొకరు చూసుకున్నారు.

కటకంనుంచి కలకత్తాకి బదిలీ అయినప్పుడు వాసు ఇలాగే అడిగాడు; మరి ఇప్పుడు?

“విన్నారా? మీకేం  అనిపిస్తోంది?”  అని భర్తని అడిగింది మీనాక్షి.

“వాడు కొత్తగా  ఉద్యోగంలో చేరాడేమో?” అన్నారు అతను నెమ్మదిగా.

“వాడు ఎక్కడకి వెళ్ళినా మనకేం? మరింకా దూరంలో, ఉత్తరదేశం దాటి ఎక్కడికో వెళ్తున్నాడేమో, ఎవరికి తెలుసు?” అని అతని భార్య విసుగ్గుంది.

నారాయణస్వామి వసంతిని చూసారు.

“నువ్వు వెళ్ళమ్మా  . . . త్వరగా అన్నీ కొని తీసుకురా!”  అని ఆమెని పంపించేసారు.

“విను, ఎది ఏమైనా సరే, వాడు మన అబ్బాయి; వాడిని వెనకేసుకొని మనం మాటాడాలి! వసంతిని పక్కనబెట్టుకొని . . . ” అని అతను ఆరంభించగానే మీనాక్షి “అవును, వాడెది చేసినా సరే అని మీరు తలూపడం నాకు తెలుసు! వాడి పరువు కాపాడి తీరాలి, అదేకదా  మీకు ముఖ్యం!” అని భర్తని  ఎత్తిపొడిచింది.

మీనాక్షి కోవిలకి వెళ్ళింది. నారాయణస్వామి విభూతి, కుంకం చిన్న చిన్న పొట్లాలలో కట్టి, ఒక కవరులో కూర్చారు; వసంతి దాన్ని పోస్టాపీసుకి తీసుకొని వెళ్ళింది.

'మన పిల్లల సంతోషం, తృప్తి మనకి కావాలి, అంతే! మరేం వద్దు!' అనే ఒకే ఒక భావన ఆ  తల్లిదండ్రులమనసులో - కినుక, ఆవేశం మధ్య - చోటుచేసుకుంది.

కోవిల ప్రసాదంతో ఆ కవరు వెళ్ళిన మూడో రోజు వాసు ఉత్తరం వచ్చింది. రెండు ఉత్తరాలూ ఎదురెదురుగా మోదుకున్నాయేమో అనిపించింది!

"ఇవాళే నేను కొత్త ఉద్యోగంలో చేరాను. ఇప్పుడు నా జీతం మూడువందలయాభై రూపాయలు. ఇక మరేం శ్రమ లేదు. రేడియోని అమ్మేసి ఇప్పుడు కొత్తగా ఒకటి కొన్నాను. అది మీకు త్వరలోనే అక్కడ వచ్చేవారి మూలంగా పంపిస్తాను. నేనడిగిన విభూతి, కుంకం ప్రసాదం రెండుమూడు రోజుల్లో వస్తాయని ఎదురుచూస్తున్నాను. భార్యనీ, పిల్లలనీ వచ్చే నెల ఇక్కడకి పిలుచుకొని రావాలని ఆలోచిస్తున్నాను. ఈ కబుర్లు విని మీరు సంతోషిస్తారు. ఎనిమిది మాసాలుగా నిరుద్యోగిగా తహతహపడుతున్న నాకు ఇవాళే మనశ్శాంతి దొరికింది.

అలవాటుగా ఎటువంటి సామాన్య విషయమైనా సరే నేను దాచకుండా మీకు చెప్పేవాడిని. కాని ఈ సారి రహస్యంగానే నేనీపని చేసాను. నన్ను క్షమించండి!"

నారాయణస్వామి ఉత్తరం చదివారు. అతని భార్య చాలా ఎచ్చరికగా దాన్ని చదివింది; ఇద్దరి కళ్ళలోనూ ఆశ్చర్యం, సిగ్గు, సంతోషం, గర్వం, చోటుచేసుకున్నాయి.

అబ్బాయి మనసులో ఏ కళంకమూ లేదు; తమ మనసులోనే లోపం ఉందని తల్లిదండ్రులకి ఇప్పుడు తెలిసిపోయింది! ఐనా, అందువలన ఆ తల్లిదండ్రులకి కోపం రాలేదు! దానికి బదులు నమ్మకం. సహానుభూతి మొలకెత్తాయి. అబ్బాయి తోవతప్పాడని అని అపార్థం చేసుకున్న దంపతులు నిజమేమిటో అలవరించుకున్నారు; కొడుకుగురించి గర్వపడ్డారు.

"నాన్నగారూ, ఇవాళ వీధిచివరన నన్ను చూడగానే పోస్టమేన్ ఏం చేసాడో తెలుసా? చెయ్యూపి నన్ను పిలిచాడు! నేను వెళ్ళాను! నాకు పత్రిక ఇచ్చేసాడు!" అని వనంతి పరుగెత్తుకొని వచ్చి ఇంట్లో ఆ శుభవార్త చెప్పింది.

పత్రికకి కొత్తగా చందా కట్టిన తరువాత కొంచెం ఆలస్యం అవుతుందని వాసు కొని పంపించిన కడాపటి సంచిక అది.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, సెప్టెంబరు 4, 1949)**

.

# మంచి ఉపాయం!

ఉత్తరం చదివి రామస్వామి భార్యకి వార్త అందించారు.

“ఏంటీ, మళ్ళీనా?” అని జానకి అదిరిపడింది.

“అవునే, ఈ వెధవలకి మతి పోయింది! ఎందుకీ కాలేజీ చదువూ, డిగ్రీ అన్నీ? వీళ్ళకోసం నేనెందుకు నెలనెలా డబ్బు తగలపెట్టాలి?” అని అతను విసుగ్గున్నారు.

“ఏదీ, ఆ ఉత్తరం నాకివ్వండి, నేనూ చూస్తాను . . . వాడు తమిళంలో రాసాడా, లేక ఇంగ్లీషులోనా?” అని జానకి చెయి చాచింది.

“ఇంగ్లీషులోనే! అదీ నీ సుపుత్రుడు రాయలేదు, మీ అన్నయ్య కొడుకు గణి రాసాడు! అంతే, ఇక మన పరువు, ప్రతిష్ట ఏంకాను? . . . వీడి కథ అందరికీ తెలిసిపోయింది!” అని చీదరపడుతూ రామస్వామి ఆ ఉత్తరం జానకికి ఇవ్వకుండా తన కొడుకు మీదున్న కోపాన్ని భార్యమీద చూపిస్తూ దాన్ని రువ్వారు.

నేలవాలిన ఉత్తరం తీసుకొని జానకి భర్త వెనుక నడిచింది.

“ఉత్తరంలో ఏముందో చెప్పండి; నాకీ ఉత్తరం బోధపడుతుందా?”

“ఏముంది చెప్పడానికి? వీడు సత్యాగ్రహంలో చేరాడట! ఇప్పుడు అరెస్టు చేసివుంటారు! అందుకే వాడిదగ్గరనుంచి ఏ చీటీ, పత్తా లేదు! అంతా మన కర్మ!” అని అతను నెత్తిలో మెల్లగా నాలుగుసార్లు తట్టుకున్నారు.

“అయ్యయ్యో, అరెస్టు చేసివుంటారా?” అని బొబ్బలు పెడుతూ, మరేం తోచక, జానకి అక్కడున్న పొడుగాటి మేజామీద కూర్చుండిపోయింది.

“ఇక వాడు మన కొడుకు అని చెప్పుకోడానికే అవమానంగా ఉందని ఏడు! వాడు మన కొడుకని ఏడవనక్కరలేదు! ఇక మన పరువు పోయినట్టే!” అని గర్జిస్తూ రామస్వామి అక్కడనుంచి నిష్క్రమించారు.

ఒక ఐదు నిమిషాలు జానకి దిగ్భ్రాంతితో ఉన్నచోటునుంచి కదలలేదు; ఆ తర్వాత మనసుని సర్దుకొని లేచింది.

వంటగదిలోకి వెళ్లి పొయ్యని చూసింది. దానిమీదున్న పాత్రలో అన్నం పచనం చూసి పాత్రని కిందకి దింపింది. మళ్ళీ భర్తని కలుసుకొని మాటాడింది:

"నా మాట వినండి. ఏది ఎలాగున్నా వాడు మన అబ్బాయేకదా? రాజూకే ఒక ఉత్తరం రాసి అడగండి. 'సత్యాగ్రహంలో చేరవద్దు!' అని చెప్పండి. మా అన్నయ్యకీ రాయండి; గణి వాళ్ళ నాన్నగారికి తప్పక రాసివుంటాడు. మనకి రాయని కబుర్లు ఆయనకి రాసివుంటాడు. అరెస్టు ఐందా లేదా అని మనకి తెలుస్తుంది."

"హూహూం, మీ అన్నయ్యని ఎందుకు ఇందులో ఇబ్బంది పెట్టాలి? నేనది చెయ్యను!"

"సరే, అన్నయ్యకి రాయవద్దు! రాజూకే రాయండి. 'నిన్ను బతిమాలుతున్నాం' అని రాయండి . . . "

"ఈ నంగనాచి దగ్గర మనం ఎందుకు బతిమాలాడాలి? నేనలా రాయను."

"'నేను బతిమాలుతున్నాను' అని చెప్పండి. 'అమ్మ బతిమాలుతోంది' అని రాయండి."

"అదేదో నీ అబ్బాయికి నువ్వే రాసుకో! వాడి అడ్రసు నేను ఇచ్చేస్తాను. నీ గజిబిజి రాతతో వాడికి ఏం చెప్పాలో నువ్వే అవన్నీ రాసేయ్ . . . నా ఒళ్లు మండుతోంది! . . . గణి వీడిగురించి ఏం రాసాడో తెలుసా?"

"ఏమని రాసాడు?" అని జానకి ఆతురతతో అడిగింది.

"'కొన్నిరోజులుగా రాజు తన స్నేహితులతో కలిసి R.S.S. గుంపుతో తిరుగుతున్నాడు. ముందులాగ మమ్మల్ని చూడడానికి రావటం లేదు. వాడు సత్యాగ్రహంలో చేరాడా అని మాకు తెలియదు. కాలేజీ చదువు పూర్తి అవుతున్న సమయంలో దాన్ని పాడుచేసుకోవద్దు అనే ఆలోచిస్తున్నాడేమో? అదీ ఖాయంగా చెప్పలేం. గభీమని పెర్రితనం వస్తే మనం చేసేదేముంది?' అని రాసాడు. ఈ R.S.S. ఒక పెర్రి సంఘం అని నీ అబ్బాయికిమాత్రం అర్థం కాదు! పోయిన సంవత్సరమూ మనకి ఇదే బెంగ, ఇప్పుడూ అదే రోత!" అని రామస్వామి మళ్ళీ నొచ్చుకున్నారు.

"అవును. నాన్నగారిలాగే అబ్బాయికి మోటుతనం వచ్చేసింది!" అని జానకికి భర్తమీదే కోపం వచ్చింది.

"నాకొక కలం, కాగితం ఇవ్వండి. వాడు అరెస్టు ఆవడానికి ముందే నేను రాస్తాను. నేను చెప్తే వాడు తప్పకుండా వింటాడు!" అని అంది జానకి తన కోపం అణచుకొని.

"అవును, వింటాడు, వింటాడు! సరేలే, ఆ ఉత్తరంకి ఇప్పుడేం తొందరా లేదు! ముందు నా భోజనం కానీ, నేను ఆఫీసుకు వెళ్ళాలి! నువ్వు మధ్యాహ్నమంతా ఆలోచించి నీ ప్రతిభకి తగినట్టుగా వాడికి ఏం రాయాలో రాసేయ్! ఆరు గంటలు తరువాతే పోస్టాఫీసులో ఉత్తరాలు పోగుచేస్తారు, అంతకుముందు నీ ఉత్తరం ఎక్కడకీ వెళ్ళదు!" అన్నారు రామస్వామి. "ఇదిగో కలం, కాగితం!" అని చెప్పి, వాటిని మేజామీద పెట్టి, తువాలుని భుజంమీద వేసుకొని, అతను స్నానంకి సిద్ధమైయ్యారు. జానకి మరేం అనక అతని వెంట నడిచింది.

** ** **

అదే సమయంలో జానకి అన్నయ్య శేషాద్రి మనసులో వేరే ఒక గజిబిజి ఆలోచన లేచింది.

"ఏమిటే సీతా, గణి ఏం రాసాడో చూసావా? పాపం, జానకి! అది తప్పకుండా ఏం చెయ్యాలో తెలియక తికమకలాడుతుంది!" అని అతను సహానుభూతితో అన్నారు.

అసలు ఏం జరిగిందో తెలుసుకొని అతని భార్య సీతకీ జాలి కలిగింది. "పాపం, వాళ్ళకి ఎంత కష్టం! మన గణికి తెలిసినదికూడా రాజుకి తెలియకపోవటం నాకు వింతగా ఉంది! గణి వయస్సులో ఎంత చిన్నవాడు!" అని అన్న మాటల్లో ఆమెకి తన కొడుకుమీదున్న అభిమానం తెలిసింది; తన ఆడపడుచు కొడుకు కంటే గణికి గూఢమైన బుద్ధి, విశాలమైన దృక్పథం ఉన్నాయన్నమాట!

"చదువుకుంటున్న రోజుల్లో వీళ్ళకి ఇంత తీవ్రంగా పాలిటిక్స్ తో ఏం పని? గణి చాలా హెచ్చరికతో రాసాడు. 'రాజు ఇలా R.S.S. గుంపుతో కలిసి తిరుగుతున్నాడు; ఇక సత్యాగ్రహంలో చేరాడంటే, అంతే! భవిష్యత్తు వ్యర్థం! ఆఖరి సంవత్సరం ఇలా చదువు పాడుచేసుకోవాలా?' అని గణికి బాధగా ఉంది . . . రామస్వామికీ ఉత్తరం రాసాడట. నేనూ రాజుకి రాసి బుద్ధి చెప్పాలంటున్నాడు," అని అంటూ రామస్వామి ఒక చిరునవ్వు నవ్వారు.

"మీరూ రాయండి. పాపం, మన అబ్బాయిగాని ఇలావుంటే మనం ఎలా బాధపడతాం? అలాగేకదా జానకీకి, ఆయనకి ఉంటుంది!" అంది సీత.

"ఏమిటమ్మా?" అని అడుగుతూ పక్కనే వచ్చి నిలబడింది వాళ్ళ కొమార్తె ఉమా.

"నీ బావ రాజుని అరెస్టు చేస్తారని అంటున్నారు; అన్నయ్య రాసాడు" అని తల్లి చెప్పింది.

"అయ్యయ్యో, ఏదీ ఆ ఉత్తరం?" అని ఆతురతతో అడిగింది ఉమా. దానికి ఇంకా పదమూడు నిండలేదు. "పాపం, బావ! ఇక జైలుకి వెళ్లకతప్పదు! " అని ఆమెకి జాలి కలిగింది.

తల్లి ఉమాని వినోదంగా చూసింది: "వారం, పదిరోజుల్లో చెరనుండి అందరినీ విడుదల చేసేస్తారు!" అని చెప్పింది.

"ఒక వారం అని ఎవరన్నారు? అరెస్టుచేసి, అందరినీ లారీలో తీసుకొనివెళ్ళి, ఊరి సరిహద్దులో వదిలేస్తారట! మరుదినం అందరూ మళ్ళీ సత్యాగ్రహంకి హాజరవుతారు!" అని అంటూ శేషాద్రి నవ్వారు. సీతా, ఉమా కూడా అతనితోబాటు నవ్వారు.

"ఒరేయ్, మన రాజు బావని అరెస్టు చేస్తారట!" అని ఉమా తన తమ్ముడికీ చెప్పింది; అది తన గదిలో ఏదో ఆలోచిస్తున్న ఆమె తండ్రి విన్నారు.

"ఉమా, ఇలా రా!" అని కూతుర్ని పిలిచారు; ఉమా అతన్ని చేరుకుంది.

"విను, నాకు నీ సాయం కావాలి! బావ జైలుకి వెళ్ళకుండా మనం ఒక పని చేద్దాం, ఏమంటావ్?"

ఉమాకి చెప్పలేనంత ఉత్సాహం అని వేరే చెప్పాలా?

"రా, ఈ కుర్చీలో కూర్చో . . . విను, నేను చెప్పేది రాయ్," అని అంటూ అతను కలం, కాగితం ఆమెకి అందించారు.

ఊరు పేరూ, తేదీ గుర్తించమన్నారు; ఉమా బావకి ఉత్తరం రాయాలి!

'నాన్నగారి ఆదేశం, కూతురు దాన్ని రాయడం - ఇదేమో వింతగా ఉందే!' అనే భావనతో సీత ఆ గదికి వచ్చింది.

ఆమె అడిగిన ప్రశ్నకి శేషాద్రి, "కొంచెం ఆగు. నా ఆలోచన ఏమిటో చెప్తాను!" అని అన్నారు.

"ఇదేం నాటకం? ఉమా ఏమిటి రాస్తోంది?" అని తల్లికి ఆతురత.

శేషాద్రి ఒక్కొక్క మాట మెల్లగా వల్లించుకుంటూ వెళ్ళారు; ఉమా ఉత్తరం అలాగే సాగింది.

“బావా, నువ్వు సెలవులకి మా ఇంటికి వచ్చినది నీకు గుర్తుందా? ఆ తరువాత మేం నిన్ను చూడనేలేదు! ఇప్పుడు జైలుకి వెళ్తే మమ్మల్ని, నన్నుకూడా  పూర్తిగా మరిచిపోతావేమో? నిన్ను అరెస్టు చేస్తారని విని నాకు చాలా బాధగా ఉంది, ఏడవాలనిపిస్తోంది.”

ఈ ఆఖరి వాక్యం విని సీత ఉలిక్కిపడింది. భర్త మనసులో ఏముందని?

“ఇదేంటి? మీరు అమ్మాయిని ఏమిటి రాయమంటున్నారు?”

“ఉత్తరం.”

“అవును, ఉత్తరం, నిజం. కాని ఎటువంటి ఉత్తరం?” అని సీత కోపంతో అడిగింది.

“ఉమా బావకి రాసే ఉత్తరం!” అని అతను నవ్వుతూ అన్నారు; అతని నవ్వు చూసి సీతకి కోపం ఇంకా ఎక్కువైంది.

“బాగుంది! ఏమీ తెలియని అమ్మాయిని ఒక కీలుబొమ్మగా  . . . . ఏదీ, ఆ ఉత్తరం ఇలా ఇవ్వండి . . . దాన్ని చింపి పారేస్తాను!” అని అంటూ సీత మేజా దగ్గరికి వచ్చింది.

శేషాద్రి తటాలున ఉత్తరాన్ని తీసుకొని మేజాబల్ల డ్రాయలులో దాచేసి, దానిమీద వాలారు.

“రావే, లేచి రావే!” అని అంది సీత, అమ్మాయిని చూస్తూ.

“నువ్వుండమ్మా . . . లేదు, సరే . . . వెళ్ళాలంటే వెళ్ళు! . . . నువ్విప్పుడు రాసినది చాలు. నేను నీ సంతకం పెట్టి పోస్ట్ చేసేస్తాను . . . నీ చేతిరాతలాగే ఉంటుంది నా సంతకం!” అని అన్నారు శేషాద్రి, కొంటె నవ్వుతో.

“బాగుంది! ఒక తప్పు చేస్తే చాలదన్నమాట, ఫోర్జరీ ఒక్కటే బాకి! సరే, ఇక మీ ఇష్టం! ఉమావే సంతకం పెట్టనీ! ఏం కొంపా మునిగిపోదు!” అని కోపంతో విసుగ్గుంటూ సీత వంటగదికి వెళ్ళిపోయింది; కాని మనసులో ఆరాటం తగ్గలేదు. తండ్రి, కూతుర్ల సంభాషణ వింటూనేవుంది. శేషాద్రి ఉమాకి ఇంకో రెండుమూడు

వాక్యాలు వల్లించినతరువాత  ఆమెనే ఉత్తరంలో సంతకం పెట్టమన్నారని గమనించింది.

అమ్మాయి సంతకం పెట్టినతరువాత "ఉమా, ఇక బావ నిన్నెప్పుడూ మరిచిపోడు!" అని భర్త అన్న మాటలు సీత భరించలేకపోయింది; గబగబమని వచ్చి మళ్ళీ భర్తతో జగడమాడింది.

"ఇదేంటి? మీ ధోరణి నాకు నచ్చనేలేదు!"

"గాంధీజీగారి ధోరణి నచ్చకపోవడంవలనే R.S.S. అనే విపరీత సంఘం వచ్చింది!" అని శాంతంగా అన్నారు శేషాద్రి.

"గాంధీజీ ఏమీ తెలియని అమ్మాయిని ఇలాగే ఉత్తరం రాయమని ప్రేరేపించారు కాబోలు! ఇదేనా మీరు చేస్తున్న సత్యాన్వేషణ? మీరే తిన్నగా మీ మేనల్లుడికి ఒక ఉత్తరం రాసివుంటే ఎంత బాగున్ను? ఇలాంటి . . . "

'ప్రేమ లేఖ!' అని అనాలనుకుంది; మరేం అనక ఊరుకుంది.

"ఇలాంటి చిన్న పిల్ల రాస్తేనే రాజు వింటాడు!" అన్నారు శేషాద్రి చిరునవ్వుతో.

'ఉమా బావకి రాసినది ప్రేమానురాగాలు పంపే సందేశం!' అని సూటిగా చెప్పడానికి అతనూ జంకారు.

అదిగాని ఉమా గ్రహించిందంటే "అయ్యయ్యో, నాన్నగారూ, వద్దు!, వద్దు!, దాన్ని చింపేయండి!" అని ఒక గెంతు గెంతివుంటుంది. పదిమూడేళ్ళ బాలికకి ప్రేమానురాగాలమధ్యవున్న సూక్ష్మభేధం తెలియనప్పుడు - ఆమె భావమీదున్న తనకున్న ఆపేక్ష ఎలా చూపాలో - అలాగే అతనికి రాయాలని శేషాద్రి ఉద్దేశం. ప్రేమ అంటే ఏమిటని ఉమాకి వివరించకుండా ఒక బాలికలాగే ఆమె తన మనసులోని ఆకాంక్ష బావకి తెలియజేయాలని అతని పధకం. అది ఉమా ఊహించనేలేదే! తను రాసినది 'ప్రేమలేఖ' అని ఆ బాలికకి తెలియదు!

** ** **

ఆ మరుదినం శేషాద్రికి ఒక ఉత్తరం వచ్చింది; రాసినది జానకి.

"అన్నయ్యా, నీకేమైనా వివరాలు తెలుసా? నాకేం చెయ్యాలో అర్థం కావటం లేదు.  నేను రాజుకి రాసాను. నువ్వూ వాడికి బుద్ధి చెప్పు!" అని ఆవిడ రాసింది.

అది చదివి శేషాద్రి విస్తుపోయారు.

‘ఇవాళ జానకి ఉత్తరం, ఉమా ఉత్తరం రెండూ ఒకేసారి రాజుకి అందుతాయి. ఏది వాడి మనసు మార్చుతుంది?’ అనే ఆలోచనలో అతను పడ్డారు.

రాజు మనసు తప్పకుండా మారుతుందని అతని నమ్మకం. కాని ‘ఈ రెండు ఉత్తరాలూ - ముందూ, వెనుకా - చేరితే వాడి మనసుని ఏ ఉత్తరం మార్చిందని మనం ఎలాగ నిర్ణయించడం?’ అని అతను కలవరపడ్డారు.

అతని బాధ చూసి సీత నవ్వింది: “బాగుంది మీ వాలకం! రాజు మనసు మారితే చాలదా మీకు? దేవుడా, ఇతను చెప్పి ఉమా రాసిన ఉత్తరం రాజుకి అందకుండా చెయ్! తల్లి రాసిన ఉత్తరం రాజు చదివి వాడు  మనసు మారాలి, ఇదే నా ప్రార్థన!’ అని మనసులో చెప్పుకుంది; నవ్వుకుంది.

“‘ఉమా రాసిన ఉత్తరం దారి తప్పాలి!’ అని నేను వేడుకున్నాను. అలాగైతే రాజు మనసుని ఏది మార్చిందని మనకి అర్థమవుతుందికదా?” అని సీత భర్తకి చెప్పింది.

కాని ఆవిడ మనసులో ‘మన ఉమా సాధు, దానికేం తెలీదు. అది ఇలాంటి ప్రేమలేఖ రాసిందని నలగురికి తెలిస్తే ఎంత అవమానం!’ అని బెంగపెట్టుకుందని ఎవరికి తెలుసు?

అది తెలియక శేషాద్రి మాటాడారు: “బాగుందే నీ వెర్రితనం! నీ మొగుడుని వెనకేసుకొని మాటాడాలని నీకనిపించలేదా! ‘జానకి రాసిన ఉత్తరం తప్పాలి!’ అని ఎందుకు వేడుకోలేదు? ఎగుడుదిగుడుగా ఉంది నీ బుద్ధి!” అని అతను భార్యని ఎగతాళి చేసారు.

** ** **

రెండు కుటుంబాలు నాలుగు రోజులు కాచుకున్నారు. ఆఖరికి రాజు ఉత్తరం చూసి వాళ్ళ మనసులోని భారం తగ్గింది.

“సంఘంలో చేరాలని నేను నిర్ణయించిన సమయంలో నా మనసు మార్చుకున్నాను. సత్యాగ్రహంలో చేరితే నా మనసు ‘గజిబిజిగా’ ఉందని కొందరు అంటున్నారు. చేరకపోతే ‘గజిబిజిగా’ ఉందని మరికొందరు అంటున్నారు. కాని అందరూ నా మేలు కోరేవారనే కారణంవలన నేను వాళ్ళ చీవాట్లు భరించాను. ఈ

ఆఖరి సంవత్సరం నా చదువుని పాడుచేసుకొని నన్ను ఆదరించే పెద్దల మనసు నొప్పించకూడదని నిశ్చయించాను."

ఇదే రాజు రాసిన మారుమాట. తల్లిదండ్రులకీ, మేనమామకి ఒకటే సందేశం.

జానకి రాత గిలికిరాతే, గజిబిజిగా ఉంటుంది; తమిళంలో రాజుకి ఆవిడ రాసిన ఉత్తరంలో  గ్రాంధిక బాష. గ్రామ్య బాష రెండూ కలిసి ఉన్నాయి. కాని అబ్బాయి తల్లిని వ్యతిరేకంగా అడగలేనట్టు ఆవిడ చాలా వివరంగా, గూఢంగా తన భావనలు అందులో పదిలం చేసారు. తన బిడ్డని లాలించే ధోరణిలో ఆవిడ మాటాడారు. అందువలనే రాజు మనసు మారిందా?

"నాకు తెలుసు,  వాడు అమ్మ బతిమాలుతే వింటాడు అని. తల్లి మనసే వాడి మనసుని సౌమ్యం చేస్తుందని ఊహించి నేను ఖచ్చితంగా రాయనని చెప్పేసాను! నా మొండితనం వలనే, నా భార్య తన వంకరటింకరరాత లెక్కచెయ్యక. వాడికి ఉత్తరం రాసేసింది; దాని కోరికా నిరవేరింది!" అని రామస్వామి శేషాద్రికి రాసారు.

పాపం, ఆఖరికి శేషాద్రికి నిరాశే మిగిలింది!

'వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి!' అని పెద్దలు అన్నారు. రాజుని వశపరచుకున్న సంఘం పిచ్చి పోవాలని శేషాద్రి వాడి మనసులో ప్రేమని ప్రవేశబెట్టారు. ఇక తన కూతురుకి వరుడు చూసే అగత్యం ఉండదని అతను నమ్మారు. ఐతే అది సాధ్యం కాదన్నమాట!

ఉమా ఉత్తరం చదివి తన మనసు మారిందని రాజు శేషాద్రికి రాయలేదే? అవును, ఎలా రాస్తాడు? ఆ ఉత్తరంలో ఉమా దాన్ని తను రహస్యంగా రాస్తున్నట్టు తెలియజేసిందికదా? మరి శేషాద్రికి రాసిన ఉత్తరంలో రాజు ఉమా గురించి ఎందుకు సూచిస్తాడు?

శేషాద్రి తపన గురించి సీత బాధపడలేదు. ఉమాకీ ఏమీ తెలీదు. కాని ఆ మరువారం . . .

"నాన్నగారూ!" అని ఉమా పరుగెత్తుకొని వచ్చింది. "బావ నాకు రాసాడు!" అని ఉత్సాహంతో తన చెయిలోని కార్డు చూపించింది.


“నా చదువు పూర్తి అయి వచ్చినప్పుడు నేను నీకు ఒక పెట్టెనిండా బొమ్మలు కొని తీసుకురావాలవుకున్నాను. కాని ఇప్పుడు నాకు వేరే ఆలోచన తట్టింది! నీకొక మంచి వోణీ కొనాలని ఉంది. ఉమా, ఏమంటావ్?

రాజు ఉమాకి ఎందుకు ఇలాంటి ఉత్తరం రాయాలి? కారణమేమిటో తెలిసిపోయింది.

ఆటంకంగా ఉన్న సంఘం పోయింది! కాని రాజు, ఉమా ఇద్దరిమధ్యా వికసించిన స్నేహాన్ని పెంచి, పోషించడం పెద్దల బాధ్యత!

********

**(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, ఫిబ్రవరి 13, 1949)**



# క్రైస్తు జన్మదినం

డాబా మీద విహారం చేస్తున్న తన భర్త దడదడమని మెట్లుదిగివచ్చి, వీధిలోకి పరుగెత్తడం లక్ష్మి గమనించింది; ఎవరితో మాటాడాలని అతనంత గాబరా పడుతున్నారు?

ఇంట్లోకి పరుగెత్తుకొని వచ్చిన రమణి వివరించాడు: “అమ్మా, నాన్నగారు ఫాదర్ తో మాటాడుతున్నారు!” అంతే, మళ్ళీ వాడు వీధిలోకి పారిపోయాడు!

కొన్నిరోజులుగా తమ ఇంటి పొరుగు కాంపవుండుని అంటుకున్న క్రైస్తవ దేవాలయంలో జరుగుతున్న హడావిడిని లక్ష్మి చూస్తూనేవుంది. రెండు రోజులుగా కొత్త కొత్తగా క్రైస్తవుల ముఖాలు  - ఆడా, మగా - కనిపించడంచూసి భర్త సుందరంకూడా ‘ఇదేమో కొత్త పండుగ కాబోలు!’ అని మాటిమాటికి తనకుతానే అడగడం అలవాటు చేసుకున్నారు.

‘అందుకే ఇతను ఇప్పుడిలా తొందరపడుతున్నారేమో?’ అని లక్ష్మికి ఇప్పుడు ఆశ్చర్యం కలిగింది.

“చర్చిలో సంబరాలా?” అని లక్ష్మి భర్తని అడగాలనుకుంది. కాని అతను చెయిలో ఒక ఉత్తరంతో కనిపించగానే “ఏముంది ఉత్తరంలో?” అని అడిగేసింది.

“నాకున్న భయం చూస్తే నాకే నవ్వాలనిపిస్తోంది!” అన్నారు సుందరం.

“‘పొరుగింటి దేవాలయంలో ఏం జరుగుతుందో?’ అని మీకు బెంగగా ఉంది. మరి నా సంగతో? మనింటికి వచ్చే క్రైస్తవ అతిథులకి నేను చేయబోయే సేవగురించే నా ఆరాటం అంతా!” అని అంది లక్ష్మి.

భార్య పడుతున్న బాధ అతనికి అర్థమైంది. లక్ష్మి అతిథి సత్కారం గురించి అందరికీ తెలుసుగా? అవును, ఎంతమంది ఆవిడ సేవని పొగడారని వేరే చెప్పాలా? పాపం, ఇప్పుడు రాబోయే అతిథులగురించే  ఆమె కంగారు పడుతోంది!

వచ్చేది మిస్టర్ ఏడమ్స్ - అతని కుటుంబ సభ్యులు - మొత్తం ఐదుగురే! కాని వాళ్ళందరి అభిరుచికి తగినట్టుగా తను అన్నీ వండాలే! అది సాధ్యమా? సాధ్యం కాదని లక్ష్మి ఉద్దేశం.

ఇంతకుముందు ఒకసారి మిస్టర్ ఎడమ్స్ మాత్రం అతిథిగా వచ్చినప్పుడు 'అతనికి మన భోజనం, పరామరిక - ఇవేం సరిపోవు!' అని లక్ష్మి తెలుసుకుంది. మరిప్పుడు అతనూ, అతని కుటుంబమూ వస్తున్నారు! కిందపడి దెబ్బతిన్న పిల్ల తిట్లుకూడా అనుభవించినట్టు లక్ష్మి బాధపడింది.

"అసలు మనింట్లో అతిథులుగా ఉంటే వాళ్ళకేం లాభం, చెప్పండి! ఆ రోజు అతను మనింట్లో భోజనం చేసి పడిన అవస్థ చూసి నేనెలా సహింపలేకపోయాను! అతనికి కడుపు నిండనేలేదు, మనకీ నిరాశ! మరెందుకీ తృప్తిలేని భోజనం? వాళ్లని చర్చిలోనే దిగమని చెప్పండి!" అని లక్ష్మి వాదించింది.

కాని ఆఖరికి సుందరం పక్షమే నెగ్గింది; ముఖ్యంగా పిల్లలూ అతన్ని వెనకేసుకొని మాటాడారు; ఆఖరికి లక్ష్మి ఒప్పుకుంది.

'సరే, వాళ్ళు రావడం  మనం ఎప్పుడూ వద్దనం. మనకి సాధ్యమైనంతవరకూ అన్నీ చేద్దాం. పళ్లూ, బిస్కట్లూ కొందాం. తిండి మాత్రం తృప్తిగా ఉంటే అతిథులకి చాలా? సహజంగా మనం నవ్వుతూ మెలిగితే వాళ్ళూ సంతోషిస్తారు!' అని లక్ష్మి తనలో చెప్పుకుంది.

"లక్ష్మి, నువ్వూ వచ్చి ఈ అలంకారాలన్నీ చూడు!" అని సుందరం భార్యని ప్రోత్సాహించారు. పిల్లలు నలుగురూ నాన్నగారితో డాబాలో నిలబడి పొరుగింటి క్రైస్తవ దేవాలయంని చూసారు; లక్ష్మికూడా వెళ్లి వాళ్ళని కలుసుకుంది.

'మిస్సస్ ఏడమ్స్ ఎలాంటి మనిషి?' అనే ప్రశ్నకూడా ఆమెలో లేచింది.

'ఆవిడకి మనింటికి రావాలని ఉందంటే, ఆమెలో తప్పకుండా సహజమైన స్వభావం ఉంటుంది!' అనే నమ్మకం లక్ష్మికి కలిగింది.

ఆఖరికి ఒకరోజు మిస్సస్ ఐడా ఏడమ్స్  వచ్చనే వచ్చారు.

నిశ్చలమైన ఆకారం. మొహంలో మంచి కళ. ఎది చూసినా ఆ కళ్ళలో శ్రద్ధ. ఆవిడ ఒక నడివయస్సు స్త్రీ - ఇంచుమించు లక్ష్మిలాగే. నిరాండంబరమైన దుస్తులు, స్వల్ప నగలతో ఆవిడ దర్శనమిచ్చారు. నెత్తిలో బొట్టు లేకపోడం, ఆ స్వల్ప నగలు చూసి ఆవిడ ఒక క్రైస్తవ స్త్రీ అని ఎవరైనా ఊహించగలరు. లేకపోతే ఆవిడగురించి ప్రత్యేకంగా చెప్పడానికి ఏమీ లేదు. 'ఎందుకురా నేను ఆమెగురించి బెంగ పెట్టుకున్నాను?' అని

లక్ష్మి బాధపడింది. అవును, ఐడాని చూసిన ఆ క్షణంలో తన భార్య మనసు ఎలా మారిందని గ్రహించి సుందరంకూడా విస్తుబోయారు. లక్ష్మి ఉత్తికే కల్పించుకున్న దోషాలు, అవినీతులు గభీమని ఎలా మాయమయ్యాయి? మనసులోని సూక్ష్మభేదం చాలా చురుకుగా పని చేస్తుందని అతనికి మెల్లగా అర్థమైంది.

"ఏమే లక్ష్మి, 'వాళ్ళకి మన భోజనం రుచిగా ఉండదేమో?' అని నువ్వు తపించిపోయావ్. కాని ఇప్పుడు వాళ్ళు 'మేం చర్చ్ లో భోంచేస్తాం!' అంటే "వద్దు, మా ఇంట్లోనే మీ లంచ్!' అని ఎందుకు నొక్కిచెప్పావ్?" అని సుందరం అడిగారు. అతిథులు ప్రాతఃకాల భోజనం, ప్రార్థనకోసం దేవాలయంకి వెళ్ళినతరువాత అతను భార్యని అడిగారు.

"బాగుంది! మనింటికి అతిథులుగా వచ్చి వేరే చోట భోజనం అంటే నాకు తలవంపు కాదా?" అని లక్ష్మి జవాబు చెప్పింది.

"అతను చెప్పారుగా? వాళ్ళకి చర్చ్ లోనే బస ఏర్పాటు చేసారు; కాని అతని భార్యకి మనిల్లంటే ఇష్టం. పూజకీ, భోజనంకి అక్కడకి వెళ్ళితీరాలి, అది తమ ధర్మం అని అతను నాకు చెప్పారు."

అవునని, ఐడా తనకీ అలాగే చెప్పిందని లక్ష్మి ఒప్పుకుంది. ఏడమ్స్ దంపతులున్న కాలనీలో అందరూ క్రైస్తవులు అని, ఇక హిందువులతో మెలగాలనే కోరిక ఐడాకి ఉందని తెలుసుకొని లక్ష్మి ఆవిడని మెచ్చుకుంది.

"వాళ్లు కనీసం మనింట్లో టిఫనుకూడా తినకపోతే నేను ఊరుకుంటానా?"

"అసలు నీ మనసు మారడం నాకు వింతగానే ఉంది - మనం కథల్లో చదువుతున్నట్టు . . . " అన్నారు, సుందరం.

"నాకేం పగా, ద్వేషమా - మనిషి మారడానికి? ముందు కొంచెం గాబరా పడ్డాను, నిజం . . . అంతే!"

"సరేలే . . . టిఫనుతో Fruit Salad చేసేయ్!" అన్నారు సుందరం, నవ్వుతూ.

"ఒకే పండుతో Salad చెయ్యడం ఎలాగ? దానికి రకరకాల పళ్ళు -నాలుగైదైనా కావాలి! అవన్నీ కొనడం ఎలాగ? ఇదుగో, ఇదే నా Fruit Salad!" అని లక్ష్మి చూపించింది.

ఇటీవల తన భార్య మనసు మారిన విచిత్రం గురించి సుందరం ఇంకా ఆలోచిస్తూనేవున్నారు; దానిగురించి మిస్సస్ ఏడమ్స్ కి చెప్పాలని తనకి ఆతురతగా ఉందని అన్నారు.

"బాగుంది! నేను చెప్పినవన్నీ మీరేం వాళ్ళకి చెప్పనక్కరలేదు!" అని లక్ష్మి భర్తని హెచ్చరించింది.

"కావాలంటే మాటవరసకి 'అన్ని మతాల్లోవున్న మంచి గుణాలని మనం కలుపుకుంటే ఆదొక Fruit Salad లాగ ఉంటుంది!' అని మీరు అనవచ్చుకదా? ఈ రోజుల్లో భిన్న మతాల్లో చెందినవారిద్దరి సంభాషణ అలాగే ఉండాలి. నావంతుకు నేను Fruit Salad చేస్తాను, కాని నన్ను మీ చర్చలో లాగ్గండి! అవును, నాగురించి అతనితో గొప్పగా ఏమీ అనవద్దు! అతనూ తన భార్యగురించి మనకేం చెప్పలేదు! . . . "

మధ్యాహ్నం సమయంలో ఏడమ్స్ దంపతులు ఇంటికి తిరిగివచ్చారు; బాగా పరిచయంవున్న స్నేహితులని కలుసుకున్న విధంగా సుందరం కుటుంబ సభ్యులు వాళ్ళతో చనువుతో మెలిగారు.

మిస్టర్ ఏడమ్స్ మాత్రం విశ్రాంతికని కొంతసేపు నిద్రపోయారు; సుందరం కూతురు ఇందిర తన వయస్సుకి యీడైన గ్రేస్ తో పిచ్చాపాటీ ఆరంభించింది. ఇక రమణి, ఉమా మైకేల్ అనే వాళ్ళ పిల్లవాడిని మూడు చక్రాల సైకిలు, కొయ్య గుర్రంతో ఆటలాడాలని పిలిచారు; మూడేళ్ళ ఏడమ్స్ పాప తల్లిపక్కనే నిద్రపోయింది. లక్ష్మి పాప - ఉయ్యాలలో నిద్రపోయింది.

"తల్లిపక్కనే నిద్రపోవాలన్నమాట!" అని లక్ష్మి అంటూ "చూసారా, నా దగ్గర రావడానికి మీ పాపకి ఎంత భయం!" అని నవ్వింది.

"మా పాపకూడా ఉయ్యాలలో నిద్రపోతే మీకు తృప్తి, అవునా? అది నాకు బోధపడింది. కాని దానికేం తెలుసు, చెప్పండి!" అని అంది ఐడా.

అసలు అన్ని మతాలూ మనకి చెప్పే సందేశం ఏమిటి? ప్రజలందరూ చిన్నా పెద్దా, పేదా గొప్పా అనే భేదం లేకుండా మెలగాలని దేవుని పథకం. కాని లోకంలో అదెలా సాధ్యం? కొత్త జాగా, కొత్త మనుషులు. పాప తల్లిపక్కనే నిద్రపోయింది. కాని ఆ బిడ్డమూలంగా లక్ష్మి, ఐడా మధ్య స్నేహం ఇంకా తీవ్రంగా దృఢమైంది! ఈ ప్రపంచంలో

మనం చూసే విస్తారమైన హెచ్చుతగ్గులవలనే సాహోర్ధం పెరగడం జరుగుతోంది. లక్ష్మి, ఐడా తమ పాపలకంటే సుకుమారంగా, చనువుతో మెలగారు.

గ్రేస్ పరుగెత్తుకుంటూ వచ్చి తల్లికి చెప్పింది: “అమ్మా, అమ్మా, ఇది విను! ఇందిర నాకు చెప్పింది. ఇప్పుడు ఎలిజబెత్ రాణికి[1] అబ్బాయి పుట్టాడే, అదెవరో తెలుసా? మన గాంధీగారట! ‘ఇందియా దేశం నాకే సొంతం!’ అని మళ్ళీ మన దేశం ఆంగ్లేయులకి అప్పగించడానికి అతను పుట్టారని అంటోంది!” గ్రేస్ వెనకనే వస్తున్న ఇందిర పెద్దలు ఏమీ అర్ధంకాకుండా గాబరా పడుతూంటే, “అవును, నేను అదే విన్నాను . . . మా స్కూల్లో టీచర్లు మాటాడుకున్నారు . . . ఏదో అంచనా వేసుకొని జోస్యంలాగ చెప్పుకున్నారు! ” అని ఆమె గొణికే మాటలు వినిపించాయి.

“ఎవరి జోస్యం అది, ఎవరికా పిచ్చి?” అని లక్ష్మి కోపంతో అడిగింది. “మీ టీచర్ల మెదడ్లు మహా జోరుగా పనిచేస్తున్నాయన్నమాట!” అని ఎగతాళి చేసింది.

“అదేమో నాకు తెలీదు. గాంధీగారు పోయిన తరువాత ఈ రాజకుమార్తె కడుపులో మళ్లీ పుట్టారట! అతని చావుకీ, ఈ బిడ్డ జన్మకీ సంబంధం ఉందని అంటున్నారు!”

ఇందిర తటాపటాయించుతూనే మాటాడింది.

“మాకసలు  మా టీచర్ల తెలివితేటలు లేవు! . . . నువ్వు మరేం వాగవద్దు,  నోరు మూసుకో! . . . విన్నారా, గాంధీగారి గురించి వీళ్ళ స్కూల్లో ఈ గుసగుసలు!” అని సగం నవ్వుతూ, సగం చిరాకు పడుతూ లక్ష్మి కూతుర్ని, ఐడాని మళ్ళీమళ్ళీ తిరిగి చూసింది.

“‘మనకి దొరికిన స్వతంత్రం స్థిరంగా ఉంటుందా?’ అని  మనకి చాలా బెంగగా ఉందికదా? మళ్ళీ మన దేశం ఆంగ్లేయుల అధికారంలో పడకూడదనే మన భయంకీ, ఈ గాలిమాటలకీ ఎంత మంచి పొత్తు ఉందో చూసారా? స్కూల్లోనే ఇటువంటి కొత్తకొత్త ఆలోచనలు లేస్తాయి!” అని ఐడా, లక్ష్మి పడుతున్న నిరాశని పోగొట్టాలని ఊరడించింది.

“అవును. నిజం! ఈ కల్పనలన్నీ ఎంత చోద్యంగా ఉన్నాయి! ఇంకొక వింత, వినండి! గాంధీగారు పోయి ఎన్ని మాసాలయ్యాయి? మరి ఈ నవంబరులో

---

[1] ఆమె అంటున్నది ఫిబ్రవరి, 1952 పదవికి వచ్చిన ఎలిజబెత్ రాణి II గురించి

రాజకుమారుడు పుట్టినరోజు చూస్తే లెక్క ఎంత సరిగ్గా ఉందో చూసారా! 'మంచి కల్పన!' అని ఒప్పుకోవలసిందే!" అని లక్ష్మి ఆశ్చర్యపడింది.

ఐడా వేళ్ళతో లెక్కబెట్టింది: "అవును, మీరన్నది నిజం!"

"మన టీచర్లూ ధీమంతులే! మన పన్నేండేళ్ళ అమ్మాయికే వాళ్ళు ఏమంటున్నారో సరిగ్గా బోధపడలేదు!" అని అంటూ లక్ష్మి నవ్వింది.

"పాపం, ఆమెకెలా తెలుసు?" అంది ఐడా; లక్ష్మి నవ్వడం ఆపింది.

"ఇవన్నీ తలచుకుంటే వింతగా ఉంది. అసలు ఇందిర చెప్పినది విన్నగానే గాంధీగారు గురించి ఎవరో అవకతవకగా మాటాడుకున్నారని నాకు కోపం వచ్చింది; ఇప్పుడు అతను మనకందరికీ దేవుడని మరిచిపోయి అతను మళ్ళీ పుట్టి, మన దేశంకి విరోధిగా మారుతారని అంటే అది ఎంత అశ్లీలమైన చేష్ట! ఆ అసభ్యత భరించడం ఎలాగ? అలా ఎవరైనా వాగుతే అది అపచారం కాదా?"

ఇందిర తటాలున లేచింది. "గ్రేస్, రండి, మనం వెళ్దాం! నేనేదో సరదాకి అన్నమాటలు విని వీళ్ళకి ఎంత కోపమో చూసారా? వీళ్ళకి మాత్రం గాంధీ అంటే అంత అభిమానం కాబోలు!" అని విసుగ్గుంటూ గ్రేస్ తో నిష్క్రమించింది. ఇతర మతాల్లో కనిపించే విలువలు, సిద్ధాంతాలు, ఆచారాలు, నమ్మకాలు - వీటిగురించి - తన తల్లికి ఎటువంటి ఆలోచనా లేదేమో అని ఆమెకు అనిపించింది.

"అవును, నిజం! ఇందిర నాన్నగారు మనసులో గాంధీగారు ఒక దైవం; అతను రోజూ గాంధీపటంకి పూలదండతో పూజిస్తున్నారు. మరి తన కూతురు గాంధీకి పునర్జన్మ ఉందని వాదిస్తే అతనెలా ఊరుకుంటారు?" అని లక్ష్మి అడిగింది.

ఐడా అడిగింది: "అంటే గాంధీగారికి మాత్రం పునర్జన్మ లేదా? మరి గతించిన ఇతరుల గురించి మీరు ఏమంటారు?"

"లేదని ఎవరన్నారు? జననం, మరణం - అనేది ఒక కాలచక్రంలాగ ఇతరులకి పనిచేస్తుంది! మహాత్ములకే పునర్జన్మ లేదు . . . 'ఇక నాకు జన్మ వద్దు, మోక్షమే కావాలి!' అనేకదా మనం దేవున్ని వేడుకుంటున్నాం?"

"అలాగా? అదా మీ ప్రార్ధన?"

"అవును. మరి, మీరో?"

"మా శాస్త్రంలో అలాగ లేదు. గతించినవారందరూ దేవుని ఆశ్రయం చేరుకుంటారు. ప్రతీ జీవికి ఒకే ఒక జననం; తరువాత దేవునితో ఐక్యం - అదే మా నమ్మకం!"

"అదేనా మీ బైబిల్ చెప్తోంది?"

"అవును."

"ఏది ఎలాగున్నా ఆత్మని సరిదిద్దుకోవాలనే శాస్త్రం మనకి చెప్తోంది. గడచిపోయిన ప్రాణం దేవుడిసే చేరుకుందంటే అందులోనూ ఒక ఓదార్పు ఉంది. ఆ ప్రాణం భూలోకంలో ఎక్కడో ఒక చోటకి మళ్ళీ తిరిగివచ్చి ఎవరింటిలోనో మెలుగుతుందని మనం కల్పించుకుంటే మనస్సుకి ఎంత హాయిగా ఉంది!"

"అవును."

"మా ఇంటిలో ఆవుకి మగ దూడ పుట్టింది; దానికి ముందురోజు పాలవాడి అబ్బాయి పోయాడు. 'నీ అబ్బాయే మా ఇంటిలో ఉన్నాడు, మరేం విచారం వద్దు!" అని మేం వాడిని ఓదార్చాం. ఆ మరునాడే అతని భార్య మా ఇంటికి వచ్చింది, దూడని చాలాసేపు ముద్దాడి వెళ్ళింది."

చివాలున ఐడా మొహం మఋగుపడడం చూసి లక్ష్మి "మీకేమైంది? అలసటగా ఉందా? కొంచెం రెస్టు తీసుకోండి . . ." అని సలహా ఇచ్చింది.

బొలబొలమని ఐడా కళ్ళు తడిసిపోయాయి; కన్నీటిబొట్టిలు కింద రాలాయి.

"ఏం, ఏమైంది?"

ఐడా కళ్ళు తుడుచుకుంది. "కిందటి సంవత్సరం నాకొక పిల్లవాడు పోయాడు. వాడు మా అయనకీ, తక్కిన పిల్లలకీ, కలలో దేవదూతగా కనిపిస్తున్నాడట! నాకూ కలలో కనిపిస్తాడేమో అని ఆశ, కాని ఇంతవరకూ రాలేదు . . . " అని ఏడ్చింది.

"ఐడా, అందుకు కారణం నేను చెప్తాను, వినండి! కలలో మీకు కనిపించని ఆ పిల్లవాడు ఇప్పుడు మీ కడుపులో ఉన్నాడు! మరేం విచారం వద్దు!" అని లక్ష్మి వెంటనే చెప్పింది.

ఐడా తలెత్తి రెప్పవాల్చకుండా లక్ష్మిని చూసింది. మంచు బిందువులు పడిన పువ్వులులాగ ఆ తడిసిన కళ్ళు కనిపించాయి. అందులో కనిపించిన భావావేశం ఎలా వర్ణించడం: సంతోషమా? ఓదార్పా? లేక లజ్జా?

ఆ సాయంకాలం ఊరేగింపులో తను చూసిన మేరీ ముఖం లక్ష్మి గుర్తుచేసుకుంది. 'స్వరూపంలో, ఛాయలో మేరీకీ, ఐడాకీ గొప్పగా ఎటువంటి భేదం కనిపించలేదే?' అని ఆశ్చర్యపడింది. శిల్పరూపంలో మేరీలో కనిపించే ధోరణి ఆమెను బాగా ఆకర్షించింది.

'ఆ మొహం చూస్తే చాలు, మనసులో భక్తి, ఒక దేవతని దర్శించిన భావన కలుగుతోంది; ఆ చలువరాతి శిల, ఆ లావణ్యంకి మరేం సాటి లేదు!' అని లక్ష్మి మురిసిపోయింది.

"క్రైస్తు కనిపించరేం? అతని విగ్రహం నాకు చూడాలనివుంది!" అని ఐడాని అడిగింది.

ఊరేగింపులో వచ్చిన రధం బాగా లేవసెత్తిన ఒక రంగస్థలంలాగ కనిపించింది. మధ్య చలువరాయిలో మేరీ ప్రతిమ; దానిచుట్టూ నాలుగు దిక్కుల్లో రెక్కలతో ఎగురుతున్నట్లు పిల్లల విగ్రహాలు; అవీ చలువరాయితో చేసినవే. ఆ పిల్లల చేతుల్లో పూలదండలు; రధాన్ని నలుదిక్కులా ఆవరించుకున్నట్టు మరికొన్ని పూలదండలు. రధంకి చేసిన అలంకరణ అని చెప్పుకోవాలంటే ఏదీ గొప్పగా కనిపించకపోయినా, దాన్ని ఇలాగా అలాగా అని వర్ణించడం ఎవరికీ చేతకాదు!

'ఇంత అపురూపమైన మేరీ ప్రతిమకి బదులు క్రైస్తు విగ్రహం ఉంటే?' అనే ఆలోచన రాగానే లక్ష్మి అడిగేసింది: "క్రైస్తు ఎక్కడ?"

"అతనింకా పుట్టలేదు. క్రిస్టుమస్ పండుగ రావాలి. ఈ పండుగలో మనం మేరీని రాబోయే తల్లిగా పూజిస్తున్నాం" అని సుందరం భార్యకి చెప్పారు.

క్రైస్తవలగురించి మరికొన్ని వివరాలు లక్ష్మి అతన్ని అడిగి తెలుసుకుంది. కొందరు క్రైస్తుని దేవుడని పూజిస్తారు; మరికొందరు ఈ లోకానికి అతన్ని అనుగ్రహించిన మేరీమాతను పూజిస్తారు; తమ ఇంటి పొరుగున ఉన్న క్రైస్తవులకి మేరీయే ముఖ్యమైన దేవత అని లక్ష్మికి బోధపడింది.

దానికి మించి అడగడానికి లక్ష్మికి అవకాశం దొరకలేదు. భక్తులు - ఆడా, మగా - మేరీమాతతో వెళ్లే రధంకి రెండుపక్కలా వరుస వరుసగా, క్రమ శిక్షణతో, నిశ్చలంగా నడిచివెళ్ళారు; పిల్లలు రధంకి ముందు నడిచారు. భక్తులు కుడి చెయిలో ఒక మైనపు బత్తీ పట్టుకొని, ఎడం చెయిలో కాగితంలో రాసివున్న స్తోత్రంని మెల్లగా వల్లించుకుంటూ

నడిచే దృశ్యం సుందరం, అతని కుటుంబ సభ్యులు, రెప్పవాల్చకుండా చూసి ఆనందించారు. ఇందిర, రమణి ఏడమ్స్, ఐడా, వారి పిల్లలూ ఆ గుంపులో పాల్గొని, నడిచివెళ్ళడం గమనించి దానిగురించి మాటాడుకున్నారు. అసలు ఆ జనశ్రేణిలో వ్యాపించిన నిశ్శబ్దం, ప్రశాంతంలో వీళ్ళ మాటలకి ఏం పని? లక్ష్మి ఏమీ అనక ఊరుకుంది.

'అబ్బా, ఎన్నిరకాల దుస్తులూ, నియమాలూ, ఆచారాలూ!' అని లక్ష్మి విస్తుపోయింది. కాని అందరు భక్తుల మనసులో, ఈ దేవుడి సన్నిధిలో, ఒకే భావేశం - నిలకడగా - కనిపించడం ఆమెకి వింతగా తోచింది.

'ఈ రాత్రి మనం ఇంటికి తిరిగి వెళ్ళిన తరువాత ఏడమ్స్ కుటుంబం సెలవు పుచ్చుకుంటారు' అనే ఆలోచన లక్ష్మికి కటువుగా తోచింది. ఎందుకు తన మనసలాగ మారిందిని ఆమెకు తెలుసు. దేవుని చేరువలో అశుచియైనది పవిత్రంగా మారడం సహజమేకదా?

ఆ రాత్రి ఐడా సెలవు పుచ్చుకునే సమయం లక్ష్మి నిశ్చలంగానే కనిపించింది.

"ఐడా, నేను చెప్పినది జ్ఞాపకంలో ఉండనీ! మరేం బెంగ వద్దు!" అని మళ్ళీ చెప్పింది.

"అలాగే, మిస్సెస్ సుందరం. నాకు ఇప్పుడు ఒక ఆలోచన తట్టింది . . . నా అబ్బాయిగాని మీ కడుపులో పుట్టాడంటే, నేను వాడిని ఇంకా తొందరగా చూస్తానని ఆతురతగా ఉంది!" అని అంటూ కొంటె నవ్వు నవ్వింది.

లక్ష్మి నివ్వెరపోయింది: "అలాగే కానీయండి! మీకు కబురు అందగానే నన్ను చూడడానికి హాస్పిటల్ కి వస్తారుకదా? మనం మళ్ళీ కలుసుకుందాం!"

'ఏది ఎలాగైనా మన కుటుంబాలమధ్య స్నేహం బలమౌతుంది!' అనే నమ్మకంతో లక్ష్మి, ఐడా ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

వాళ్ళు వెళ్ళిన తరువాత లక్ష్మి పదే పదే ఐడాని పొగడడం చూసి సుందరంకి ఆశ్చర్యం కలిగింది. "హిందువులుకాని, క్రైస్తవులుకాని - మనసంటే అందరికీ ఒకే రీతిగానే ఉంటుంది!" అనే భార్య మాటలు వినగానే మొన్నవరకూ మిస్సెస్ ఏడమ్స్ గురించి ఆమె వ్యతిరేకంగా అన్న మాటలు అతను గుర్తు చేసుకున్నారు.

“ఇదేం మాయమో? నువ్వు ఆవిడని ఇలా అలా పొగడ్తున్నావ్! వాళ్ళిద్దరికీ నువ్వంటే ఎంత అభిమానం అని అతను ఇందులో రాసారు. చదివిచూడు!” అని ఒక ఉత్తరం భార్యకి అందించారు.

“నా భార్య మనసులోని ఒక పెద్ద లోపం మీ ఆవిడని కలుసుకున్న తరువాత - ఆ స్నేహం వలనే - పూర్తిగా మాయమైపోయింది,” అని మిస్టర్ ఏడమ్స్ అందులో రాసారు.

“మనం రోజూ వాడుతున్న మాటలు, పదబంధాలు, ఇక పలుకుబడిలో చూసే భిన్న రూపాలు - ఇవన్నీ అర్థం చేసుకోవాలని, మనకున్న సంశయాలు పోవాలంటే, నిఘంటువు వాడుతాం; అదే మన ఆత్మ తృప్తికి దోహదం చేస్తుంది. అలాగే ఇతర మతస్తుల స్నేహం, వారి సహవాసం మూలంగా మన మనస్సు మారడం నేనిప్పుడు చూస్తున్నాను. మిస్సస్ సుందరం తనకందించిన ఆత్మతృప్తిని నా భార్య ఏనాడూ మరిచిపోదు!”

మిస్టర్ ఎడమ్స్ ఉత్తరంలోని సారాంశం అదే.

“ఏమిటే, నువ్వు ఐడాకి ఇచ్చిన ఆత్మతృప్తి గురించి అతను గొప్పగా రాసారు. దాన్ని గురించి నాకు కొంచెం వివరంగా చెప్పవేం?” అని సుందరం లక్ష్మిని అడిగారు.

పాపం, ఆవిడ మనోవ్యధ తప్పక తీర్చవలసిందే . . . ఎవరి మనసు ఎలాగున్నా, పోయిన పిల్లవాడు తల్లి మనసులో నిలకడగా ఉంటాడు; అయినప్పటికీ పిల్లవాడు తనకి కలలో కనిపించలేదని ఐడా బాధపడింది. లక్ష్మి ఆవిడని ఊరడించిన ధోరణి సుందరం శ్లాఘించారు. అవును, హిందువులకి పునర్జన్మలో నమ్మకం ఉంది. ‘ఆ విశ్వాశం ఒక క్రైస్తవ స్త్రీకి తోడ్పడితే మనం తప్పక సంతోషించాలి!’ అని అతనికి అనిపించింది.

ఊరికి తిరిగి వెళ్ళగానే తమ కృతజ్ఞత తెలిపే విధంగా మిస్సర్ ఏడమ్స్ ఈ ఉత్తరం రాసారని సుందరం భావించలేదు; లక్ష్మికీ అలా అనిపించలేదు. ఊరుకి వెళ్ళే సమయంలో ఆ దంపతులు తమ హృదయపూర్వక మనోభావాలు బాగా తెలియజేసే వెళ్ళారు. “గర్భవతి మేరీమాత విగ్రహంకి మనం ఎంత గొప్పగా పూజలు చేసాం, స్తోత్రాలు వల్లించాం! మరి అతిథులుగా మిస్సస్ సుందరంని బాగా విసిగించాం!” అని

ఇద్దరూ మళ్ళీ మళ్ళీ వాపోయారు. ఆ దంపతులు అనుభవించిన అతిథి సత్కారంకి చిహ్నంగానే ఈ ఉత్తరం వచ్చిందని అని సుందరం దంపతులు ఊహించుకున్నారు.

"మీరు అతనికి ఏం రాయబోతున్నారు?" అని లక్ష్మి భర్తని అడిగింది.

"ఇప్పుడే రాయడానికి ఏ అగత్యమూ లేదే? వచ్చే వారం Christmas Greetings పంపించాలనుకుంటున్నాను. ఇప్పుడే రాయాలంటే . . . ."

"వద్దు!, వద్దు!, వచ్చేవారమే రాయండి!" అని లక్ష్మి మందలించింది.

అలాగే, ఆ వారం సుందరం రాసారు. కాని అనుకున్న అభివందనతోబాటు మరొక ముఖ్యమైన కబురుగురించి రాసారు.

"ఏమిటి రాసారు?" అని లక్ష్మి నవ్వుతూ అడిగింది.

"మన పిల్లవాడు వచ్చాడుగా, వాడిగురించే! 'మీరు వాడిని తప్పకుండా చూడాలి!' అని రాసాను! ఐడా ఏడమ్స్ అన్నట్టు 'వాళ్ళ అబ్బాయి'ని చూడాలని వస్తారా, అలాగే కానీ! లేకపోతే నర్సు చెప్పినట్టు Jesus ని చూడాలని రానీ! 'తప్పకుండా మీరు రావాలి!' అని రాసాను."

"సరే . . . అతను ఇంతకు ముందు ఉత్తరంలో నిఘంటువుకి ఉపమానంగా రాసినందుకు కృతజ్ఞత చెప్పాలని మీరు అన్నారు . . . దానిగురించి మీరేం రాయలేదా?"

"వాళ్ళు వస్తే ముఖాముఖీగా చెప్పవలసిన కబుర్లు ఉన్నాయని రాసాను. వాళ్ళకీ రావాలని ఆతురతగా ఉంటుంది."

లక్ష్మి లేతగా నవ్వింది.

శిశువు పుట్టగానే "మాకు ఒక అమ్మాయీ, నలుగురు అబ్బాయిలు ఉన్నారు! ఇది ఆడ పిల్ల ఐవుంటే?" అని సుందరం అవాళ అన్నారు. కాని నర్సు "ఇది జీసస్ పుట్టినరోజు!" అని అనగానే లక్ష్మికి ఒక గెంతు గెంతాలనిపించింది.

'అసలు మనకి క్రిస్మస్ పండుగ లేదే!' అనే ఆలోచనే ఆమెకి తట్టలేదు. 'క్రైస్తు పుట్టినరోజు మన అబ్బాయి పుట్టాడంటే ఎంత సంతోషంగా ఉంది!' అని ఆహ్లాదం కలిగింది.


సుందరం ఆ నిఘంటువు ఉపమానం గుర్తుచేసుకున్నారు; దానిగురించి రాయాలని అతను తొందరపడ్డారు. కాని రాయలేదు. ఏడమ్స్ దంపతులని నేరుగా కలుసుకోవాలి, అదే అతని పథకం, లక్ష్మీ ఆమోదించింది.

కాని తన తల్లిదండ్రులని మించి ఇందిర ఆ క్రైస్తవ స్నేహితుల రాకకోసం కాచుకొనివుంది. 'ఆ రోజు గాంధీగారు మళ్ళీ పుట్టారని నేను అన్నప్పుడు నాతో ఎలా దెబ్బలాడారు? మరి ఇప్పుడేమో క్రైస్తుపే పుట్టారని ఎలా నొక్కిచెప్తున్నారు?' అని తన తల్లిని ఎదురుగా నిలిపి అడగాలని పూనుకుంది. ఆ నిఘంటువు అనుమానం ఆమెనూ ఆవరించుకుంటుందని చెప్పాలా?

తన తమ్ముడు జన్మకూడా క్రైస్తుమస్ దినమే అయిందని  అని తెలుసుకొని ఇందిరకి మనసులో ఆత్మాభిమానం కలిగింది.

********

**(మూలం: స్వదేశమిత్రన్, జనవరి 1, 1949)**


39—65

# కొంగ్రొత్త మాసం[1]

శేషాద్రి వాక్పటిమతో కోర్టులో తన ప్రావీణ్యం చూపి వకీలుగా తన వృత్తిలో ప్రసిద్ధి పొందాడు. కాని అతని జీవితంలో ఒక కటువైన సంఘటనతో జీవితంపై విరక్తి కలిగి ఇతర సహచరులలాగ డబ్బు పోగేసుకోవాలనే తపనకూడా అతనికి లేకపోయింది. తన వృత్తివలన తనకు నెలవాటీ తృప్తికరమైన ఆదాయం లేకపోయినా, ఆయన ప్రతీ నెలా ఒక అనివార్యమైన చర్యవలన మానసిక వ్యధ అనుభవిస్తుంటాడు.

ప్రతీ నెలా, మొదటి రోజున, ఆయన రెండు మనియార్డర్ ఫారాలు తీసుకుంటాడు. తన మానసిక భావాలు ఎలా ఉన్నా వాటిని కాస్త పక్కనబెట్టి, ఫారాల్ని తొందరగా నింపేసి, వాటికి సరిపడ్డ డబ్బుతో తన గుమాస్తాకి వాటి నివృత్తికి అందజేస్తాడు. అతను పంపే మనియార్డర్లో ఒకటి తన యింటి యజమానుడికి ఇవ్వవలసిన నెలవారీ అద్దెకు సంభందించినది; ఇక రెండోది తన్నుంచి విడివడి వేరేగా ఉంటున్న తన పూర్వ భార్యకి తానీయవలసిన నెలవారీ మనోవర్తికి సంభందించినది. ఈ రెండు బాధ్యతలపట్ల శేషాద్రికి సమభావనే ఉండవచ్చునేమో, కాని అందులో కొట్టవచ్చేంత తేడా ఉంది. నెలవారీ అద్దె చెల్లించే విషయంలో తన బాధ్యత నెరవేరుస్తున్న భావన ఉండగా, రెండోదానివల్ల ఒక విధమైన సిగ్గుతో శేషాద్రి కృంగిపోతాడు. గత పది సంవత్సరాలనుండి ఇంటి యజమానుడు పాతికరూపాయల అద్దె పెంచకపోవడంవలన ఆయనకి శేషాద్రి కృతజ్ఞుడే. గత కొన్నేళ్ళుగా తన వ్యక్తిగత ఆదాయం పెరుగుతున్నాకూడా తన మొదటి భార్య మనోవర్తిలో మార్పు అడగనందుకు తను ఆమెను అభినందించని విషయం అతను గమనించినట్టు లేడు. తన మొదటి భార్య కమల, తను రేడియోలో పాడుతూ, పిల్లలకి సంగీత బోధన చేస్తూ తన ఆదాయాన్ని పెంచుకుంటోందనే సంగతి శేషాద్రి చెవులకి ఎలాగో అందింది. తన మొదటి భార్య కమలకి ఇంకా మనోవర్తి చెల్లించడానికి తను బాధ్యుడుకానని విజయవంతంగా శేషాద్రి వాదించగలడు. కాని కనీశం ఆ

[1] ఇది కే.వి.శేషారావుగారి అనువాదం

విషయంపై ఆలోచించడానికికూడా ఆయన సిద్ధంగా లేడు; ప్రస్తుత పరిస్థితిని మార్చాలనే ఉద్దేశ్యానికి కూడా అతను వ్యతిరేకే.

కమల తరచుగా ఆమె చిరునామాలో మార్పు తెలియజేసినప్పుడల్లా శేషాద్రి చిరాకుపడ్తూండేవాడు. ఇలా ఉంటుండగా ఒక రోజు ఆమె ఒక పెద్ద ఉత్తరం - నాలుగు పంక్తులతో - తన కృతజ్ఞత తెలుపుతూ రాసింది. "గత నాలుగు నెలలుగా నేను గమనిస్తూ వస్తున్నాను. కొత్త నెల ప్రారంభమౌతూనే గతి తప్పకుండా మీరు మనియార్డర్ చెయ్యడం నాకు సంతోషంగా ఉంది. ఒకప్పుడు కొంచెం అటూ ఇటూ అయినాకూడా మీరు నెల మొదటిరోజే డబ్బు పంపుతున్నారు. దయచేసి ఈ పద్ధతినే కొనసాగించమని నా అభ్యర్ధన. మీరు పంపేదే నెలవారీ ఖర్చులకి ఎంతో ఉపచరిస్తున్నందుకు వాటిపైనే ఆదరణతో ఏదురుచూస్తున్నాను." అది చదువుతూ శేషాద్రి ఆ కాయితాన్ని చిత్రహింసచేసి చెత్తబుట్టలో పారేసాడు. కాని ఒకసారి చదివి మననం చేసుకున్న తరువాత అందులోని విషయాలు మరిచిపోవడం ఎలా సాధ్యం? 'ఆమె నిజంగానే అభినందిస్తున్నట్లా లేక నిందాస్తుతియా?' అని తనలో తనే తర్కించుకున్నాడు. 'నీ గురించి నేను ఆలోచించడం మొదలుబెట్టలేదే, పెడసరవుదానా!' అని తనలో తనే గొణుక్కున్నాడు. 'మా ఇంటి యజమాని పైఊరులో ఉండడం వలన ఆయనకి అద్దె పంపుతున్న చేత్తోనే నీకుకూడా పారేస్తున్నాను. అంతే, మరేం లేదు!' కాని అలా అంటూ ఆమెకు ఉత్తరం రాయలేదు. అలాగకాని రాస్తే ఆమె గురించి తను పట్టించుకున్నట్లుందని అతని భావన.

ఒకరోజు ఇంటి యజమానినుంచి ఒక ఉత్తరం వచ్చింది:

"ఇన్ని సంవత్సరాలుగా మేం మీ పట్ల చాలా ఉదారంగానే - ఇంటి అద్దె పెంచకుండా - వ్యవహరిస్తూ వస్తున్నాం. కాని మీరిప్పుడు మీ అల్పబుద్ధిని చాటుకున్నారు. ఈ నెల అద్దె పంపుతున్నప్పుడు మనియార్డర్ కమిషన్ ఆరణాలు మినహాయించారు. మనియార్డర్ కమిషన్ బాధ్యత మీదే అన్న ప్రాధమిక విషయం మరిచిపోయినట్టున్నారు. అందువలన వచ్చే నెలనుండి ఇంటి అద్దె నలభై రూపాయలుగా నిర్ణయించబడింది. మా ఇంటికి డెబ్బైయ్యో, ఎనభైయ్యో రావొచ్చుగాని గత పది సంవత్సరాలుగా మీరు మా ఇంటిలో నివసిస్తున్నారనే విషయం గమనించి

ఇప్పటికి నలభై రూపాయలుగా నిర్ణయిస్తున్నాం. కాబట్టి ప్రతీ నెలా నలభై రూపాయలు అద్దె, ఎనిమిది అణాలు మనియార్డర్ కమిషన్ చెల్లించడానికి ఒప్పుకుంటే మీరు కొనసాగగలరు."

ఆ ఉత్తరం శేషాద్రిని విచారగస్తుణ్ణి చేస్తూ కోపభరితుణ్ణికూడా చేసింది. గత ఇరవై నెలలుగా పంపుతున్నట్టే గత నెలలో కూడా అద్దె పంపినట్టు అతని మనస్సులో ఉంది. కాని నిజంగా ఏం జరిగింది? ఈ అసహ్యకరమైన ఉత్తరం ఏమిటి? కారణం ఏమయ్యుంటుంది?

పాత రికార్డులు చూసి ఏమైందో తెలుసుకుందామని అయన డ్రాయరునుంచి రికార్డులు తీసాడు. ఆ సారి మనియార్డర్ ఫారాలు తానే స్వయంగా నింపకుండా ఖాళీ ఫారాలను తన గుమాస్తాకి అందజేసాడు. ఇదంతా గుమాస్తా చేసిన పొరబాటే. సాధారణంగా కమలకి మనియార్డర్లో కమిషన్ మినహా డబ్బు పంపించడం జరుగుతుంది. కాని ఈ సారి ఇంటి యజమానికి పంపించిన దానిలో అలా జరిగిపోయింది. పూర్తి ఇరవైఐదు రూపాయలు కమలకి గుమాస్తా పంపించేసాడు.

శేషాద్రికి సంభందించినంత వరకు ఇది సామాన్య పొరబాటే; అదిప్పుడు పెద్ద సమస్య అయి కూర్చుంది. ఐనాకూడా ఆయన గుమాస్తాని తప్పుబెట్టలేదు. ఇంటి యజమానికి వ్యక్తిగతంగా ఒక ఉత్తరం రాసాడు: తన గుమాస్తా పొరబాటు చేసాడనీ, ఆరణాలకోసం ఇంత మొరటైన ఉత్తరం రాసి తక్కువతనాన్ని వెల్లడించుకున్నది యజమానియే అని తెలియజేసాడు. యజమాని ఆపెంచిన అద్దెకు దారాళంగా అంగీకరిస్తూ ఆ విధంగా తన దాతృత్వాన్ని సూచిస్తూ ఆపెంచిన అద్దెకూడా స్వల్పమే అని రాసాడు. ఇప్పుడు అతనికి మానసికంగా మరో వ్యధ పట్టుకుంది: కొంపతీసి కమలగాని మనియార్డర్ కమిషన్ మినహాయించకుండా డబ్బు పంపించినందుకు తనకి కృతజ్ఞత తెలియజేస్తూ ఒక ఉత్తరం రాసేస్తుందేమో అనే ఆవేదన.

ఆ చింత కొన్నాళ్ళవరకూ వదల్లేదు. మూడువారాలు పోతేగాని ఆయనకి మనశ్శాంతి చేకూరలేదు. "అది అలాగ రాయదుగాక రాయదు!" అని తనకు తానే నచ్చజెప్పుకున్నాడు. ఈ లోగా మళ్ళీ మరుసటినెల ప్రారంభమైంది.

ఎప్పటిలాగానే తన చేత్తో మళ్ళీ రెండు మనియార్డర్ ఫారాలు అందుకున్నాడు. అద్దె నలభై రూపాయలు, మనియార్డర్ కమిషన్ ఎనిమిదణాలు. చిరునామాదారునికి ఒక సూచన రాసాడు: "శారదాలయంకి దీన్ని అద్దెగా స్వీకరిచవలెను." తరువాత కమలకోసం మరో ఫారం అందుకొని రాయడానికి ఉపక్రమించాడు. కాని అంతలోనే ఆగిపోయాడు; ముందుకు సాగలేకపోయాడు.

కమలకి పంపే మొత్తంనుండి కమిషన్ మినహాయించాలా వద్దా?

మొన్ననే ఇంటి యజమానుడి ఉత్తరం చదివినప్పుడు తనలో కలిగిన భావాలు గుర్తుకి వచ్చాయి. ఆరణాలకోసం ఇంటి యజమాని అంత నీచంగా ప్రవర్తించి, అంత అసహ్యమైన ఉత్తరంకూడా రాసినందుకు శేషాద్రికి నిజంగానే పిచ్చెక్కపోలేదా? పైఊళ్లో నివసించాలని ఇంటి యజమానేకదా నిర్ణయించుకున్నది? నిజానికి మనియార్డర్ కమిషన్ అద్దెకున్నవాడి బాధ్యతకాదనికూడా శేషాద్రి అనుకునేవాడు. ఇంతకూ అది ముష్టి ఆరణాల విషయం, కాని అదే తనకి ఇంటి యజమానిపట్ల గౌరవం ఊడ్చిపారేసింది.

కమల ఏమనుకుంటుంది?

న్యాయతగా నెలా నెలా కమలకి మనోవర్తిగా  ఇరవైఐదు రూపాయలు 'పంపాలి'. (అవును, దానికి మరో పర్యాయపదంగా 'ఇవ్వాలి' అని అనకూడదు.) అందువలన ఉభయ పక్షాలు అంగీకరించుకున్న ప్రకారం ఆవిడ పూర్తిగా ఇరవైఐదు రూపాయలకి అర్హురాలేకదా? కావాలంటే శేషాద్రి చాలా కఠినంగానూ, నిష్కర్షగానూ ప్రవర్తించి, మనియార్డర్ కమిషన్ మినహాయించవచ్చు. కాని అది మంచి పనా?

'ఆమెను కించపరచినట్లు నీ దాతృత్వం చాటించుకోవచ్చుకదా? ఆవిడ అహంకారంమీద దెబ్బ తీసినట్టు ప్రవర్తిస్తే లాగుంటుంది?'

మనస్సు సుడిగుండంలో చిక్కుకుపోయినట్టుగా ఉంది అతనికి; ఊగులాటలో పడిపోయింది.

గుమాస్తాని పిలిచి ఇలా చెప్పాడు. "ఈ సారి ఎటువంటి తప్పూ జరగడానికి వీలు లేదు, తెలిసిందా? ఇదిగో, నలభై రూపాయలకి ఒక మనియార్డరు, ఎనిమిదణాలు కమిషను. మరొకటి పాతిక రూపాయలకి. ఆరణాలు కమిషను. నీకు రొక్కం అరవై ఆరు

రూపాయలు ఇస్తున్నాను. ఫారాలుకూడా నేనే నింపేసాను. పోస్టాఫీసు పని చూసుకొని నువ్వు మండుతున్న ఎండలో రెండణాలకి మంచి పానీయం తాగేయ్." గుమాస్తాన్ని పోస్టాఫీసుకి పంపించిన తరువాతనే మనస్సు అతనికి కాస్త కుదుటబడింది.

ఆఫీసు రూమ్ నుండి బయటకి వస్తూనే శేషాద్రి ముఖం చన్నీళ్ళతో కడుక్కోడానికి పెరట్లోకి వెళ్ళాడు; ఆయన భార్య వైదేహి అక్కడే నిలబడి ఉంది; తన భర్త మనియార్డర్ల పని అప్పుడే పూర్తిచేసుకున్నాడని ఆమెకు తెలుసు.

అటువంటి సమయాల్లోనే వైదేహి తనలోని ఓర్మిని ప్రదర్శిస్తుంది. తాను రెండవ భార్యననే అప్రాధ్యత మనస్వత్వంలోనుంచి విడిచిపెట్టి జీవితం తనకు ప్రసాదించిన ఆనందం, ప్రత్యేక అవకాశాలని పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకుంటుంది. నలుగురితో కలిసి జీవించడానికి అలవడి ఉన్నదేమో, 'ఏ కొండకా గొడుగునుపట్టే' పద్ధతి బాగా అలవరించుకుంది. క్రొత్తనెల ప్రారంభానికి ముందు ఆమె ప్రవర్తనలో చిన్న మార్పు వస్తుంది. ఇతర సమయాల్లో మాత్రం అందరి స్త్రీలలాగే సినిమాకి వెళ్ళలేకపోనందుకు బాధపడడం, వీధిలోకి వచ్చిన పాలవాడిచ్చిన పాలు తృప్తిగా లేదనుకోవడం వంటివాటికి చికాకు పడుతుంది. ఒక సారి నెల దొర్లిపోతుంటే, ఆమె ప్రతీ విషయానికీ, అన్ని విషయాలకీ, తప్పుపెట్టడం మానుకుంది. హఠాత్తుగా నీటి ఆపుదల సంభవించినా ఏ కొంచెంకూడా తల్లడిల్లదు.

ఎప్పటిలాగే ఆ మధ్యాహ్నం వైదేహి భర్తవైపు చూసి, చిరునవ్వుతో "ఈరోజు మసాలా గారెలు చేస్తున్నాను. ఇదిగో, మీతోబాటు స్నేహితులకి కూడా సరిపోయేట్టు ఒక చిన్న పాకెట్టు," అని చూపించింది.

తువాలుతో ముఖం తుడుచుకుంటూ శేషాద్రికూడా నవ్వుతూ "సరే, మంచిది, మంచిది," అని అన్నాడు. ఆమె వంకనే చూస్తూ, స్వచ్ఛమైన గొంతుకతో, "ఇదిగో చూడు. ఈ రోజు మొదలుకొని ఇంటి అద్దె నలభైరూపాయలు," అని అన్నాడు.

** ** **

వెనకటికి పండితుడెవడో చులకనగా అన్నాడట, 'భర్త భార్యకి మొదటి బిడ్డ,' అని. వైదేహి శేషాద్రిని సరిగ్గా అలాగే చూసుకుంటోంది. భర్తపట్ల ఆమెకు చాలా ప్రేమాభిమానం. అప్పటికే మానసికంగా కృంగిపోయివున్న ఆయన హృదయాన్ని ఏ

చిన్న విషయమైనా మరింత ఉద్రేకపరచకుండా వైదేహి జాగ్రత్తపడుతోంది. నెల నెలా కమలకి శేషాద్రి పంపించే మనియార్డరు ఫారాలని పరిశీలించడంగాని కనీసం కన్నెత్తిచూడాలనికూడా ఆమె ఇష్టపడదు. శేషాద్రికి తన మొదటి భార్యపై ఏమాత్రం అభిమానం ఉన్నదేమో అనే సంశయం వైదేహికి లేదు. మరి ఆ కారణంవలనేకదా అతను తన్ను పెళ్ళాడాడు? మొదటి భార్యకి ప్రతీ నెలా మనియార్డర్ పంపినవేళ ఆయనకి ఆమె దుబరా ఖర్చుదారనీ, ఇంకా ఇతర లోపాలు కచ్చితంగా గుర్తుకి వస్తున్నాయన్నదే వైదేహి గాఢ విశ్వాసం.

ఆ భార్య తన భర్తని కోర్టుకి ఈడ్చినందువలనేకదా ఆవిడకి మనోవర్తి ఏర్పాటైంది? ఆ సమయంలో శేషాద్రి అప్పుడప్పుడే పైకొస్తూ తన కొత్త భార్యతో కొట్టమిడుతున్న ఒక చిన్న లాయరు. పాపం, అతను ఎంత మానసిక వ్యధ, దుఃఖం అనుభవించాడు? ఒక స్థాయిలో ఆ భార్యకి ఒకే సారి ఎంతో కొంత మొత్తం ముట్టజెప్పి వదలించుకుంటే మానసిక ప్రశాంతం లభిస్తుందేమో అనికూడా ఆలోచించాడు. అప్పట్లో అతని ఆదాయం అంతంత మాత్రమే. ఐనాసరే, అవసరమైతే అప్పుచేసైనా తొందరగా ఒక పరిహారం పొందాలనుకునేవాడు. వైదేహి కోర్టు కార్యక్రమాలని అవమానంతోనూ, బాధతోనూ, గమనిస్తుంటే తనేం చేసేది లేక నిస్సహాయంగా శేషాద్రి లోలోనే మండిపడేవాడు. కాని కమల, ఆమె తల్లి ఒక్కవీసమైనా కదలలేదు. మనోవర్తి వాయిదాల పద్ధతిలోనే చెల్లించవలసిందని పట్టుబట్టారు, చివరికి ఆ విధంగానే కోర్టు తీర్మానించింది. ఇంటి రచ్చ ఆ విధంగా బట్టబయలవడంతో శేషాద్రి తన భార్య ఎదుట బావురుమన్నాడు.

ఆ రోజునే వైదేహి ఒక నిశ్చయానికి వచ్చేసింది. తన భర్తకి నెల నెలా మనియార్డర్ ఫారాలు సంతకం చెయ్యడంతప్ప వేరే గత్యంతరం లేదన్న విషయం ఆమె అర్థం చేసుకుంది. ఆ ఫారంమీద ఆయన రెండుచోట్ల కమల పేరు రాయాలి; ఒక యంత్రంలాగ, అనాలోచితంగా ఆ ఒడంబడిక అతను నెరవేరుస్తుండవలసిందే! ఒకప్పుడు కమల పేరును తలచుకోవలసినప్పుడంతా ఆయన మనస్సు ఆ చేదు అనుభవాన్ని ఒకసారి నెమరువేసుకుంటూ ఉంటుందని వైదేహి తన మనస్సులో అనుకుంటేది. మరి తనెందుకు అవన్నీ పట్టించుకోవాలి? ఆ రోజునే ఆమె ఆ నిశ్చయం చేసుకుంది.

ఆ విచారకర సన్నివేశం దృశ్యా శేషాద్రి వైదేహిల మధ్య ఒక బంధం ఏర్పడింది. వైదేహిలో అనిశ్చిత భావం, భయంలాంటివి మాయమైపోయి భర్తపట్ల ప్రేమానురాగాలు మొలకెత్తాయి. అవసరమైనప్పుడు లాలనతో, వైదేహి ఆయనలో ధైర్యం పోసేది. శేషాద్రికూడా వైదేహిపట్ల గౌరవం, ఆదరణ చూపేవాడు.

కవచంలాగ పనిచేసిన విచారంనుంచి ఉద్భవించిన ఒకరిపట్ల ఒకరి ప్రేమ పెంపొందుతూ వచ్చింది. వైదేహి కడుపు పండే సూచనలు కానవచ్చాయిగాని, అదేం కర్మమో, వైదేహి గర్భంలో పిండం తొమ్మిది నెలలుకూడా నిండేదికాదు. చిట్టచివరకి జీవంలేని పిండం బయటపడుతుండేది. అలా ప్రతీ కానుపు వైదేహికి ప్రాణసంకటంగా మిగిలేది. శేషాద్రితో కమల కొంతకాలమే కాపురం చేసింది. ఆమె నడవడిలో ఎప్పుడూ ఒక ఠీవి. పటాటోపంతో తన తల్లిగారి పోలికతో కనిపించేది. అత్తగారికి దూరంగా పెరుగుతూ చివరికి ఆమె ఇతరులనుండి ఒదిగి తన తల్లితోనే కాలం గడపాలని నిశ్చయం చేసుకుంది. ఆమె అందంకి చెప్పుకోతగ్గదే. కాని ఆమె చూపులు స్నేహితులెవరినీ ఆకర్షించలేదు.

ఇప్పుడు ఆ తల్లి లేదు. ప్రేమాభిమానంతో ముంచెత్తిన తల్లి కూతురు జీవితాన్ని నట్టిడముంచి పోయింది. కాని చింత చచ్చినా పిలుపు చావనట్లు ఆమె పెంపకం ఛాయలు ఇంకా పదలిపెట్టలేదు. ఆ తల్లి ప్రభావం వల్ల కాకపోతే కమలకి ఇప్పటి గతి పట్టివుండేదికాదు. అలాగే, పాపం, వైదేహికి రెండో భార్య అయే గతి పట్టివుండేదికాదు.

అప్పుడప్పుడు, పాపం, శేషాద్రి ఏదో తప్పు చేసినట్టు బాధ పడేవాడు. కాని దానికి అతను బాధ్యుడా? ఒక సమస్యని పరీక్షించి అందులో న్యాయం, ఎటువైపు ఉందో తెలుసుకోగలిగే న్యాయవాద వృత్తికదా తనది? తన జీవితంలో వైదేహి నిర్వహించిన స్థిరమైన పాత్రవలనేకదా తన మనస్సులోని ఊగిసలాట మనస్తత్వాన్ని అధిగమించి మానసిక ప్రశాంతం పొందగల్గుతున్నాడు? జీవితం జీవించడానికే అన్న వైదేహి సిద్ధాంతంతో శేషాద్రి ఏకీభవిస్తాడు. అందువలన వైదేహి స్థానిక మహిళా సమాజంలో సభ్యురాలుగా పోషించే పాత్రను ప్రోత్సాహిస్తాడు. ఏ విధమైన న్యూనతభావం లేకుండా, తన కార్యక్రమాల్లో ఇమిడియున్న ఆనందోత్సాహాలను వైదేహి తన వ్యక్తిగత

జీవితంలోనూ, బహిరంగ జీవితంలోనూ సంపూర్ణంగా అనుభవిస్తోంది; ఆడదానికి అంతకన్న కావలసినదేమిటి?

వైదేహి ఎవరో చెప్పగా విన్నది - కమల గత ఏడెనిమిదేళ్ళలో చాలా చోట్లకి మారినట్టు. ఆమె చిరునామాలో మార్పులు తన భర్త గమనిస్తున్నాడా అనికాని ఆమె అలా మారుతూ ఉండడానికి కారణమేమిటని అతను ఆలోచిస్తున్నాడా అనికాని తెలుసుకోడానికి వైదేహి ప్రయత్నించలేదు. కమలకి పంపిన మనోవర్తిలో కమిషన్ ఆరణాలు మినహా ఇస్తున్న సంగతికాని, దరిమిలాను అది కుదిరించిన విషయంగాని ఆమె తెలుసుకోలేదు.

కమల చివరికి మదరాసులో సంగీత మాస్టరుగా తరలిపోతున్న విషయాన్ని శేషాద్రి, వైదేహి ఇద్దరూ సుమారుగా ఒకేసారి తెలుసుకున్నారు. తన చిరునామాలో మార్పుని కమల శేషాద్రికి విధేయంగా తెలియజేసింది. తరువుగా వ్యవహార రీతిగా మద్రాసు వెళ్తూన్న శేషాద్రికి ఈ వార్త ఇబ్బంది పెట్టింది. ఒకవేళ ప్రమాదవశాత్తుగా తను కమలని తారసిల్లవలసినస్తూందేమో అని ఆయన భయపడ్డాడు. అంతలోనే తనను తానే సంభాలించుకున్నాడు: ఒకవేళ అటువంటి పరిస్థితి కనుక ఎదురైతే ఆమెను తను చూసీచూడనట్టు తప్పించుకొనిపోతే సరిపోతుందిలే అని అనుకున్నాడు.

ఈ వార్త వైదేహికి మహిళా సమాజంలో ఒక అమ్మాయి మూలంగా తెలిసింది. “మద్రాసులో మా చెల్లెలికి సంగీతం, హిందీ నేర్పించడానికి ఎవరో కమలాదేవి అనే ఆవిడ కొత్తగా చేరుకుంది,” అని అంటూ ఆమె ఇంకా చెప్పడం మొదలుబెట్టింది: “ఆమె పేరు కమలట; చక్కని గాయకురాలట; ఆమెను మనం ఎలాగైనా మన సమాజంకి ఆహ్వానించి కచేరీ పెట్టాలి.” అంతేకాక ఆ కమలాదేవి గురించి మరికొన్ని సంగతులు - అల్లిబిల్లి కబుర్లు -కూడా ఆమె చెప్పసాగింది. ఆమెకు దగ్గర్లో కూర్చున్న మరో వనిత కళ్ళు గుండ్రంగా తిప్పుతూ, ఆమెను హెచ్చరిస్తూ “చాలు, చాల్లే అమ్మా,” అంటూ ఆమె నోరు మూయబోయింది. ఆ కమలాదేవి ఎవరో మహిళా సమాజంలో అందరికీ ఆమె పరిచయస్తురాలుగా ఉందని వైదేహి వెంటనే గుర్తించింది. సమాజం కార్యదర్శిని కలుసుకొని మాటాడింది.

"ఈ కమలాదేవి పాట వినాలని నాకు కుతూహలంగా ఉంది," అని వైదేహి మొదలుబెట్టింది. "మన మండళిలో ఆవిడ కచ్చేరీ ఏర్పాటు చేద్దాం." వైదేహి సాహసం చూసి కార్యదర్శికి దిగ్భ్రమ కలిగింది. "అలా చెయ్యడం మంచిది కాదంటాను; మీరు బాధపడవలసివచ్చు" అని మందలించింది. కాని వైదేహి పట్టువిడవలేని కారణం వలన కమలకి ఆహ్వానం వెళ్ళింది. కమల మళ్ళీ ఆ విషయంపై కమలాదేవి చిరునామాకోసం ఎటువంటి ప్రస్తావన చెయ్యకుండానే, శేషాద్రి పంపుతూవున్న మనోవర్తి విషయంలో రాజీ పడకుండానే ఒక అద్భుతం జరిగిపోయింది. కాని చివరికి సమాజం ఆహ్వానం కమల స్వీకరించలేదు. "బహిరంగ వేదికలమీద కచేరీలు చెయ్యడం నాకు సమ్మతం కాదు," అని అంటూ మర్యాదపూర్వకంగా ఆహ్వానం తోసిపుచ్చింది. ప్రాధమికంగా వేదికమీద కచేరీలు చేసే ఉద్దేశం నాకు లేదు. యువతులని ప్రోత్సాహపరిచే ప్రయత్నంతో ప్రస్తుతం నాకు సంతృప్తిగా ఉంది . . . నన్ను మన్నించండి," అంటూ బదులిచ్చింది. ఆ ఉత్తరం చదివి వైదేహి ఉబ్బితబ్బిపోయింది; తన భర్తతో ఆ విషయం పంచుకోవాలనుకుందేగాని ఆమె నోట ఏ మాటా పెగల్లేదు.

ఐనా ఆ వార్త శేషాద్రి చెవులకి అందింది. ఒకవేళ కమల కచేరీకనుక ఏర్పాడైవుంటే ఇప్పటికీ సమాధానం ఒక చిన్న ప్రశ్నే: సమాజం సభ్యులు ఆ కచేరీని ఓహో అనగలిగేవారా?లేక చీదరించుకొని ఉండేవారా? ఐనా కమల రాసిన విషయం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశమై కూర్చుంది. సభ్యులు ఎవరికివారే ఇదే విషయంపై చర్చించుకోవడమేకాకుండా దానికి చాలా ప్రచారం కల్పించారు. అది విని మొదట శేషాద్రికూడా ఒకింత ఆశ్చర్యపడిపోయాడు. 'ఏమిటబ్బా ఇది? నిజంగా కమల రాసివుంటుందా ఈ ఉత్తరం?" అని అతను తనలో అనుకున్నాడు. ఒకవేళ ఎప్పుడైనా ప్రమాదవశాత్తూ ఆమెను కలుసుకున్నప్పుడు 'నిజంగానే కమలలో చెప్పుకోతగ్గిన మార్పు కలిగిందా?' అని కనుక్కోవాలి అని ఆయన నిశ్చయించాడు.

త్వరలోనే ఆ అభిప్రాయంకి కొంత కదలిక కలిగింది. వ్యవహారరీత్యా అతని మద్రాసు ప్రయాణం - నాలుగు రోజులు - అక్కడ గడపవలసివచ్చింది. ఆ ప్రయాణంలో కొత్త మాసం ప్రారంభమైంది.

స్థానిక పోస్టాఫీసులో శేషాద్రి రెండు మనియార్డర్ ఫారాలు అందుకున్నాడేకాని కలం కదల్లేదు. ఇంటి యజమానిని చూసి నిజంగా చాలా రోజులయింది. ఈ సారి అద్దె తనే అతనికి స్వయంగా ఎందుకు అందజెయ్యకూడదు? కమల విషయంలో కూడా అలాగే చెయ్యొచ్చునుకదా? ఒక సారి, కేవలం ఒకే ఒక సారి; దానికెంత సమయం పడ్తుంది?

పట్ణం చేరిన మొదటిరోజే శేషాద్రి తన కక్షీదారుని కారులో కమల ఉంటున్న వీధిగండానే వెళ్ళాడు. తనతో రెండేళ్ళు కాపురం చేసిన కమలని గుర్తుచేసుకున్నాడు. ఇప్పుడామె ఆ వీధిలోనే ఏదో ఒక ఇంట్లో నివసిస్తుంది. ఒంటినుండి వెలుబడే భరించలేని దుర్వాసనలాగ ఒక దీర్ఘ నిట్టూర్పు మిడిచి అతను చింతాక్రంతుడైపోయాడు.


పట్ణంలో ఎప్పుడూ రిక్షా ఎక్కడం ఎరగడు శేషాద్రి. వ్యాపారరీత్యా వచ్చినప్పుడెల్లా టాక్సీలోనే తిరుగుతాడు. కాని ఇప్పుడు ఒక రిక్షా కుదుర్చుకున్నాడు. ముందు కమలని కలుసుకొని, డబ్బు ఇచ్చేసి, మనోభారం తీర్చుకున్నతరువాతనే ఇంటి యజమానిని చూడాలని నిశ్చయించాడు.

కమల నివసించే వీధిలోకి ప్రవేశిస్తుండగా అతనికి ఒక విధమైన గుగర్పాటు కలిగింది. అధైర్యపడుతున్నందుకు తనని తానే నిందించుకున్నాడు. ఒకసారి కమల చిరునామా గుర్తించుకొని వెంటనే అక్కడ చేరుకున్నాడు, కాని ఆ చుట్టుపక్కల జనసంచారం కనబడలేదు. వెనకకి వెళ్ళిపోతేనో? కాని చివరి క్షణంలో విరమించుకోదలచుకోలేదు. రిక్షా దిగాడు. ఒక భవనం ముందు - అందులో విడివిడిగా గృహాలున్నాయి - నిలచియున్నట్టుగా గ్రహించాడు. ఒక క్షణం ఏమీ పాలుపోలేదు. ఇంతలో చేతిలో ఒక బజారుసంచితో ఆ భవంచినుంచి బయటకి నవస్తున్న ఒక చిన్నవాడిని చూసాడు; ఆ అబ్బాయిని ఆపి అడిగాడు. “ఓ, కమలాదేవిగారా?” అని అడిగి, “అదిగో, మీరు లోపలికి సేరుగా వెళ్ళండి; ఆ చివరి గదే,”[2] అని అన్నాడు.

‘చివరి గదా? చివరికి చెంప దెబ్బా? నాకు బాగా కావలసిందే ఇది - వైదేహికి చెప్పకుండా వచ్చినందుకు,’ అని ఎవరో తనని అదేపనిగా చెంపలో

---

[2] ఆ చిన్నవాడు ‘గది’ అన్న పదానికి వాడిన తమిళ పదం ‘అఱై’కి రెండు అర్థాలు - గది, చంపదెబ్బ - ఉండడం వలన ఇక్కడ శేషాద్రి ఆ రెండో పదాన్నే అర్థం చేసుకున్నాడని రచయిత్రి చూపే చమత్కారం.



వాయించుకున్నట్లనిపించింది శేషాద్రికి. ఇంటిలోకి వెళ్ళాలనిపించలేదు. ఆ అబ్బాయిని మళ్ళీ ఆపి "కమలాదేవికి ఇది అందించగలవా?" అని అడిగాడు.

"మీరు కాదంటే తప్పదు. అదేదో తొందరగా ఇవ్వండి. నేను సమయానికి ఈ సరుకులు అందించకపోతే ఆవిడ నన్ను తిడతారు," అన్నాడు ఆ అబ్బాయి.

శేషాద్రి తన తోలు సంచి తెరిచి కమలకి ఇవ్వవలసిన కవరు తీస్తూండగా "బాబూ, నువ్వు ఇంకా ఇక్కడే ఉన్నావా?" అంటూ ఒక కంఠస్వరం వినిపించింది. "నువ్వు కనిపించావు; నాకదే చాలు. నాకొక పావు కిలో టమోటాలు తెచ్చిపెట్టు నాయనా!"

ఆ ధ్వని వచ్చినవైపు శేషాద్రి తిరిగిచూసాడు.

అది కమల గొంతుకే!

"అదిగో, ఆవిడే వచ్చేసారు! అదేదో మీరే స్వయంగా ఆవిడకి అందజేయవచ్చు . . . మీకు పావు కిలో టమోటాలు కావాలా? సరేలెండి," అని అంటూ ఆ అబ్బాయి తూరీగలాగ పరుగలెత్తాడు.

"లోపలికి రండి," అని కమల శేషాద్రిని ఆహ్వానించింది, మూతి బిగించుకొని.

"నేను ఇంటి అద్దె అందజెయ్యాలని వచ్చాను," అని శేషాద్రి గొణుక్కున్నాడు.

"ఇంటి అద్దె?" అని కమల ధైర్యంచేసి అడిగింది.

"అంటే . . . మరేం లేదు . . . " అంటూ ఆలోచిస్తూ శేషాద్రి చెప్పుకుపోతున్నాడు: "నీకివ్వవలసిన మొత్తంకూడా తెచ్చాను . . . "

అతను ఎండలో కమలకి ఇవ్వవలసిన కవరుకోసం ఒంగోని చూస్తుండగా, "ఎండలో ఎందుకలా నిలబడిపోయారు? లోపలికి రండి," అని కమల అనడంతో ఆమెను వెనుబడ్డాడు.

ఆ కట్టడంలో ఏడో ఎనిమిదో ఇళ్లుమాత్రమే ఉన్నాయి. ఇద్దరూ ఆ చిన్న ఇళ్ళ సముదాయంలోని ఇరుకైన కాలిబాటలో - ఆ చిట్టచివరన ఉన్న కమల ఇంటివరకూ - నడిచారు. కమల ఇంటి ముఖద్వారాన్న ఒక అందమైన తెర వేలాడుతోంది. లోపలికి వెళ్ళగానే కమల ఆయనకొక కుర్చీ చూపించి తాను కొంతదూరం నిలబడింది.

ముందు ఎవరు ప్రస్తావన ఆరంభించాలి? దేనిగురించి?

“ఇవాళ ఇంకా నెల మొదటిరోజే; ఇంకా బాగా తెల్లవారలేదుకూడాను,” అని అంటూ కమల కృత్రిమంగా ఒక నవ్వు నవ్వింది. ఆమె ముఖఛాయలో పాలిపోయిన రంగు, లోతుకుపోయిన ఆ కన్నులు, పేలవమైన ఆ నవ్వు చూస్తుంటే శేషాద్రికి కొట్టొచ్చినట్లుగా కనిపించాయి. తన జీవితాన్ని తనే చేజేతుల నాశనం చేసుకున్నందుకు ఆమె తనను తానే నిందించుకుంటుందా? పరిమళభరితమైన సువాసన నిండిన జీవితాన్ని దుర్గంధభయిష్టం చేసుకున్నది ఎవరు?

“నిన్ను చూడాలనిపించింది, అందుకే వచ్చాను,” అన్నాడు శేషాద్రి ఎటువంటి తొట్రుబాటు లేకుండా. డబ్బుతోవున్న కవరుని కమల చేతికి అందించాడు. దాన్ని ఆమె గౌరవంగా అలమారీలో పదిలపరచింది. అందులో ఎంతవుందో అమె లెక్కబెట్టలేదు; ఆయన ఎదుట లెక్కపెట్టుందా?

“ఈ మధ్య నాకు కొంచెం ఆదాయం వస్తోంది. అందువలన ఈ పంపకాలు ఆపుచెయ్యమని మీకు రాద్దామా అనికూడా అనుకున్నాను,” అన్నది కమల. “కాని ఎందుచేతనో అలా రాయలేకపోయాను.”

*“ఎందుచేతనో రాయలేకపోయాను.”*

ఆ మాటలు ఎంత నిష్కపటంగా, నిర్ణయంగా చెప్తోంది! అదే ఆమె గొప్పతనం. గతించిన స్వర్ణయుగంలో ఆమె మాటలూ, ప్రశ్నలూ ఒక గట్టి లాయరు ఏదైనా కేసులో మాట్లాడే తీరున కనిపించాయి. అసలు సమస్య అంతటికీ మొదలు అక్కడే ప్రారంభమైంది!

ఒక క్షణం రెప్పవేయకుండా శేషాద్రి ఆమెను చూసాడు. “మునపటికన్న నా ఆదాయంకూడా బాగానే పెరిగింది,” అని చెప్పదలచుకున్నాడు, కాని నోరు పెగళ్ళేదు.

“నా అంతట నేనే మీకు రాయాలనుకుంటేదాన్ని. ఒక లాయరుగా మిమ్మల్ని మా ఇంటికి ఆహ్వానించాలనుకున్నాను.”

‘అలా ఎన్నిసార్లు అనుకొనివుంటావు?’ అని అడగాలని నాలికచివరవరకూ వచ్చింది శేషాద్రికి. కాని నోరు పెగళ్ళేదు.

“ఒక ముఖ్యమైన విషయంలో నాకు మీ సలహా కావాలి. అది మా ఊళ్లో ఉన్న ఒక ఇల్లు గురించి.”

వృత్తిరీత్యా సలహా కావాలనేసరికి శేషాద్రి మాటతీరులో మార్పు చోటుచేసుకుంది.

కొత్తగా వచ్చిన కక్షీదారుడుతో మాట్లాడేవిధంగా, చాలా ఉత్సాహంతో, "అదేమిటి, వివరంగా చెప్పు!" అని అడిగాడు. కాని మళ్ళీ అంతలోనే తనని తనే నిభాయించుకొని, సర్వసాధారణంగా, ముక్కు, మొహం తెలియనివారిని, పెద్దలని మర్యాదపూర్వకంగా అడుగుతున్నట్టు, మామూలుగా ప్రస్తావించాడు:

"చెప్పు, చెప్పు, అదేమిటో చెప్పు! . . . నేను చూసుకుంటాను. పూర్తి వివరాలు ఇవ్వచ్చుకదా?"

ఆయన వంక ఒకసారి చూసి విస్తుబోయి చూసింది కమల. అలమారినించి ఒక కవరు తీసి అతని ముందు టీపాయిమీద ఉంచింది.

అదురుగొట్టే బాషలో రాయబడిన ఆ ఉత్తరం శేషాద్రి చదువుతూండగా కమల నెమ్మదిగా మరోగదిలోకి తప్పుకుంది. ఆ పక్కగదిలోనుంచి గ్లాసులు, కప్పులు చప్పుడు వినిపించడంతో శేషాద్రి తలెత్తిచూసాడు. అప్పుడే అతను తన చుట్టుపక్కలు గమనించాడు. ఆ గదిలో ప్రతీ వస్తువు చాలా నేర్పుతో ఎన్నికబడి అమర్చివున్నట్టు కనిపించింది. ఒక మూల ఒక తంబూరా - అవును, అది తంబూరావే, వీణ కాదు, (దానికి రెండు పక్కలా బుట్టలు లేవు!) - గోడకి ఒక ముసుకుతో చారబెట్టివుంది. ఎక్కడైనా - ఏ పుస్తకంలోనైనా -కమల-శేషాద్రి అని ఆమె రాసివుంటుందేమో అని శేషాద్రి కాస్త విస్మయం చెందాడు.

పక్కగదిలోనుంచి శబ్దం రాగానే శేషాద్రి దృష్టి మళ్ళీ ఉత్తరంలో పడింది. ఇంతలో చెయిలో కోకో పట్టుకొని కమల ప్రత్యక్షమైంది.

"ఏమిటది?"

"డ్రింక్, ఒక కప్పు పుచ్చుకుంటారా?"

"వొద్దు!" అని తెప్పలేక పోయాడు శేషాద్రి. మెల్లగా, కొంచెం కొంచెంగా కోకో త్రాగసాగాడు.

"మీ ఉళ్లో ఉన్న ఇల్లుగురించి చదివాను. అది మీ అమ్మకి చెందినది, కాబట్చి నీకే రావాలి; అందుకు ఎవరూ అడ్డు చెప్పలేరు . . . ఇక నేను వెళ్తాను. మళ్లీ నిన్ను కలుసుకుంటాను."

శేషాద్రి కుర్చీనుంచి లేచాడు. కమల గుమ్మంవరకూ వచ్చి సాగనంపింది.

"ఏ మాటా చెప్పకుండా మాయమైపోయావు బాబూ", అన్నాడు రిక్షావాడు, బయటకి వస్తున్న శేషాద్రిని చూసి.

"ఇంకొక ఇంటికి వెళ్ళాలయ్యా," అని అంటూ శేషాద్రి రిక్షాలో చదికిలబడ్డాడు. "నమస్తే," అంటూ కమల రెండు చేతులూ జోడించింది. శేషాద్రి అదేవిధంగా బదులిచ్చాడు.

రిక్షా ఆ వీధిమలుపు తిరుగుతుండగా కమల ఇంకా వరండాలో నిల్చుని ఉండడం గమనించాడు శేషాద్రి. అంతలోనే ఆయనలో తళుకుమని ఒక మిశ్రవభావం తలకెత్తింది. క్షమార్హంకాని ఒక పెద్ద తప్పు చేసిన బాధ పట్టుకుంది. కాని, మళ్ళీ అంతలోనే అసాధ్యమైన ఒక పని చేసినందుకు అతను ఒకింత గర్వపడ్డాడు. వైదేహిని గుర్తుచేసుకున్నాడు. ఆమెకు ద్రోహం చేస్తున్నాడా? ఆ ఆలోచనే అతన్ని ఒకింత చకితుణ్ణి చేసింది. అదెలా ద్రోహమౌతుంది? ఇంతకీ కమల ఎవరు? ఆమె ఇంకొకరిని పెళ్ళాడిందా? లేదే? మరి, అలాంటప్పుడు ఎవరైనా తనని ఎలాగ నమ్మకద్రోహిగా నిందించగలరు? కమల తనతో రెండు సంవత్సరాలు కాపురం చేసివుండలేదా?

"కమల! . . . వైదేహి!"

చామన ఛాయ. పెద్ద, నల్ల కన్నులు. ఉంగరాల జుత్తుతో వైదేహి, తన రెండవ భార్య! చాకలెట్ రంగు ఉంగరాల జుత్తు, చక్కని మేనిఛాయతో తన మొదటిభార్య, కమల!

ఇద్దరూ తన భార్యలే. ఇద్దరుతోనూకలిసి తను జీవించలేడా? చట్టం బహుబార్యత్వం అంగీకరించదా? తను ఒక లాయరు, మరి తనకి చట్టంలోని మెళుకువలు తెలియవా?

ఇంటి యజమానికి ఇవ్వాలని తన తోలుసంచిని తెరచినప్పుడే శేషాద్రికి జరిగిన పొరబాటు తెలిసింది. ఒకరికి ఇవ్వవలసిన కవరు ఇంకొకరికి! తనలో తానే నవ్వుకున్నాడు. నలభైరూపాయల కవరు కమలకి వెళ్ళింది. మరొక కవరునుంచి పదిహేను రూపాయలు తీసాడు. యజమాని కవరులోని పాతిక రూపాయలు జోడించి ఇంటి యజమానికి అందజేసాడు.

"ఏమండీ, ఈ నెలవారీ చెల్లింపులకి ఒక చెల్లింపు పెట్టకూడదా?" అని అడిగాడు ఇంటి యజమాని. "నేను ఈ బరువు వొదిలేసుకోవాలని అనుకుంటున్నాను: తూచా ఇల్లు అమ్మెయ్యాలనుకుంటున్నాను. అదేదో మీరే కొనుక్కోకూడదూ?"

"నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి," అన్నాడు శేషాద్రి, చిరునవ్వుతో. ఉన్న ఊళ్లోనే తనెందుకు ఇల్లు కొనాలి? కొన్నిరోజులుగానే మకాం మద్రాసుకి మార్చేద్దామా అని అతను ఆలోచిస్తున్నాడు.

** ** **

గత కొన్ని నెలలుగా కమల సంతకాలతో మనియార్డర్ రసీదులు రాని విషయాన్ని వైదేహి గమనించింది. ఏమైంటుంది?ఏమి కారణం? తన భర్త మనోవర్తి పంపడం మానేసాడా? ఆవడేమో కొత్త సమస్యలు సృష్టించిందా?

తన భర్తని అడగడానికి ఆమె సంశయించింది. ఇటీవల ఆయనకి వృత్తిలో ఒత్తిడి ఎక్కువగా ఉంది. అటువంటి సమయంలో ఆ రెండో ఆడదాన్నిగురించి అతన్నెలా అడగ్గలదు? ఇంటిదగ్గర శేషాద్రి చాలా మనశ్శాంతితో తెరిపిగా కనిపిస్తున్నాడు. అలాంటి మనిషిని తన ప్రశ్నలతో తానెలా తారుమారు చెయ్యగలదు?

చివరికి ఆమె గుమాస్తాని అడిగింది. అతను చెప్పాడు: "మీకు గుర్తుందా? అయ్యగారు కమలాదేవి అనే ఆమెకు ప్రతినెలా మనియార్డరు పంపుతుండేవారు. ఆమెకేదో వ్యాజ్యంలో చికాకు ఏర్పడింది. అయ్యగారు ఆ సమస్య ఆమెకు అనుకూలంగా తీర్మానమయ్యేట్టుగా సహకరించారు. ఒక వేళ ఆమెకు నెలవారీ రావలసిన సొమ్ము అయ్యగారికి ఆవిడ ఇవ్వవలసిన ఫీజుకింద ఏర్పాటు చేసుకొనివుంటారు." ఆ వివరణ వైదేహిని ఒకింత ఆశ్చర్యపరచింది. గుమాస్తాకి అంతకన్నా ఏ వివరాలు తెలియలేదు.

తెలుసుకున్న ఆ వివరాలతోనే సతమతమౌతున్న వైదేహికి ఇంకొక రభస తెలియవచ్చి ఇంకా కొంచెం వేదనకి కారణమైంది. తన పక్కవీధిలో తనకి తెలిసిన ఒకామె మద్రాసులో కమల నిర్వహిస్తున్న హిందీ టీచరు ఉద్యోగంలో చేరడానికి మద్రాసుకి వెళ్ళబోతుందని వైదేహికి తెలిసింది. కమల ముందుగా ఆరోగ్యకారణాలవలన నాలుగు నెలలు శెలవుమీద వెళ్ళాలనుకుంది; కాని ఇప్పుడు

మనసు మార్చుకొని ఆ ఉద్యోగాన్ని ఏకంగా రాజీనామా చేసేసిందట. 'ఆరోగ్యరీత్యా' అనబడే ఈ హఠాత్తు కారణం ఏమైంటుందని అనేక ఊహలకి దారితీసింది.

'కమల ఏదైనా తగనిపని చేసివుండవచ్చా?' అని వైదేహికి ఆశ్చర్యం కలిగింది. తన భర్త హఠాత్తుగా మనోవర్తి పంపించడం మానివేయడానికి బహూశా అది ఒక కారణమై ఉంటుందా? శేషాద్రి లోలోపనే అవమానభారంతో కృంగిపోతున్నాడా? తన భర్తతో దీనిగురించి నిష్కపటంగా మాట్లాడి తేల్చుకోవలసిందే అని వైదేహి దృఢంగా నిశ్చయించుకుంది. అప్పుడే భార్యాభర్తలు మానసిక ఆందోళనలనుంచి బైటపడి నిశ్చింతగా బతకగలరు అని వైదేహి నమ్మింది. క్రమేపి ఆమె ప్రశాంతం కోల్పోయింది. ఏమీ ఆలోచించకపోయింది. 'సంతానం కలిగితే ఇక జీవితంలో దేనిగురించీ పట్టించుకోం; భగవంతుడు మమ్మల్ని పరీక్షుస్తున్నాడు. సంతానం కోసం మేం సతతం ప్రార్ధిస్తూనేవున్నాం,' అని ఆమె తనలో తానే అనుకుంది. 'విడ్డూరం ఏమిటంటే ఇప్పుడు ఈ ఇంట్లోకి ఒక అవాంచిత జీవి రాబోతుంది; అదికూడా కమలకి మరికొంచెం అవమానం గురి చేస్తుంది!' అని వైదేహి విచారంతో కృంగిపోయింది.

ఆ మరునాడు మద్రాసునుంచి తిరిగివచ్చిన శేషాద్రి బడలికతో పూర్తిగా అలసిపోయినట్టు కనిపించాడు; స్నానంతరం భోజనం కానిచ్చాడు; ఆయనేదో దీర్ఘాలోచనలో పడ్డాడు.

ఉదయాన్నే ఏదో పనిమీద అతను బయటికి వెళ్ళాడు. వైదేహి ఆయన దగ్గరకి చేరే సమయానికి అతను మధ్యహాలులో కూర్చొనివున్నాడు; ఒక కాగితం అందించే ముందు ఆమె ముఖంలో ముఖంపెట్టి చూడసాగాడు.

"లేడీడాక్టరు ఇచ్చినదేనా ఈ రిపోర్టు?" అని అడిగింది ఆయన భార్య, అది చదువుతూనే. దాన్ని అవగాహన చేసుకొని జీర్ణించుకోవడానికిముందు దాన్ని పదే పదే చదివింది; పూర్తిగా అదిరిపడిపోయింది: "ఇది నిజమేనా?" కొన్ని సంవత్సరాలక్రితం తనకి గర్భస్రావం జరిగినప్పుడు ఆ లేడీడాక్టరు  ఆపరేషన్ చేసిన విషయం గుర్తుంది. కాని ఆ సమయంలో వైదేహి మళ్ళీ ఎప్పటికీ గర్భం ధరించే అవకాశంలేదన్న సంగతి ఆమె కుండబద్దగొట్టినట్టు చెప్పలేదు. కాని ఆ తరువాత శేషాద్రి తన భార్యని ఇంటికి

తీసుకురావడానికి హాస్పిటల్ కి వెళ్ళినప్పుడు అదే విషయం లేడీడాక్టరు రాతమూలంగా తన భర్తకి తెలియజేసివుంది.

ఆ కాగితాన్ని శేషాద్రి చాలా భద్రంగా అట్టిపెట్టివున్నాడు.

"ఈ సంగతి ఇన్ని సంవత్సరాలు ఎందుకు దాచిపెట్టి ఉంచారు?" అని వైదేహి అతన్ని ప్రశ్నించింది. "అదెందుకు ఇప్పుడు చెప్తున్నారు?"

"వైదేహి, నీ మనసు నొప్పించకూడదనుకున్నాను . . . కాని ఇప్పుడు ఒక కొత్త ఒత్తిడి ఎదురైంది."

"ఒత్తిడా? మీరేమంటున్నారు? నాకొక సామెత గుర్తుంది. ఒకసారి చేజారితే ముమ్మాట్లు చెయి జారుతుందంటారు. మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారా?"

"ఇప్పటికేవున్న సమస్యలు చాలకనా, వైదేహీ?" అన్నాడు శేషాద్రి, నిస్సారంగా నవ్వుతూ.

"ఇదిగో చూడు, వైదేహి . . . నేను లాయర్ని. మరొక లాయరు తప్పు చేసినప్పుడు, వృత్తిరీత్యా నేనతన్ని సమర్ధించాలి. ఇప్పుడు నేనే ఆ స్థానంలో నిలబడివున్నాను, నేరస్తుడుగా . . . "

గతుకుమన్నది వైదేహికి. కాని రాబోయే వోటుని తట్టుకోడానికి కావలసిన ధైర్యాన్ని చిక్కబట్టుకుంది.

"మనోవర్తి నిరాకరించడానికి తగినంత మనోధైర్యం చిక్కబట్టుకోలేకపోతున్నానని అంటుందామె. ఐనా సరే, ఈ కుటుంబ సభ్యురాలుగా కొనసాగాలని అంటోంది. ఇప్పుడు కనుక నువ్వు దాన్ని చూసావంటే ఎంతమాత్రం కోపగించుకోలేవు, తెలుసా? . . . ఇప్పుడామె ఒక గృహిణిలాగే ఉంటుంది . . . నెల ప్రారంభమైంది . . . ఇప్పుడు నువ్వే దాన్ని ఆదుకోగలవు, వైదేహి . . . "

ఒక క్షణంలో సంగతేమిటో అంతా అర్ధమైపోయింది వైదేహికి; ఐనా తనని తాను అమరిక సంభాళించుకునేందుకు ప్రయత్నించింది.

తన అంతరంగంలో పెల్లుబడుతున్న కలవరం ఇముడ్చుకుంటూ, బెక్కులతో కట్టలు చెంచుకొని వస్తూన్న దుఃఖం బట్టబయలు చేసింది:

"నేను క్షమించడం అనే ప్రశ్న ఎక్కడుంది?" అని అడిగి వైదేహి ఒక క్షణం ఆగింది. "అయినదేదో అయింది, మూడో భార్య ప్రసక్తి లేదుకదా?"

వైదేహి నవ్వులో కలత, శోకంతోబాటు మరేం దాచుకొని ఉన్నాయి? ఇక ఈ నూతన కొంగ్రొత్త మాసం ఎలా ఉండబోతుందో?

********

**(మూలం ప్రచురణ: కలైమగళ్, జూన్, 1951)**



(రచయత్రి వింధియా భర్త Prof. V. సుబ్రహ్మణ్యంతో)